అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

బుధవారం 08-11-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 308 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 10 పేజీలు + టాబ్లాయిడ్ 12 పేజీలు | వెల : 6.50

మహారాష్ట్ర పంచాయతీల్లో సీపీఐ(ఎం) విజయాలు

ముంబయి : మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో తలసరి, దహను తహసీల్‌లోని గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 13 గ్రామాల్లో 8 సర్పంచ్‌లు, 100 గ్రామ పంచాయతీ సభ్యుల స్థానాలను సీపీఐ(ఎం) గెలుచుకుంది. మహారాష్ట్రలోని కొన్ని గ్రామ పంచాయతీ ఎన్నికలు ఈ నెల 5న జరిగాయి. వాటిలో పాల్ఘర్ జిల్లాలోని తలసరి, దహను తహసీల్‌లోని కొన్ని గ్రామాలున్నాయి. వాటికి సంబంధించిన ఫలితాలు విడుదలయ్యాయి. తలసరి తహసీలులో కవాడ నుంచి దర్శన బోధలే, కరాజ్‌గావ్ నుంచి సంగీత ధోడాడే, ఉధ్వ ...7లో

బీజేపీని గెలిపిస్తే బీసీనే సీఎం



తెలంగాణలో ఎస్సీ, ఎస్టీ, బీసీ విరోధి ప్రభుత్వం

- ఈ నెల 30 తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం కనుమరుగు
- ఐదేండ్లపాటు పేదలకు ఉచిత రేషన్ ఇస్తాం
- బీసీ ఆత్మగౌరవ సభలో ప్రధాని నరేంద్రమోడీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలో బీసీ సామాజిక తరగతులకు న్యాయం జరగాలన్నా, బీసీ ఎమ్మెల్యే సీఎం కావాలన్నా బీజేపీని గెలిపించాలని ప్రధాన మంత్రి నరేంద్రమోడీ పిలుపునిచ్చారు. పేదలకు వచ్చే ఐదేండ్ల పాటు ఉచిత రేషన్ ఇస్తామని చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో బీజేపీ ఆధ్వర్యంలో బీసీ ఆత్మగౌరవ సభను నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన మోడీ మాట్లాడుతూ.. 2013లో ఎల్బీ స్టేడియంలో జరిగిన సభతో ఎంతో స్ఫూర్తి పొందాననీ, ఆ సభ తర్వాతే ప్రధాని అయ్యానని గుర్తుచేసుకున్నారు. తెలంగాణలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వ్యతిరేక, అవినీతి ప్రభుత్వం ఉందని విమర్శించారు. నవంబర్ 30 తర్వాత తెలంగాణలో బీఆర్ఎస్ సర్కార్ కనుమరుగై కమల వికాసం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నీళ్ల నిధులు, ...7లో

సింగరేణిని ముంచిందే కాంగ్రెస్

ఆ పార్టీకి ఢిల్లీలో బాస్‌లు.. బీఆర్ఎస్‌కు ప్రజలే బాస్‌లు

- సింగరేణి ప్రయివేటీకరణకు కేంద్రం యత్నం
- ఎన్నికల్లో బీసీలు తమ చైతన్యాన్ని చూపించాలి
- ధరణితో దళారీ వ్యవస్థ లేకుండా చేశాం
- పార్టీల చరిత్ర, ఎవరికి ఓటేస్తే లాభమో చూడాలి :ప్రజా ఆశీర్వాద సభల్లో ముఖ్యమంత్రి కేసీఆర్

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి/ మంథని/పెద్దపల్లి

తెలంగాణకు కొంగు బంగారమైన సింగరేణికి 144 సంవత్సరాల చరిత్ర ఉందని, ఈ సంస్థను ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం నడుప చేతకాక ముంచిందని సీఎం కేసీఆర్ విమర్శించారు. తెలంగాణ వచ్చిన తర్వాత ప్రభుత్వ నిర్ణయాలు, కార్మికుల కష్టంతో రూ.2184కోట్ల లాభాల్లోకి వచ్చిందని గుర్తుచేశారు. దసరా, దీపావళి పండుగలకు రూ.వెయ్యికోట్ల బోనస్ పంపిణీ చేసినట్టు వివరించారు. సింగరేణిలో 45వేల మందికి ఇండ్ల స్థలాలకు పట్టాలు జారీ చేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం డిపెండెంట్ ఉద్యోగాలు పోగొడితే.. తమ ప్రభుత్వం ఇప్పటివరకు 19,400 ఉద్యోగాలు కల్పించిందని తెలిపారు. పార్టీలు, ...7లో



గోప్యత వారి హక్కు

జర్నలిస్టుల డిజిటల్ పరికరాల స్వాధీనం తీవ్రమైన అంశం

- వార్తలకు సంబంధించి సొంత సోర్సులు వారికి ఉంటాయి
- సమతుల్యం పాటించాలి
- ఏజెన్సీలతో నడిచే ప్రభుత్వం కాకూడదు
- సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం
- నెల రోజుల్లో మార్గదర్శకాలు రూపొందించాలి : కేంద్రానికి సుప్రీం ఆదేశం
- డిసెంబరు 6కు విచారణ వాయిదా



న్యూఢిల్లీ : మీడియాలో పనిచేసే జర్నలిస్టులు, ఉద్యోగులు వార్తలను సేకరించేందుకు సోర్సుల కాంటాక్ట్‌లు కలిగివున్న డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకోవడం అత్యంత తీవ్రమైన అంశమని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. దర్యాప్తు కోసం వారి పరికరాలను స్వాధీనం చేసుకోవాల్సి వస్తే.. అందుకు ప్రత్యేకమైన మార్గదర్శకాలను రూపొందించాల్సిన అవసరముందని అభిప్రాయపడింది. దేశంలోని దర్యాప్తు సంస్థలు జర్నలిస్టులను విచారించేందుకు, వారి నుంచి పత్రాలు, హార్డ్ డిస్కులు, ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు వంటివి స్వాధీనం చేసుకునేందుకు ప్రత్యేక విధివిధానాలను రూపొందించాలని కోరుతూ ఫౌండేషన్ ఫర్ మీడియా ప్రొఫెషనల్స్ దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సుధాంషు ధులియాలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. "ఇది చాలా తీవ్రమైన అంశం. మీడియా ప్రొఫెషనల్స్ డిజిటల్ పరికరాల తనిఖీలు, స్వాధీనం కోసం ప్రత్యేకమైన మార్గదర్శకాలు ఉండాలి. మీడియా వ్యక్తులకు వారి సొంత సోర్సులు ఉంటాయి. గోప్యత హక్కు అనేది ప్రాథమిక హక్కు. దానిలో సమతుల్యం పాటించాలి" అని సుప్రీం కోర్టు ధర్మాసనం పేర్కొంది. జర్నలిస్టు డిజిటల్ పరికరాల స్వాధీనం కోసం ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించాలని ఈ సందర్భంగా కేంద్రానికి సూచించింది.

> దేశంలో చాలా మంది పాత్రికేయులు ప్రతీకార దాడులు జరుగుతాయనే భయంతో పనిచేస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ అంశాలకు సంబంధించి కొంతమంది జర్నలిస్టులు రాసే వార్తలను ప్రభుత్వం అంగీకరించడంలేదు. వారిని కట్టడి చేసేందుకు సోదాల పేరిట ప్రతీకార దాడులకు పాల్పడుతూ భయభ్రాంతులకు గురిచేస్తోంది" అని ఇటీవల 15 మీడియా సంస్థలు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్‌కు లేఖ రాశాయి. ఇటీవలి న్యూస్‌క్లిక్ ఆన్‌లైన్ పోర్టల్‌లో పనిచేసే 46 మంది జర్నలిస్టులు, ఉద్యోగుల ఇండ్లలో ఢిల్లీ పోలీసులు సోదాలు చేసి, వారి డిజిటల్ పరికరాల(ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు, హార్డ్ డిస్కులు)ను స్వాధీనం చేసుకున్న విషయాన్ని కూడా వారు ప్రస్తావించారు

ఇందుకోసం నెల రోజుల గడువు ఇస్తున్నట్టు తెలిపింది.

"మీరు కోరుకుంటే మేం మార్గదర్శకాలను రూపొందిస్తాం. కానీ మీరు చేస్తే బాగుంటుందని అనుకుంటున్నాం. ఏజెన్సీలతో నడిచే ప్రభుత్వం కాకూడదు" అని ధర్మాసనం స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వం తరపున హాజరైన అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు సమాధానమిస్తూ.. ఇలాంటి పరికరాలను పరిశీలించకుండా అధికారులను ఆపలేమని అన్నారు. అయితే ఎలాంటి మార్గదర్శకాలు లేనప్పుడు ఇలాంటి అంశాలపై ప్రభుత్వానికి అధిక అధికారాలు ఇస్తే అది ప్రమాదకరమని ధర్మాసనం పేర్కొంది. అనంతరం ఈ పిటిషన్‌పై తదుపరి విచారణను డిసెంబరు 6కి వాయిదా వేసింది.

కొలీజియం సిఫార్సులన్నింటిని ఆమోదించాలి

- ప్రభుత్వానికి నచ్చిన వారిని ఎంపిక చేయకూడదు
- సెలెక్టివ్‌గా నియామకాలు జరిగితే సీనియారిటీ క్రమానికి విఘాతం
- ప్రభుత్వం సమస్యను పరిష్కరించాలి..
- లేకుంటే ఉత్తర్వుల జారీకి వెనుకాడబోం : సుప్రీంకోర్టు ధర్మాసనం

వివరాలు 9లో

కాంగ్రెస్‌తో ఇక చర్చల్లేవ్

మరో మూడు స్థానాలకు అభ్యర్థులు ఖరారు : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం




నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

కాంగ్రెస్‌తో ఇక చర్చలకు తావు లేదని, 19 నియోజకవర్గాల్లో సీపీఐ(ఎం) పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం స్పష్టం చేశారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 16 నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించామని, తాజాగా మరో మూడు స్థానాలకు ఎంపిక చేశామన్నారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇల్లందు నియోజకవర్గంలో సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథాతో చర్చలు జరిపామన్నారు. అనివార్యంగా తామే పోటీ చేయాల్సి వస్తుందని, ఈ స్థానం నుంచి గిరిజన సంఘం నాయకులు దుగ్గి కృష్ణ బరిలో ఉంటారని ప్రకటించారు. అలాగే ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని కోదాడ స్థానం నుంచి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మట్టిపల్లి సైదులు, మునుగోడు నుంచి దోనూరి నర్సిరెడ్డి పోటీలో ఉంటున్నట్టు తెలిపారు. కోమటిరెడ్డి రాజగోపాల్ తిరిగి కాంగ్రెస్‌లో చేరి మునుగోడు నుంచి పోటీ చేస్తున్నారనీ, కాంగ్రెస్‌తో పొత్తు ఉన్నప్పటికీ సీపీఐ తమ పార్టీ అభ్యర్థికి మద్దతు ఇవ్వాల్సిందిగా కోరారు.

కాంగ్రెస్ నుంచి స్పందనలు..

కాంగ్రెస్ నుంచి స్పందనలు వచ్చాయని, అఖిల భారత స్థాయిలో తమ పార్టీ నాయకత్వాన్ని ఏఐసీసీ ముఖ్య నాయకులు సోనియాగాంధీ సంప్రదించారని తమ్మినేని తెలిపారు. సీపీఐ తరహాలోనే ఒక అసెంబ్లీ స్థానంతో పాటు రెండు ఎమ్మెల్సీలకు అంగీకరించాల్సిందిగా ప్రతిపాదనలు పంపారని చెప్పారు. కానీ తమ పార్టీ రాష్ట్ర నాయకత్వం కాంగ్రెస్ ప్రతిపాదనను తిరస్కరించిందని తెలిపారు. స్వతంత్రంగా పోటీ చేయడమే ఉత్తమమనే నిర్ణయానికి వచ్చామన్నారు. దీన్ని బట్టి ఇకమీదట కాంగ్రెస్‌తో ఎలాంటి చర్చలకు అవకాశం లేదని స్పష్టంచేశారు. పార్టీ కమిటీల అభిప్రాయాలకు అనుగుణంగా ...7లో

కొత్తగూడెం సీపీఐ అభ్యర్థిగా కూనంనేని



- బీఫారం అందించిన నారాయణ, అజీజ్‌పాషా, చాడ

వివరాలు 7లో



వాయిదాలపై పరిశీలిస్తా

- అదానీ-హిండెన్‌బర్గ్ కేసుపై సీజేఐ

న్యూఢిల్లీ : అదానీ-హిండెన్‌బర్గ్ వ్యవహారంలో దాఖలైన పలు పిటిషన్లు ఇంకా సుప్రీంకోర్టులో విచారణకు రావడం లేదు. ఈ కేసులో ఆగస్ట్ 26న విచారణ జరగాల్సి ఉన్నప్పటికీ అది వాయిదా పడింది. రెండు నెలలు దాటినప్పటికీ పిటిషన్లు నేటి వరకూ విచారణకు నోచుకోలేదు. ఓ పిటిషనర్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ దీనిపై అసహనం ...7లో

గాంధీభవన్ వద్ద టికెట్ల లొల్లి

పటాన్‌చెరు టికెట్‌పై నిరసన

- వనపర్తి అభ్యర్థి మార్పుపై ఆగ్రహం



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

గాంధీభవన్ వద్ద టికెట్ల లొల్లి జరిగింది. కాంగ్రెస్ మూడో జాబితాలో రెండు పేర్లు మార్చడం, పటాన్‌చెరు నియోజకవర్గానికి కాట శ్రీనివాస్‌గౌడ్‌ను కాదని పార్టీలో కొత్తగా చేరిన నీలం మధుకు టికెట్ కేటాయించడం పట్ల నిరసనలు తెలిపారు. మంగళవారం గాంధీభవన్‌లో ఆయా నియోజకవర్గాలకు చెందిన కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు. ముఖ్యంగా అక్కడ టికెట్ ఆశించిన కాట శ్రీనివాస్‌గౌడ్ అనుచరులు ఆందోళనకు దిగారు. ఈ పరిస్థితులతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. అనంతరం ఆందోళనకారులను పోలీసులు అక్కడి నుంచి తరలించారు.కొంత మందిని అరెస్టు చేశారు. పరిసర ప్రాంతాల్లో భద్రతను పెంచారు. ఇదిలా ఉండగా పటాన్‌చెరు టికెట్ కాట శ్రీనివాసగౌడ్‌కు ఇవ్వకపోవడం పట్ల మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ అసంతృప్తి వ్యక్తం చేశారు. తన ప్రమేయం లేకుండానే జహీరాబాద్ టికెట్ కేటాయించడం పట్ల ఆయన అసహనం ...7లో

ముగిసిన పోలింగ్..

మిజోరంలో ప్రశాంతం.. 77.04శాతం నమోదు

- ఛత్తీస్‌గఢ్‌లో పలు జిల్లాల్లో ఉద్రిక్త పరిస్థితులు.. 70.87శాతం పోలింగ్



ఐజ్వాల్/రాయ్‌పూర్: ఈశాన్య రాష్ట్రం మిజోరం, ఛత్తీస్‌గఢ్‌లోని 20 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికల పోలింగ్ ముగిసింది. మిజోరంలోని 11 జిల్లాల వ్యాప్తంగా 40 స్థానాల్లో సాయంత్రం 5గంటల వరకు 77.04శాతం పోలింగ్ నమోదైంది. ఇక్కడ సెర్చిప్ జిల్లాలో రికార్డు స్థాయిలో 83.96శాతం పోలింగ్ నమోదైనట్టు అధికారులు ...7లో



బీహార్‌లో 65% కు రిజర్వేషన్లు

- 10 శాతం ఇడబ్ల్యుఎస్ కోటా అదనం: నితీష్ సర్కార్ నిర్ణయం

పాట్నా : రిజర్వేషన్ల విషయంలో ముఖ్యమంత్రి నితీష్ కుమార్ నేతృత్వంలోని బీహార్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో రిజర్వేషన్లు 65 శాతానికి పెంచాలని ప్రతిపాదించింది. ప్రస్తుతం ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి, ఇబిసి వర్గాల వారి రిజర్వేషన్లు 55 శాతం ఉండగా, తాజాగా వాటిని 65 శాతానికి పెంచాలని నిర్ణయించింది. ఆర్థికంగా బలహీన తరగతులకు (ఇడబ్ల్యుఎస్) కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన 10 శాతం రిజర్వేషన్లు దీనికి అదనం. బీహార్ ప్రభుత్వం, కేంద్రం కల్పిస్తున్న రిజర్వేషన్లు కలిపి రాష్ట్రంలో మొత్తం రిజర్వేషన్లు 75 శాతానికి చేరుకోనుంది. దీనిపై నిపుణులతో సంప్రదింపుల తర్వాత అవసరమైన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి నితీష్ కుమార్ తెలిపారు. అయితే ఒబిసి మహిళలకు కేటాయించిన మూడు శాతం కోటాను రద్దు చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. తాజా ప్రతిపాదనల ప్రకారం.. షెడ్యూల్డ్ ...9లో

వేములవాడ తుల ఉమకే

- పంతం నెగ్గించుకున్న ఈటల
- బీజేపీ స్టేట్ ఆఫీస్ వద్ద కార్యకర్త ఆత్మహత్యాయత్నం

వివరాలు 6లో

International Labour Organization

వీధినపడ్డ 3.9 లక్షల ఉద్యోగులు

- గాజా, వెస్ట్‌బ్యాంక్‌పై ఇజ్రాయిల్ దాడి ఫలితం
- యుద్ధం కొనసాగితే పరిస్థితి మరింత తీవ్రమవుతుందన్న ఐఎల్ఓ

గాజా స్ట్రిప్ : పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ జరుపుతున్న అమానుష దాడుల కారణంగా గాజా స్ట్రిప్, వెస్ట్‌బ్యాంక్ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పరిస్థితి దారుణంగా ...7లో

ఇజ్రాయిల్ మారణకాండకు ముగింపు పలకాలి

ఐరాస ఆమోదించిన కాల్పుల విరమణను అమలుచేయాలి

- పాలస్తీనా సంఘీభావ సభలో వామపక్ష నేతల డిమాండ్
- మారణహోమానికి అమెరికా ఆర్థిక, సైనిక మద్దతు : సీతారాం ఏచూరి



న్యూఢిల్లీ : గాజాలో ఇజ్రాయెల్ సాగిస్తున్న మారణకాండకు స్వస్తి పలకాలని, చిక్కుకున్న మహిళలు, చిన్నారులను తక్షణమే ఆదుకోవాలని వామపక్షాల ఉమ్మడి సమావేశం డిమాండ్ చేసింది. ఐక్యరాజ్యసమితి ఆమోదించిన మానవతావాద కాల్పుల విరమణను వెంటనే అమలుచేయాలని పిలుపునిచ్చింది. ఆత్మరక్షణ ముసుగులో జియోనిస్ట్ రాజ్యం సాగిస్తున్న మారణహోమాన్ని ఈ సమావేశం తీవ్రంగా ఖండించింది. మంగళవారం నాడిక్కడ హరికిషన్ సింగ్ సూర్జిత్ భవన్‌లో సీపీఐ(ఎం), సీపీఐ, సీపీఐ ఎంఎల్, ఆర్ఎస్‌పీ, ఫార్వర్డ్ బ్లాక్ పార్టీల ఆధ్వర్యంలో జరిగిన సదస్సుకు భారత్‌లోని పాలస్తీనా రాయబారి అద్నాన్ అబు అల్హైజా హాజరయ్యారు.

ఈ సందర్భంగా సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మాట్లాడుతూ గాజాలో ఇజ్రాయిల్ ఏకపక్షంగా మారణహోమం చేస్తున్నదని, రెండు సైన్యాల మధ్య యుద్ధం కాదని, కనీవినీ ఎరుగని మారణకాండ అని ఆరోపించారు. శరణార్థి శిబిరాలు, ఆస్పత్రుల్లోనూ అంతర్జాతీయ చట్టాలు ఉల్లంఘించబడ్డాయన్నారు. బాంబులు దాడి జరుగుతుందని తెలిపారు. హమాస్ ఉనికి లేని వెస్ట్ బ్యాంక్‌లో ఇజ్రాయెల్ ఎందుకు బాంబులు వేస్తోంది? అమెరికా, దాని మిత్రదేశాలు వారి మారణహోమానికి ఆర్థిక, సైనిక మద్దతును అందిస్తున్నాయని విమర్శించారు. కాల్పుల విరమణ కోసం ఒత్తిడిని తీవ్రతరం చేసే పోరాటంలో భారతీయులందరూ పాల్గొనాలని ఏచూరి పిలుపునిచ్చారు. వామపక్షాల ...9లో

ప్రభుత్వ ఆస్తులు బడా కార్పొరేట్లకు

దోచిపెట్టేందుకే ఈ యత్నాలు

మోడీ సర్కార్‌పై సీఐటీయూ నేతల విమర్శలు

- జమ్మూ కాశ్మీర్ ప్రభుత్వ ఆదేశాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్
- జమ్మూ, శ్రీనగర్‌ల్లో నిరసన ప్రదర్శనలు

శ్రీనగర్ : విద్యుత్, రైల్వేలు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు, స్మార్ట్ మీటర్లను నెలకొల్పడానికి వ్యతిరేకంగా సిఐటియు జమ్మూ శ్రీనగర్‌ల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించింది. దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఈ నిరసనలు జరిగాయి. సమ్మెలు, ధర్నాలు చేస్తున్న ఉద్యోగులను హెచ్చరిస్తూ జారీ చేసిన ఆదేశాలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసింది.

శ్రీనగర్‌లో జరిగిన ప్రదర్శనను ఉద్దేశించి సిఐటియు అధ్యక్షుడు మహ్మద్ యూసుఫ్ తరిగామి ప్రసంగించారు. కార్మిక లోకం ఎదుర్కొంటున్న సమస్యలపై ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్‌ను ప్రైవేటీకరించడం వల్ల మార్కెట్ ద్వారా వినియోగదారులపై గుత్తాధిపత్యాన్ని నెలకొల్పే ప్రమాదముందని హెచ్చరించారు. విద్యుత్ ఉత్పత్తి, రవాణా, పంపిణీ ఇలా అన్ని విభాగాలను ప్రైవేటు పరం చేయడానికి ప్రభుత్వం పూనుకుంటోందని, తద్వారా ప్రభుత్వ పంపిణీ వ్యవస్థను మొత్తంగా ధ్వంసం చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా వుందని తరిగామి విమర్శించారు. రైల్వేల ప్రైవేటీకరణ వల్ల కూడా తీవ్ర పర్యవసానాలు తలెత్తే ప్రమాద ముందన్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల అనూహ్యంగా వచ్చే బిల్లులను వినియోగదారులు ఎంత మాత్రమూ భరించలేరని అన్నారు.

ప్రజల నుండి తీవ్ర అసమ్మతి వ్యక్తమవుతున్నా ప్రభుత్వం మాత్రం తన చర్యలతో ముందుకెళుతోందన్నారు. తగినంత విద్యుత్ తమకు కావాలి తప్ప మీటర్లు మాత్రమే కాదన్నారు. సమ్మెలకు దూరంగా వుండాలని, లేని పక్షంలో క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని ఉద్యోగులను హెచ్చరిస్తూ ఇటీవల జమ్మూ కాశ్మీర్ ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని తరిగామి కోరారు. ఐఎల్ఓ నిబంధనలకు ఈ ఆదేశాలు వున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నేత అబ్దుల్ రషీద్ పండిట్, రైతు సంఘ నేత గులాం మహ్మద్ షా, యువజన నేత మహ్మద్ అబ్బాస్ ప్రసంగించారు.



జమ్మూలో

జమ్మూలో కూడా సిఐటియు నేతృత్వంలో నిరసన ప్రదర్శన చోటు చేసుకుంది. ప్లకార్డులు చేబూనిన ఆందోళనకారులు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నయా ఉదారవాద విధానాల అమల్లో భాగంగానే ప్రభుత్వం రైల్వేల ప్రైవేటీకరణకు ప్రయత్నిస్తోందని, తద్వారా ప్రైవేటు వ్యక్తులు రైల్వే భూమిని తమ వాణిజ్య ప్రయోజనాలకు స్వేచ్ఛగా వాడుకోవడానికి వెసులుబాటు వుంటుందని సిఐటియు వర్కింగ్ ప్రెసిడెంట్ ఓం ప్రకాష్ విమర్శించారు. సిఐటియు ప్రధాన కార్యదర్శి జగదీష్ రాజ్ శర్మ మాట్లాడుతూ, ఉద్యోగులపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామంటూ హెచ్చరించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ఉద్యోగుల న్యాయమైన హక్కులపై దాడి ఇదని అన్నారు. ప్రజా ధనంతో నిర్మితమైన రైల్వేలను తమ వశం చేసుకుని పెద్ద ఎత్తున లాభాలు ఆర్జించడానికి బడా కార్పొరేట్లు చూస్తున్నారంటూ యునైటెడ్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (యుఎస్‌టిఎ) నేత హరి సింగ్ విమర్శించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ నేత కిషోర్ కుమార్ కూడా ప్రసంగించారు.

బీఆర్ఎస్ అలంపూర్ అభ్యర్థి మార్పు

- అబ్రహంకు నిరాశ- విజయుడుకు టిక్కెట్
- మొత్తం 119 స్థానాలకు బీ-ఫామ్‌ల అందజేత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నామినేషన్ల ఘట్టం ఊపందుకున్న వేళ అధికార బీఆర్ఎస్... ఇంతకుముందు ఆలంపూర్ అభ్యర్థిగా ప్రకటించిన అబ్రహాంకు షాక్‌నిచ్చింది. ఆయన స్థానంలో ఎమ్మెల్సీ చల్లా వెంకటరామిరెడ్డి అనుయాయుడు విజయుడుకు ఆ స్థానాన్ని కేటాయించింది. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆయనకు మంగళవారం బీ-ఫామ్‌ను అందజేశారు. దీంతోపాటు చాంద్రాయణగుట్ట నుంచి ఎం.సీతారాం రెడ్డికి, యాకుత్‌పూరా నుంచి సామా సుందర్‌రెడ్డికి, బహదూర్‌పూరా నుంచి ఇనాయత్ అలీబాక్రీకి, మలక్‌పేట నుంచి తీగల అజిత్‌రెడ్డికి, కార్వాన్ నుంచి అయిందాల కృష్ణకు, చార్మినార్ నుంచి సలావుద్దీన్ లోడీకి, నాంపల్లి నుంచి సీహెచ్ ఆనందకుమార్ గౌడ్‌కు, గోషామహల్ నుంచి నందకిషోర్ వ్యాస్‌కు టిక్కెట్లను ఖరారు చేశారు. ఈ మేరకు సీఎం కేసీఆర్ ఆదేశాలు జారీ చేయగా... కేటీఆర్ బీ-ఫారాలను అందజేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ మొత్తం 119 స్థానాలకు బీఆర్ఎస్ అభ్యర్థులను ఖరారు చేసి... బీ-ఫారాలను అందజేసింది.

కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు కృషి

- సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం గట్టిగా కృషి చేస్తామని సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్‌పాషా అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో సీపీఐ మలక్‌పేట అసెంబ్లీ నియోజకవర్గం ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి బి స్టాలిన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అజీజ్ పాషా మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అత్యంత నిరంకుశంగా అవినీతి పాలనను అందిస్తున్నారని విమర్శించారు. బీజేపీ విభజన విషపూరిత రాజకీయాలను ప్రజలు చూసి ఆ పార్టీని తన్ని తరిమెందుకు సిద్ధమయ్యారని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని చెప్పారు. పదేండ్లుగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిలువునా మోసం చేస్తున్నాయని విమర్శించారు. తోడు దొంగలైనా బీజేపీ, బీఆర్ఎస్‌లను ఈ ఎన్నికల్లో ఓడించి తగిన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. మతాన్ని అడ్డంపెట్టుకొని మైనార్టీ లను అభివృద్ధికి దూరం చేస్తున్న ఎంఐఎంను కూడా ఓడిం చాలన్నారు. మలక్‌పేట కాంగ్రెస్ అభ్యర్థి షేక్ అక్బర్ మాట్లాడుతూ సీపీఐ మద్దతు ఇవ్వడం పట్ల ధన్యవాదాలు ప్రకటించారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే మలక్‌పేట ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడానికి కృషి చేస్తానని అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటి నరసింహ, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్ ఛాయాదేవి, జిల్లా సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, నాయకులు బాలకృష్ణ, ఎస్ఏ మన్నన్, చైతన్య, ఏఐవైఎఫ్ అధ్యక్షులు వలీ ఉల్లాహ్ ఖాద్రి, ప్రధాన కార్యదర్శి కె ధర్మేంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ నిర్లేకంటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కరెంటుపై కట్టుకథలు మానండి :ఎమ్మెల్సీ కవిత

నవతెలంగాణ బ్యూరో, హైదరాబాద్

కరెంటు సరఫరాపై కట్టుకథలు చెప్పడం మానేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి ఎమ్మెల్సీ కవిత సూచించారు. పెద్దపల్లిలో ఎన్టీపీసీ విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేయడం ద్వారా తెలంగాణకు ప్రధాని మోదీ ప్రభుత్వం నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా చేస్తున్నదంటూ కిషన్ రెడ్డి సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విట్టర్)లో చేసిన పోస్టుపై కవిత స్పందించారు. తెలంగాణ విద్యుత్తు పీక్ డిమాండ్ 15,500 మెగావాట్లుగా ఉంటే ఎన్టీపీసీ ద్వారా తెలంగాణకు కేవలం 680 మెగావాట్లు మాత్రమే సరఫరా అవుతుందన్నారు. తెలంగాణ వినియోగిస్తున్న విద్యుత్‌లో పెద్దపల్లి ఎన్టీపీసీ ద్వారా వస్తున్నది కేవలం నాలుగు శాతం మాత్రమేనని స్పష్టం చేశారు. కాబట్టి కేంద్ర ప్రభుత్వమే నిరంతర విద్యుత్‌ను అందజేస్తుందంటూ అబద్ధాలను వ్యాప్తి చేయడం మానుకోవాలని అన్నారు.

రక్షణ నినాదం.. రణ చైతన్యం

- విశాఖ ఉక్కు పోరాటానికి వెయ్యి రోజులు

విశాఖ : 'విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు' ... ఇది కేవలం నినాదం కాదు. ఆంధ్రుల ఆత్మగౌరవ చిహ్నం! ఆనాడైనా ...ఈనాడైనా ఆంధ్రావనిని ఏకతాటిపై నిలిపి పోరాటానికి పదును పెట్టిన చైతన్యం!! వెయ్యిరోజులుగా విరామమెరుగక ఎగురుతున్న ప్రైవేటీకరణ వ్యతిరేక, ప్రభుత్వ రంగ పరిరక్షణ పతాకం! అవును ! ప్రజా పోరాటాల చరిత్రలోనే ఇదొక అద్భుత ఘట్టం! నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర బిజెపి ప్రభుత్వ నియంతృత్వ పోకడలపై ఐక్య కార్మిక వర్గం విశాల ప్రజానీకపు మద్దతుతో చేస్తున్న పోరాటం మంగళవారానికి వెయ్యి రోజులకు చేరుతోంది. 'ఎవడురా అమ్మేది?..ఎవడురా కొనేది' అని నినదిస్తూ 32 మంది ప్రాణత్యాగంతో ఏర్పాటైన విశాఖ ఉక్కును విశాఖ ఉక్కును తెగనమ్మాలన్న మోడీ సర్కారు కుట్రలను తిప్పికొట్టడానికి మరింత సమరశీల పోరాటానికి కార్మికులు సిద్ధమౌతున్నారు. 2021 జనవరి 27న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వంద శాతం వాటాల ఉపసంహరణతో స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తామంటూ చేసిన ప్రకటనపై భగ్గుమన్న స్టీల్‌ప్లాంట్‌లోని కార్మిక సంఘాలన్నీ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీగా ఏర్పడ్డాయి. ఐక్యంగా పోరాటాలు నిర్వహిస్తున్నాయి. వీటికి కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద ఏర్పాటు చేసిన శిబిరం పోరాట కేంద్రంగా నిలుస్తోంది. ఓ వైపు కార్మికుల పోరాటం సాగుతుండగా, మరోవైపు కేంద్రంలోని మోడీ సర్కారు స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తిని దెబ్బతీసేలా ఐరన్ ఓర్, గనులు ఇవ్వకుండా, ప్లాంట్‌లోని మూడో బ్లాస్ట్ ఫర్నేస్‌ను రెండేళ్లుగా మూసేసి కుట్రలు సాగిస్తోంది.

అమ్మకం కమిటీలను తిప్పికొట్టిన కార్మికులు

అమ్మకం నిర్ణయం చేసిన తర్వాత మోడీ సర్కారు ప్లాంట్ అంచనా కోసం వేల్యుయేషన్ కమిటీని వేసి ప్లాంట్‌కు పంపగా కార్మికులు అడుగుపెట్టనివ్వకుండా తరిమికొట్టారు.




ఆ మూడు రాష్ట్రాల్లో ఎన్నో సామీప్యతలు


బస్తర్: ఓటు వేయడానికి క్యూలో వేచి ఉన్న ఓటర్లు..


జగ్దల్‌పూర్: బస్తర్ జిల్లాలోని జగదల్‌పూర్‌లోని పోలింగ్ స్టేషన్‌లో తమ ఓటర్ ఐడీనిచూపుతున్న ఓటర్లు



మామిత్: ఓటరు తన వేలికి సిరాతో...


ఐజ్వాల్: ఓటు వేశాక మీడియాతో మాట్లాడుతున్న మిజోరం ముఖ్యమంత్రి జోరంతంగా



జైపూర్: 'కాంగ్రెస్ గ్యారెంటీ యాత్ర' సందర్భంగా వృద్ధ ఓటరు ఆశీర్వాదం తీసుకుంటున్న రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్

వ్యవసాయమే ప్రధాన జీవనాధారం

- కులాలు, మతాల ప్రాబల్యం అధికం
- కాంగ్రెస్, బీజేపీ మధ్యే అధికార మార్పిడి


న్యూఢిల్లీ : నవంబర్‌లో శాసనసభ ఎన్నికలు జరిగే ఐదు రాష్ట్రాల్లో మూడు హిందీ ప్రాంతాలే. ఈ రాష్ట్రాల్లో ఫలితాలను అనేక ప్రధాన అంశాలు ప్రభావితం చేస్తాయి. వీటిలో కులాలు-మతాల వారీగా జనాభా కూర్పు, ఆర్థిక పరిస్థితులు కూడా ఉన్నాయి. ఐదు రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరుగుతుండగా వాటిలో ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లు హిందీ బెల్ట్‌లోనివి. ఈ రాష్ట్రాల్లో సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు దాదాపుగా ఒకేలా ఉండడం విశేషం.

మన దేశంలోని మొత్తం కార్మికుల్లో 45.76% మంది వ్యవసాయం, అటవీ సంపద, చేపల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఎన్నికలు జరిగే హిందీ రాష్ట్రాల్లో ఇది యాభై శాతం పైనే ఉంది. ఛత్తీస్‌గఢ్‌లో 62.61% మంది, రాజస్థాన్‌లో



54.79% మంది, మధ్యప్రదేశ్‌లో 59.78% మంది వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై ఆధారపడ్డారు. అరుణాచల్ ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్ వంటి చిన్న రాష్ట్రాలను మినహాయిస్తే వ్యవసాయం, దాని అనుబంధ కార్యకలాపాలపై ఆధారపడిన కార్మికుల సంఖ్య ఈ రాష్ట్రాల్లోనే అధికంగా ఉంది. అయితే ఈ రాష్ట్రాల్లో వ్యవసాయోత్పత్తులకు మాత్రం విలువ చాలా తక్కువగా ఉంటోంది. ముఖ్యంగా సేవల రంగంతో పోలిస్తే వ్యవసాయోత్పత్తుల విలువ స్వల్పమే. సేవల రంగంలో పనిచేస్తున్న కార్మికుల జాతీయ సగటు 27.75% ఉంటే ఈ మూడు రాష్ట్రాల్లోనూ అది తక్కువగానే ఉంది. ఛత్తీస్‌గఢ్‌లో సేవల రంగంలో కేవలం 18% మంది కార్మికులే పనిచేస్తున్నారు. దీనికంటే రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లో కొంచెం మెరుగు. సేవల రంగంలో ఆరోగ్యం, సమాచారం, విద్య, రియల్ ఎస్టేట్, పాలనా సంబంధమైన సర్వీసులు ఉంటాయి. ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేష్ భాఘెల్, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌లు తమ రాష్ట్రాల్లో నిరుద్యోగ రేటు జాతీయ సగటు కంటే తక్కువగా ఉండేలా చూసుకుంటున్నారు. రాజస్థాన్‌లో మాత్రం






నిరుద్యోగ రేటు జాతీయ సగటు కంటే 1.20 శాతం పాయింట్లు ఎక్కువగా ఉంది. ఏ రాష్ట్రంలో అయినా కులాలు, మతాలే ఎన్నికల ఫలితాలను ఎక్కువగా ప్రభావితం చేస్తాయి. ఎన్నికలు జరిగే హిందీ రాష్ట్రాలు దీనికి మినహాయింపు కావు. ఇటీవల జరిగిన కొన్ని రాజకీయ పరిణామాలు హిందూత్వ వాదనను ముందుకు తెచ్చాయి. అయినప్పటికీ కులాల ప్రాధాన్యతను తక్కువగా అంచనా వేయకూడదు. ఎందుకంటే దేశ చరిత్రలో అవి ఎప్పటి నుండే పాతుకుపోయి ఉన్నాయి. ఎన్నికలు జరిగే మూడు హిందీ రాష్ట్రాల్లోనూ హిందువుల జనాభాయే ఎక్కువ. ఈ మూడు రాష్ట్రాల జనాభాలో అత్యధికంగా 96.6% మంది హిందువులే. ఇక కులాల విషయానికి వస్తే ఛత్తీస్‌గఢ్ జనాభాలో 44.6% మంది ఓబీసీలు. రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో కూడా ఓబీసీల జనాభా అధికంగానే ఉంది. ఈ మూడు రాష్ట్రాల్లోనూ సాధారణ కేటగిరీ జనాభా తక్కువే. రాజస్థాన్‌లో ముస్లింలు అత్యధికంగా 7.8% మంది నివసిస్తున్నారు. ఎన్నికలు జరిగే మూడు హిందీ రాష్ట్రాల మధ్య మరో సామీప్యత ఉంది. అదేమంటే ఈ రాష్ట్రాల్లో రెండు పార్టీల మధ్యే అధికార మార్పిడి జరుగుతోంది. 2003 నుండి ఓటర్లలో 70%కి పైగా ఈ రెండు పార్టీలకే ఓట్లు వేస్తున్నారు. ఎన్నికల రంగంలో ఇతర పార్టీలు కూడా ఉన్నప్పటికీ కాంగ్రెస్, బీజేపీ మధ్యే ప్రధాన పోటీ నడుస్తోంది. ఇక మరో సామీప్యత విషయానికి వస్తే ఈ రాష్ట్రాల్లో 2003 నుండి శాసనసభలకు ఎన్నికైన మహిళల్లో సుమారు సగం మంది రిజర్వ్‌డ్ స్థానాల నుండి గెలిచిన వారే. ఉదాహరణకు ఛత్తీస్‌గఢ్ ఓటర్లు గత నాలుగు అసెంబ్లీ ఎన్నికల్లో 39 మంది మహిళల్ని ఎన్నుకోగా వారిలో 20 మంది రిజర్వ్‌డ్ స్థానాల నుండి గెలుపొందారు.


బీజాపూర్: బీజాపూర్ జిల్లాలోని పోలింగ్ స్టేషన్‌లో ఓటర్లు ఎస్‌వీఈఈపీ మస్కట్‌తో ఫోటోలకు పోజులు..


కంకేర్: ఇంద్రధనస్సు పోలింగ్ బూత్‌లో ఓటు వేసిన ట్రాన్స్‌జెండర్ ఓటర్లు.


రాయ్‌పూర్: తొలిదశ పోలింగ్ సందర్భంగా కేంద్రాల వద్ద పరిశీలించి మాట్లాడుతున్న ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేష్ బఘేల్



ఐజ్వాల్: మిజోరాం అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు తేదీని రీషెడ్యూల్ చేయాలని డిమాండ్ చేస్తూ 'వాకథాన్ మ్యాన్' సామాజిక కార్యకర్త లాల్బియక్తంగా నిరాహార దీక్ష


బలోద్: ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల బహిరంగ సభలో ప్రసంగిస్తున్న ప్రియాంక

రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో మహిళల భాగస్వామ్యం

జైపూర్: మహిళా రిజర్వేషన్‌కు సంబంధించి ఒక చారిత్రాత్మక బిల్లును భారతదేశం తన కొత్త పార్లమెంటులో మొదటి రోజునే ప్రవేశపెట్టింది. ఈ బిల్లులో లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించాలనే ప్రతిపాదనా ఉంది. దీని తర్వాత అసెంబ్లీ, లోక్‌సభ రెండింటిలోనూ మహిళా ప్రాతినిధ్యం కూడా పెరుగుతోంది. అయితే కొన్ని రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను దష్టిలో ఉంచుకునే కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును తీసుకొచ్చినట్లు పలువురు చెబుతున్నారు. అయితే ఇది అమలు కావడానికి దాదాపు ఏడెనిమిదేండ్లు పడుతుంది. అలాంటి పరిస్థితిలో ఎన్నికల రాష్ట్రమైన రాజస్థాన్ అసెంబ్లీలో మహిళల భాగస్వామ్యం ఇప్పటి వరకు ఎలా ఉందో తెలుసుకుందాం.

1972 అసెంబ్లీ ఎన్నికల్లో.... ఏడుగురు మహిళా అభ్యర్థులు బరిలో నిలిచారు. వీరిలో 13 మంది అభ్యర్థులు విజయం సాధించారు. అప్పట్లో రాజస్థాన్‌లో ప్రతి వెయ్యి మంది పురుషులకు మహిళా ఓటర్ల నిష్పత్తి 723గా ఉండేది. అయితే 1977 అసెంబ్లీ ఎన్నికల్లో 31 మంది మహిళా అభ్యర్థుల్లో కేవలం ఒక మహిళా అభ్యర్థి మాత్రమే గెలుపొందారు. ఆ ఏడాది వెయ్యి మంది పురుషులకు 763 మంది మహిళా ఓటర్లు మాత్రమే ఉన్నారు.

1980 అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 31 మంది మహిళా అభ్యర్థులు బరిలో నిలిచారు. వీరిలో కేవలం 10 మంది అభ్యర్థులు మాత్రమే ఎన్నికల్లో విజయం సాధించారు.




1985 ఎన్నికల్లో మొత్తం 45 మంది మహిళలు పోటీ చేయగా 17 మంది మాత్రమే గెలుపొందారు. ఆ ఏడాది వెయ్యి మంది పురుషులకు 728 మంది మహిళా ఓటర్లు మాత్రమే ఉన్నారు.

1990 అసెంబ్లీ ఎన్నికల్లో... 93 మంది మహిళలు టిక్కెట్లు పొందగా అందులో 11 మంది మాత్రమే గెలుపొందారు. అప్పుడు వెయ్యి మంది పురుషులకు 736 మంది మహిళా ఓటర్లు మాత్రమే ఉన్నారు. మూడేండ్ల తరువాత 1993లో మళ్లీ ఎన్నికలు జరిగాయి, ఇందులో మొత్తం 97 మంది మహిళలు పోటీ చేయగా 10 మంది మాత్రమే గెలిచారు. అప్పుడు వెయ్యి మంది పురుషులకు 755 మంది మహిళా ఓటర్లు మాత్రమే ఉన్నారు. ఆ తర్వాత 1998లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 69 మంది మహిళా అభ్యర్థులుండగా.. కేవలం 14 మంది మహిళలు మాత్రమే ఎమ్మెల్యేలు అయ్యారు. అప్పుడు వెయ్యి మంది పురుషులకు 786 మంది మహిళా ఓటర్లు మాత్రమే ఉన్నారు.

2003 అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 118 మంది మహిళా అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలుచోగా కేవలం 12 మంది మహిళలు మాత్రమే గెలుపొందారు. ఈ ఎన్నికల్లో ప్రతి వెయ్యి మంది పురుషులకు 841 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. 2008లో మొత్తం 154 మంది మహిళలు ఎన్నికల్లో పోటీ చేయగా, వారిలో 28 మంది మహిళలు మాత్రమే గెలుపొందారు. ఆ సమయంలో ప్రతి వెయ్యి మంది పురుషులకు 874 మంది మహిళా ఓటర్లు ఉన్నారు.

2013 అసెంబ్లీ ఎన్నికల్లో...166 మంది మహిళా అభ్యర్థులు బరిలో నిలిచారు. వీరిలో 28 మంది మహిళలు మాత్రమే గెలుపొందారు. అప్పట్లో ప్రతి వెయ్యి మంది పురుషులకు 899 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. గత మరియు 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో అత్యధికంగా 189 మంది మహిళలు ఎన్నికల బరిలో నిలిచారు. కేవలం 24 మంది మాత్రమే గెలిచారు. అయితే ఆ తర్వాత వీరి సంఖ్య 27కి పెరిగింది.

ఏ పార్టీ నుంచి ఎంతమంది మహిళా అభ్యర్థులు ..

పార్టీల వారీగా లెక్కల ప్రకారం చూస్తే, 2018లో అంటే గత అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 200 సీట్లలో కాంగ్రెస్ 27 మంది మహిళలకు టిక్కెట్లు ఇచ్చింది. ఇందులో 12 మంది మహిళలు విజయం సాధించారు. భారతీయ జనతా పార్టీ మొత్తం 23 మంది మహిళా అభ్యర్థులను నిలబెట్టగా, కేవలం 10 మంది మాత్రమే విజయం సాధించారు. ప్రస్తుతం రాజస్థాన్ అసెంబ్లీలో మొత్తం 27 మంది మహిళా ఎమ్మెల్యేలు ఉన్నారు. సభలో కాంగ్రెస్ నుంచి 15 మంది, బీజేపీ నుంచి 10 మంది, ఆర్‌ఎల్‌పీ నుంచి ఒక ఎమ్మెల్యే స్వతంత్ర మహిళా ఎమ్మెల్యే ఉన్నారు.

ఊపందుకున్న ఎన్నికల ప్రచారం

- మోడీ వర్సెస్ కాంగ్రెస్ గ్యారెంటీ హామీలు



జైపూర్ :2023 రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ పూర్తి కావడంతో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నేతలు తమ అభ్యర్థులను గెలిపించేందుకు తమ శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్ 'గ్యారంటీ యాత్ర' ప్రారంభించనుంది. మొత్తం 135 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ గ్యారంటీ యాత్ర రథాలు ప్రచారం నిర్వహించనున్నాయి. కేంద్ర మంత్రి అమిత్ షా మంగళవారం రాజస్థాన్‌లో పర్యటించారు. నాగౌర్‌లో మూడు బహిరంగ సభల్లో ఆయన ప్రసంగించారు. ఈ ఎన్నికల్లో మోడీ హామీపై బీజేపీ విశ్వాసం ఉంచగా, గెహ్లాట్ హామీపై కాంగ్రెస్ పందెం వేసింది. కాగా, కాంగ్రెస్ మంగళవారం 'గ్యారంటీ యాత్ర' ప్రారంభించింది. తాజాగా కాంగ్రెస్ 7 హామీలి చ్చింది. ఈ హామీలపై సీఎం అశోక్ గెహ్లాట్ ప్రతి డివిజన్‌లో యాత్రను ప్రారంభించనున్నారు. మొదటి రోజు సీఎం అశోక్ గెహ్లాట్ జైపూర్‌లోని మోతీ డుంగ్రి గణేష్ ఆలయం నుంచి గ్యారెంటీ యాత్రను ప్రారంభించారు. ఇక్కడి నుంచి రాష్ట్రంలోని జైపూర్, జోధ్‌పూర్, కోట, భరత్‌పూర్, ఉదయ్‌పూర్, అజ్మీర్, బికనీర్ డివిజన్లతో పాటు ఇతర జిల్లాల్లో ఏడు డివిజన్లలో సంచరించే రథాలను జెండా ఊపి ప్రారంభించనున్నారు.

ఎంపీలో ధనిక బీజేపీ ఎమ్మెల్యే

- చైతన్య కశ్యప్ వద్ద రూ.296 కోట్ల సామ్రాజ్యం.



ఇండోర్ : మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ముగిసింది. రాష్ట్రంలోని మొత్తం 230 అసెంబ్లీ స్థానాలకు గానూ 2,534 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. 2018 సంపన్న ఎమ్మెల్యేలలో ఒకరైన బీజేపీ అభ్యర్థి చైతన్య కశ్యప్ ఈసారి కూడా రత్లాం జిల్లాలోని రత్లాం సిటీ అసెంబ్లీ స్థానం నుంచి నామినేషన్ దాఖలు చేశారు.ప్రస్తుత ఎమ్మెల్యేలలో అత్యంత ధనిక ఎమ్మెల్యే సంజయ్ పాఠక్. చైతన్య కశ్యప్ రెండో స్థానంలో ఉన్నాడు. ఈసారి వారిద్దరూ దాఖలు చేసిన అఫిడవిట్ ప్రకారం.. పాఠక్ కంటే చైతన్య కశ్యప్ సంపద ఎక్కువైపోయింది. ఈ అఫిడవిట్‌లో చెతన్య కశ్యప్ పేరిట రూ.296 కోట్లకు పైగా ఆస్తులు ఉండగా, సంజయ్ పాఠక్‌కు రూ.242 కోట్లకు పైగా ఆస్తులున్నాయి. కశ్యప్ ఎన్నికల అఫిడవిట్‌లో ఇంకా ఏముందో తెలుసుకుందాం...

ఐదేండ్లలో సంపద ఎంత పెరిగిందంటే?

బీజేపీ ఎమ్మెల్యే చెతన్య కశ్యప్ తన అఫిడవిట్‌లో మొత్తం ఆస్తుల విలువ రూ.296.08 కోట్లుగా ప్రకటించారు. 2018 ఎన్నికల్లో ఆయన మొత్తం ఆస్తుల విలువ రూ.204 కోట్లు. పదేండ్ల కిందట అంటే 2013లో చెతన్య మొత్తం ఆస్తుల విలువ రూ.120 కోట్లు. ఈ విధంగా పదేండ్లలో ఆయన సంపద రూ.176 కోట్లకు పైగా పెరిగింది.2018 ఎన్నికల్లో గెలిచిన అత్యంత సంపన్న ఎమ్మెల్యేల జాబితాలో చైతన్య కశ్యప్ పేరు రెండో స్థానంలో ఉంది. 2018లో ఆయన మొత్తం ఆస్తుల విలువ రూ. 204 కోట్లుగా ప్రకటించారు. ఆ సమయంలో అత్యంత సంపన్న ఎమ్మెల్యేగా బీజేపీ ఎమ్మెల్యే సంజయ్ పాఠక్, కట్నీలోని విజయరాఘవగర్ స్థానం నుంచి గెలుపొందారు. ఆ సమయంలో పాఠక్ తన మొత్తం సంపద రూ.226 కోట్లుగా ప్రకటించారు. ఈ ఎన్నికల అఫిడవిట్‌లో పాఠక్ తన మొత్తం సంపద రూ.242 కోట్లుగా ప్రకటించారు. అదే సమయంలో, కశ్యప్ అతని కంటే ముందు వెళ్లారు.ప్రతి సంవత్సరం చెతన్య కశ్యప్ , అతని భార్య నీతా వార్షిక ఆదాయం గురించి చెప్పాలంటే, ఇది కోట్లలో ఉంది. 2018-19లో కశ్యప్ కుటుంబం మొత్తం ఆదాయం రూ. 1.02 కోట్లు. తర్వాతి ఆర్థిక సంవత్సరంలో ఆదాయాలు క్షీణించాయి. 2019-20లో రూ.88.74 లక్షలకు తగ్గింది. 2020-21లో కుటుంబ ఆదాయం రూ.1.07 కోట్లకు పెరిగింది. అదే సమయంలో 2021-22లో మళ్లీ వసూళ్లు భారీగా పెరిగి రూ.1.28 కోట్లకు చేరుకున్నాయి. కాగా 2022-23లో రూ.1.35 కోట్లు ఆర్జించింది.

రత్లాం-ముంబైలో 16 బ్యాంకు ఖాతాలు

అఫిడవిట్ ప్రకారం బీజేపీ ఎమ్మెల్యే, ఆయన కుటుంబం వద్ద రూ.1,08,815 నగదు ఉంది. బీజేపీ నాయకుడు , అతని కుటుంబ సభ్యులకు రత్లాం , ముంబైలో మొత్తం 16 బ్యాంకు ఖాతాలు ఉన్నాయి, వీటిలో మొత్తం డిపాజిట్లు రూ. 1.43 కోట్లు.చెతన్య కశ్యప్‌కు కంపెనీల్లో షేర్లు, రూ.42.264 లక్షల విలువైన నిధులు ఉన్నాయి. ఇది కాకుండా ఎమ్మెల్యే రూ.60వేలు బీమా ప్రీమియం జమ చేశారు.

200 అసెంబ్లీ స్థానాలకు 3430 నామినేషన్లు దాఖలు

- నేడు పరిశీలన
- 9 వరకు పేర్ల ఉపసంహరణ



జైపూర్: రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల 2023 నామినేషన్ ప్రక్రియ పూర్తయింది. రాష్ట్రంలోని మొత్తం 200 అసెంబ్లీ స్థానాలకు గాను 2605 మంది అభ్యర్థులు 3430 నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. నామినేషన్ పత్రాల్లో కొంత లోపం ఉంటుందన్న భయంతో చాలా మంది అభ్యర్థులు తలా 4 నామినేషన్లు వేశారు. పలువురు డమ్మీ అభ్యర్థులు కూడా నామినేషన్లు దాఖలు చేశారు. నవంబర్ 7వ తేదీ మంగళవారం ఉదయం 11 గంటల నుంచి ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అబ్జర్వర్ సమక్షంలో నామినేషన్ పత్రాల పరిశీలన జరుగుతుంది. నామినేషన్ ఉపసంహరణకు చివరి తేదీ నవంబర్ 9. ఆదర్శ్ నగర్ , భిల్వారాలో అత్యధిక నామినేషన్లు, జైపూర్‌లోని ఆదర్శ్ నగర్, భిల్వారా అసెంబ్లీ స్థానాల్లో గరిష్ఠంగా నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ రెండు స్థానాలకు 31 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. 299 నామినేషన్లు దాఖలైన అత్యధిక నామినేషన్లలో జైపూర్‌లోని సంగనేర్ స్థానం రెండో స్థానంలో ఉంది. భరత్‌పూర్ జిల్లాలోని కమాన్ స్థానానికి 28 మంది, అహెూర్‌లో 27 మంది, అజ్మీర్ నార్త్‌లో 27 మంది, జోధ్‌పూర్‌లోని సుర్‌సాగర్ అసెంబ్లీ స్థానానికి 26 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.

దూదూ, లాల్‌సోట్‌లలో అత్యల్ప నమోదు

రాష్ట్రంలోని దూదూ, లాల్సోట్ అసెంబ్లీ స్థానాల్లో అతి తక్కువ సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ రెండు స్థానాల్లో కేవలం నలుగురు అభ్యర్థులు మాత్రమే నామినేషన్లు దాఖలు చేశారు. చౌహ్తన్ అసెంబ్లీ స్థానానికి 5, సిరోహి జిల్లాలోని రెవ్‌దార్‌కు 6, జైపూర్‌లోని చక్సు అసెంబ్లీ స్థానానికి ఆరుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.

ఓటమికి భయపడని తీతర్

40 ఏండ్లుగా స్వతంత్ర అభ్యర్థిగా ప్రతి ఎన్నికల్లో పోటీ .. పలుమార్లు ఓటమిపాలే

- వృద్ధాప్యంలోనూ గిన్నిస్‌బుక్‌లో రికార్డు కొట్టాలని ఆకాంక్ష

జైపూర్: రాజస్థాన్‌కు చెందిన 70 ఏండ్ల తీతర్ ఓటమికి భయపడడం లేదు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ (ఎంఎన్ రేగా) కింద నమోదిత కార్మికుడైన ఆయన గత 40 ఏండ్లుగా ప్రతి ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నాడు. 1980 నుంచి దాదాపు ప్రతి ఎన్నికల్లో పోటీ చేసినా పలుమార్లు ఓడిపోయారు. ఈ ఎన్నికల్లో లోక్‌సభ, అసెంబ్లీ, పంచాయతీ ఎన్నికలూ ఉన్నాయి. ఇన్ని ఓటములను ఎదుర్కొన్నా వృద్ధాప్యం దరి చేరినా అతనిలో ఉన్న స్ఫూర్తి మాత్రం ఇంకా అంతం కాలేదు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లోనూ తన రాష్ట్రంలోని కరణ్‌పూర్ అసెంబ్లీ స్థానం నుండి బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులను సవాలు చేయడానికి అతను సిద్ధమయ్యాడు.

నివేదికల ప్రకారం తీతర్‌కు ఎలాంటి ఆస్తి లేదు. ఏ పార్టీ ఆయనకు టిక్కెట్ ఇవ్వలేదు. ఏ ప్రభుత్వం ఆయనను, ఆయన కుటుంబాన్ని ఆదుకోలేదు. అయినా ఆయన ప్రతి ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా నిలబడతాడు. 2019లో వార్తా సంస్థ పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో తీతర్ సింగ్ మాట్లాడుతూ "నేను ఎన్నికల్లో నిలబడిన ప్రతిసారి ఓడిపోయాను. అయినా నాలో ఆశ చావలేదు. ఏ ప్రభుత్వం నా కుటుంబాన్ని పట్టించుకోలేదు. తాను గతంలో బీజేపీ, కాంగ్రెస్‌కు ఓటేశా. ఆ రెండు ప్రభుత్వాలు తమ ప్రాంత అభివద్ధికి చేసిందేమీ లేదు.

ఆ క్రమంలోనే 1983లో మొదటిసారి నేను ఎన్నికల్లో పోటీ చేశా. స్థానిక ప్రజలు ఇచ్చిన విరాళాలతో ఎన్నికల్లో నిలబడ్డా" అని తెలిపారు. తీతర్ సింగ్ తన స్నేహితులతో కలిసి ఇంటింటికీ ప్రచారం నిర్వహిస్తున్నాడు. అయితే ఆయన అత్యధికంగా ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థిగా రికార్డును గిన్నిస్ బుక్‌లో నమోదు చేయాలని ఆశ పడుతున్నట్లు సమాచారం. ఈ ఎన్నికల్లో తీతర్‌తో పాటు బీజేపీ అభ్యర్థి సురేంద్ర పాల్ సింగ్, కాంగ్రెస్ అభ్యర్థి గుర్మీత్ సింగ్ కునేర్‌లు బరిలో ఉన్నారు. తీతర్‌కు 2014 అసెంబ్లీ ఎన్నికల్లో 427 ఓట్లు రాగా, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 653 ఓట్లు వచ్చాయి. న్యూస్ 18 ప్రకారం.. 2014 లోక్‌సభ ఎన్నికల్లో 3,924 ఓట్లు రావడంతో డిపాజిట్‌ను కూడా కోల్పోయాడు. డీఎన్‌ఏ నివేదిక ప్రకారం 2018లో ప్రజల నుండి విరాళాలు సేకరించి నామినేషన్ వేశాడు.



200 స్థానాలున్న రాజస్థాన్ అసెంబ్లీలో 2018లో కాంగ్రెస్ 99 సీట్లు గెలుచుకుంది. బీజేపీ 73 సీట్లకు తగ్గింది. అశోక్ గెహ్లాట్ నేతత్వంలో బీఎస్పీ పార్టీ, కొందరు స్వతంత్ర ఎమ్మెల్యేల మద్దతుతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. ఈసారి నవంబర్ 25న రాజస్థాన్‌లో ఓటింగ్ జరగనుండగా, డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు జరగనుంది.

అయితే ఈ ఎన్నికల్లో తీతర్ గెలుపు బాట పడతాడో లేదో వేచి చూడాలి.

నవతెలంగాణ

సత్యాన్ని ధైర్యంగా చెప్పకలేకపోవడమే ప్రపంచంలో సగం అనర్థాలకు కారణం
- హరియట్ బీచర్ స్టోన్

బుధవారం 8 నవంబర్ 2023
www.navatelangana.com

సంపాదకీయం

గవర్నర్లకు 'సుప్రీం' చురక

ఇటీవల గవర్నర్ల పాత్ర, వ్యవహార శైలి, అనుసరిస్తున్న వైఖరితో ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయి. రాజ్యాంగానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయో లేదో పర్యవేక్షించే గవర్నర్.. అందుకు విరుద్ధంగా పాలనా వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటూ అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. విపక్ష పార్టీలకు ఇదొక ప్రధాన సమస్యగా మారింది. ఆ ప్రభుత్వాలు తమకు ప్రాధాన్యత అనుకున్న ఏ ఒక్క పనినీ ముందుకు సాగనీయకుండా అడ్డంకులు సృష్టించడం గవర్నర్లకు పరిపాటైంది. సంవత్సరాల తరబడి బిల్లులను తమ వద్దకు ఉంచుకుని ఆమోదించడం లేదు. దీనిని నిరసిస్తూ కేరళ, తమిళనాడు, పంజాబ్, తెలంగాణ వంటి రాష్ట్రప్రభుత్వాలు కేంద్రం, రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లాయి. అయినా ఫలితం శూన్యం. చివరికి సుప్రీంకోర్టు గడప తొక్కితే గానీ.. న్యాయస్థానం గవర్నర్లకు చురకలు అంటించక తప్పలేదు. రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం పొందిన బిల్లుల్ని గవర్నర్ విధిగా ఆమోదించాలని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. గవర్నర్లు ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులు కారని గుర్తు చేసింది. ముఖ్యంగా ప్రతిపక్ష పార్టీల పాలనలోని కేరళ, తమిళనాడు, పంజాబ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయస్థానాలు తలుపు తట్టే వరకూ గవర్నర్లు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం అలవాటై పోయిదంటూ ఆందోళన వ్యక్తం చేసింది. 'ఇది చాలా తీవ్రమైన విషయం. దీనిని మేం పరిశీలించాల్సి ఉంది. దేశంలో రాజ్యాంగం అమలులోకి వచ్చినప్పటి నుంచి మనం ప్రజాస్వామ్య వ్యవస్థలోనే ఉన్నాం.?' అన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని ప్రధాన న్యాయమూర్తి అన్నారంటే.. ఇకముందు ఏ గవర్నరూ జాప్యానికి కారణం కాకూడదని చెప్పకనే చెప్పారు.

> ముఖ్యంగా ప్రతిపక్ష పార్టీల పాలనలోని కేరళ, తమిళనాడు, పంజాబ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయస్థానాలు తలుపు తట్టే వరకూ గవర్నర్లు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం అలవాటై పోయిదంటూ ఆందోళన వ్యక్తం చేసింది. 'ఇది చాలా తీవ్రమైన విషయం. దీనిని మేం పరిశీ లించాల్సి ఉంది. దేశంలో రాజ్యాంగం అమలులోకి వచ్చినప్పటి నుంచి మనం ప్రజాస్వామ్య వ్యవస్థలోనే ఉన్నాం.?' అన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని ప్రధాన న్యాయమూర్తి అన్నారంటే.. ఇకముందు ఏ గవర్నరూ జాప్యానికి కారణం కాకూడదని చెప్పకనే చెప్పారు.



గవర్నర్ పదవిని రాజకీయాలకు అతీతంగా సమాఖ్య స్ఫూర్తిగా అనుగుణంగా రాజ్యాంగ నిబంధనలకు భంగం వాటిల్లకుండా చూసేలా కేంద్రప్రభుత్వం చొరవ చూపాలని 1994లో ఎస్ఆర్ బొమ్మై వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు పేర్కొంది. అయినా కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు ఆ రకంగా పాటించిన దాఖలాలు అరుదు.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఇది మరింత ఎక్కువైంది. రాజకీయ, శాసన, ఆర్థిక రంగాలపై ఒక పద్ధతి ప్రకారం దాడి వస్తూ వచ్చింది.

రాష్ట్రప్రభుత్వాలు ఆమోదించిన బిల్లుల విషయంలోనూ అదే దాడి. సాధారణంగా గవర్నర్ మంత్రిమండలి సలహాల మేరకు నడచుకోవాలి. మంత్రి వర్గాలు బిల్లులను ఆమోదం కోసం పంపితే గవర్నర్లు కాదనడానికి వీలు లేదు. ప్రజలెన్నుకొన్న శాసనసభలో మెజారిటీ అనుభవిస్తున్న ప్రభుత్వం అదే సభ ఆమోదం పొంది పంపే బిల్లులు ఒకసారి తిప్పి పంపినా మళ్లీ దాన్నే గనుక పంపితే గవర్నర్ ఆమోదించి తీరవల్సిందే. గవర్నర్లకు కొన్ని విధులు మాత్రమే ఉన్నాయని రాజ్యాంగ పరిషత్‌లో జరిగిన చర్చలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్పష్టంగా పేర్కొన్నారు. అయినా పరిధి దాటి గవర్నర్లు వ్యవహరిస్తున్నారు. తెలంగాణలో గత సంవత్సరం సెప్టెంబర్ నుండి పెండింగులో ఉన్న బిల్లుల్ని గవర్నర్ చాలా నెమ్మదిగా ఆమోదిస్తున్న వ్యవహారంపై ఈ ఏడాది ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు జోక్యం చేసుకున్న విషయం తెలిసిందే. తాజాగా కేరళ, తమిళనాడు, పంజాబ్ ప్రభుత్వాలు వాదనలు వినిపించిన నేపథ్యంలో న్యాయస్థానం స్పందించింది. పౌరసత్వ చట్ట సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానాన్ని ఆమోదించినా పెండింగ్‌లోనే ఉంది. విశ్వ విద్యాలయ చట్ట సవరణ బిల్లు, కేరళ సహకార సంఘాల సవరణ బిల్లు, లోకాయుక్త సవరణ బిల్లులు రాజ్‌భవన్ గడపదాటలేదు. పంజాబ్‌లో ఆర్థిక బాధ్యత, పన్ను చట్టాల సవరణ వంటి అంశాలకు సంబంధించిన కీలక బిల్లులకు అదే దుస్థితి. నిట్‌ను తమ రాష్ట్రానికి మినహాయించాలని తమిళనాడు ప్రభుత్వం తీర్మానం చేసినా గవర్నర్ ఆమోదం లభించలేదు. ఇలా రాజ్‌భవన్‌లను సమాంతర అధికార కేంద్రాలుగా కేంద్రం మార్చేసింది. ఎన్నికైన ప్రభుత్వాలను లెక్కచేయని తనంగా వ్యవహరిస్తోంది..

ప్రభుత్వ యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్ల నియామకం విషయంలో గవర్నర్లు అనుసరిస్తున్న వైఖరిని ఎత్తిచూపుతూ ఆయా ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో ఇప్పటికే పిటిషన్లు దాఖలు చేశాయి. గవర్నర్లపై ప్రతిపక్ష పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టును ఆశ్రయించినప్పుడల్లా పరిశీలనలో ఉన్నాయని ప్రభుత్వ న్యాయవాదులు దాటవేయడం రివాజుగా మారింది. ఇది కచ్చితంగా ఫెడరల్ వ్యవస్థపై దాడే. ఈ పరిస్థితి మారాలంటే కేంద్రం చేతుల్లో గవర్నర్లు కీలుబొమ్మలుగా ఉండకూడదు. కేంద్రం పెత్తనం ఉండకూడదు. గవర్నర్లను ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సంప్రదించి నియమించాలి. రాష్ట్ర ముఖ్యమంత్రి ముగ్గురు సభ్యుల ప్యానల్‌ను ఇవ్వాలి. వారిలో ఒకరిని ముఖ్యమంత్రితో సంప్రదించి నియమించాలి.

గాజాలో ఇజ్రాయిల్ తిష్ట- తెరపైకి రష్యా, ఉక్రెయిన్ శాంతి చర్చలు!



ఎం కోటేశ్వరరావు
8331013288

హమాస్‌ను అణచే సాకుతో పశ్చిమ దేశాల మద్దతు ఉన్న ఇజ్రాయిల్ గాజాలోని పాలస్తీనియన్ల మీద ప్రారంభించిన మారణకాండకు నెల దాటింది. అవే పశ్చిమ దేశాల అండ చూసుకొని రష్యాను దెబ్బతీస్తామని బీరాలు పలికిన ఉక్రెయిన్ సంక్షోభం ప్రారంభమై 622 రోజులు అవుతున్నది. ఇంతకాలం గడచినా సాధించలేనిది ముందు రోజుల్లో రష్యాను వెనక్కు కొడతారంటే ఎలా నమ్మాలనే సందేహాలు మొదలయ్యాయి. మరోసారి శాంతి చర్చలను తెరమీదకు తెచ్చారు. హమాస్ సాయుధులను అణచివేసేందుకు నిరవధికంగా గాజా రక్షణ బాధ్యత తీసుకుంటామని ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రకటించాడు. "మేము అక్కడ లేకపోతే ఏమి జరిగిందో చూశారు. హమాస్ తీవ్రవాదం ఇంత పెద్దఎత్తున ఉంటుందని మేము ఊహించలేదు. నిరవధికంగా గాజా రక్షణ బాధ్యత తీసుకోవాలని అనుకుంటున్నాము" అన్నాడు. ఇజ్రాయిల్ మారణకాండలో మంగళవారం ఉదయానికి అందిన సమాచారం మేరకు గాజాలో 4,100 మంది పిల్లలతో సహా 10,022 మంది మరణించగా 25,408 మంది గాయపడ్డారు. పశ్చిమ గట్టు ప్రాంతంలో మరణించిన వారు 163 కాగా 2,100 మంది గాయపడ్డారు. గాజాలో ఉన్న 35 ఆసుపత్రులలో పదహారింటిని పనికి రాకుండా చేశారు. అదే విధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 72కు గాను 51 మూతపడ్డాయి. ఇజ్రాయిల్ మిలిటరీ బాంబులు, క్షిపణులతో దాడులు జరుపుతూ గాజా జనాభా 23 లక్షలకు గాను 16.1లక్షల మందిని నివాసాల నుంచి తరిమివేశారు. మారణకాండను నిరసిస్తూ బహరెయిన్, ఛాద్, చిలీ, కొలంబియా, హెూండురాస్, జోర్డాన్, దక్షిణాఫ్రికా, టర్కీ ఇజ్రాయిల్‌లోని తమ దౌత్యవేత్తలను వెనక్కు రప్పించాయి. బొలీవియా అన్ని రకాల సంబంధాలను తెగతెంపులు చేసుకున్నది. వందల కోట్ల డాలర్ల విలువగల మారణాయుధాలను అందిస్తున్న అమెరికా గతంలో ఎర్ర సముద్ర ప్రాంతానికి రెండు విమాన వాహక యుద్ధ నౌకలు, క్షిపణి ప్రయోగ యుద్ధ నౌకలను పంపగా ఇప్పుడు ఒక జలాంతర్గామిని ఆ ప్రాంతానికి పంపి ఆ ప్రాంత దేశాలను బెదిరిస్తున్నది. .

తాము అంచనా వేసిన విధంగా రష్యా సేనలను ఎదుర్కోవటంలో ఉక్రెయిన్ విఫలం కావటంతో పశ్చిమ దేశాలు పునరాలోచనలో పడటమే గాక, ఏదో విధంగా రాజీ చేసుకోవాలంటూ ఒత్తిడికి శ్రీకారం చుట్టినట్లు వార్తలు వచ్చాయి. రష్యా సైనిక చర్య ప్రారంభమై ఇరవై నెలలు దాటింది. తమ ప్రాంతాల్లోకి చొచ్చుకు వచ్చిన పుతిన్ సేనలను వెనక్కు కొట్టేందుకు ప్రతిదాడులను ప్రారంభించినట్లు ప్రకటించి ఐదు నెలలు గడుస్తున్నప్పటికీ రష్యా సేనలు ఖాళీ చేసిన ఒకటి రెండు గ్రామాలు, ప్రాంతాలు తప్ప చెప్పుకోదగిన పరిణామాలేవీ లేవు. రష్యా మందుపాతరలను ఏర్పాటు చేసినందున వాటిని తొలగించేందుకు చాలా సమయం పడుతున్నదని ఉక్రెయిన్ చెప్పుకుంటున్నది. నిజానికి అదే వాస్తవమైతే ప్రతిదాడులతో ఆ ప్రాంతాల న్నింటినీ స్వాధీనం చేసుకోవటమే తరువాయి అన్నట్లుగా మే, జూన్ మాసాలలో మీడియాలో కథనాలను ప్రచురించారు. పశ్చిమ దేశాలన్నీ మధ్య ప్రాచ్యం, ఇజ్రాయిల్ మీద కేంద్రీకరించటం, భవిష్యత్‌లో సాయం కొనసాగదేమో అన్న సందేహాలు తలెత్తటం, మరోవైపు రష్యా వైమానిక దాడులు నిరంతరం కొనసాగుతుండటం, చలికాలం ముందుంటంతో ఉక్రెయిన్ మిలిటరీ, పాలకులకు దిక్కుతోచటం లేదు. నవంబరు ఐదవ తేదీన ఉక్రెయిన్ మిలి టరీ అవార్డుల సభ మీద జరిగిన దాడిలో కనీసం 20 మంది సైనికులు మరణించటంతో జెలెన్‌స్కీ కలవరపడ్డాడు. యుద్ధం సాగుతున్నపుడు ఆ ప్రాంతంలో అలాంటి కార్యక్రమం నిర్వహించటం ఏమిటని సామాజిక మాధ్యమంలో జనాలు ప్రభుత్వం మీద తీవ్ర విమ ర్శలు చేస్తున్నారు.

రష్యాతో చర్చలకు ఉక్రెయిన్‌ను ఒప్పించేందుకు పశ్చిమ దేశాలు పూనుకున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే ఇన్ని నెలల తరు వాత రాజీ పడితే అసలు ఇంతకాలం ఎందుకు ఆ పని చేయలేదనే ప్రశ్నలు తలెత్తుతాయి. ముందు మీరు రాజీకి అంగీకరిస్తే గౌరవ ప్రదంగా బయట పడటం గురించి మార్గాన్ని చూద్దామని నాటో కూటమి దేశాల ప్రతినిధులు అంటున్నారు. అందువలన అమెరికా కూటమి ముందుగా ఒక స్పష్టమైన వైఖరికి వస్తేనే చర్చలకు దారి ఏర్పడుతుంది. గత నెలలో జరిగిన ఒక సర్వేలో శాంతి కోసం కొంత భూ భాగాన్ని వదులుకోవచ్చా అన్న ప్రశ్నకు ససేమిరా అంగీకరించం అని 74శాతం మంది చెప్పినట్లు తేలింది. వచ్చే ఏడాది ఉక్రెయిన్‌లో ఎన్నికలు జరగాల్సి ఉంది, అవి జరుగుతాయా లేదా అన్నది ఒకటైతే ఒకవేళ రాజీపడితే జెలెన్‌స్కీ ఇంటిదారి పట్టాల్సిందే. బహుశా అందుకనే యుద్ధంలో ఉన్నందున అసలు వచ్చే ఏడాదైనా ఎన్నికలేంటి అనేపల్లవిని ఎత్తుకున్నాడు. ఇప్పటికిప్పుడు కాకున్నా కొన్ని నెలల తరువాతైనా జెలెన్‌స్కీ చర్చలకు దిగిరాక తప్పదనే భావం రోజు రోజుకూ పెరుగుతున్నది. జెలెన్‌స్కీ ముందుకు తెచ్చిన పది అంశాల శాంతి పథకం గురించి మాల్టాలో జరిగిన సమావేశానికి చైనా హాజరుకాలేదు. ఈ పరి ణామం ఉక్రెయిన్ కోరుకున్న శాంతి ప్రతిపాదనకు పెద్ద ఎదురుదెబ్బ.

> రష్యాతో చర్చలకు ఉక్రెయిన్‌ను ఒప్పించేందుకు పశ్చిమ దేశాలు పూనుకున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే ఇన్ని నెలల తరువాత రాజీపడితే అసలు ఇంతకాలం ఎందుకు ఆ పని చేయలేదనే ప్రశ్నలు తలెత్తుతాయి. ముందు మీరు రాజీకి అంగీకరిస్తే గౌరవ ప్రదంగా బయటపడటం గురించి మార్గాన్ని చూద్దామని నాటో కూటమి దేశాల ప్రతినిధులు అంటున్నారు. అందువలన అమెరికా కూటమి ముందుగా ఒక స్పష్టమైన వైఖరికి వస్తేనే చర్చలకు దారి ఏర్పడుతుంది.

రష్యాను కొద్ది వారాల్లో వెనక్కు నెట్టవచ్చన్న పశ్చిమ దేశాల అంచనాలు తలకిందులయ్యాయి. అక్కడ విజయం సాధించారు, ఇక్కడ ముందుకుపోయారు అంటూ పశ్చిమ దేశాల మీడియా చూపిన దృశ్యాలు, ఇచ్చిన వార్తలు వాస్తవం కాదని తేలిపోయింది. ఇప్పటికీ మద్దతు ఇస్తామని చెబుతున్నప్పటికీ కొనసాగుతుందన్న హామీ లేదు. 2022 మే నెలలో 400 కోట్ల డాలర్ల సాయం అందించాలన్న అమెరికా నిర్ణయానికి పార్లమెంటులో 368 అనుకూల, 57 వ్యతిరేక ఓట్లు వచ్చాయి. ఈ సెప్టెంబరులో జరిగిన 30కోట్ల డాలర్ల బిల్లు ఆమోదం పొందినప్పటికీ వ్యతిరేకించిన వారు 117 మంది ఉన్నారు. ప్రస్తుతం ప్రతిపక్ష రిపబ్లికన్లు పార్లమెంటులో మెజారిటీ ఉన్నారు. వచ్చే ఏడాది ఎన్నికల్లో జోబైడెన్‌ను ఓడించాలని చూస్తున్నవారు ప్రతి ప్రతిపాదనను అడ్డుకొనేందుకు, ఎన్నికల్లో లబ్ది పొందేందుకు చూస్తారు. జాతీయ భద్రతా సహాయ నిధి పేరుతో అమెరికా పక్కన పెట్టిన 105 బిలియన్ డాలర్లలో ఉక్రెయిన్ ఒక్కదానికే 60బి.డాలర్లు ఇస్తామని చెప్పారు. అంత మొత్తం ఇచ్చేందుకు రిపబ్లికన్ పార్టీ సిద్ధంగా లేదు. ఆ పార్టీ పార్లమెంటులో మెజారిటీగా ఉన్నందున వారి మద్దతు లేకుండా ఒక్క డాలరు కూడా జో బైడెన్ విడుదల చేయలేడు. అది లేకుండా ఉక్రెయిన్ ఎంత కాలం నిలబడుతుందన్నది సమస్య. ఇప్పుడు ఇజ్రాయిల్-హమాస్ పోరు ముందుకు రావటంతో అమెరికా దృష్టి అటువైపు మళ్లింది. భారీఎత్తున ఇజ్రాయిల్‌కు నిధులు, ఆయుధాలు సమకూరుస్తోంది. ఇది కూడా ఉక్రెయిన్‌కు ఎదురుదెబ్బే. పశ్చిమ దేశాల మీడియా అంతటా నెల రోజుల క్రితం వరకు ఉక్రెయిన్





విజయగాధలతో ఉండేవి. ఇప్పుడు వాటి స్థానాన్ని ఇజ్రాయిల్ హమాస్ దాడులు, మధ్యప్రాచ్య పరిణామాలు ఆక్రమించాయి. ఐరోపా యూనియన్ అక్టోబరు నెలలో వచ్చే నాలుగు సంవత్సరాల బడ్జెట్ గురించి బ్రసెల్స్‌లో జరిపిన సంప్రదింపులలో ఉక్రెయిన్‌కు మరింత సాయం చేయకూడదంటూ పోలాండ్, హంగరీ, స్లోవేకియా అడ్డం తిరిగాయి. ఉక్రెయిన్ తక్కువ ధరలకు ఆహార ధాన్యాల ఎగుమతి తమ రైతాంగానికి నష్టం కలిగిస్తున్నదంటూ పోలాండ్ అభ్యంతరం తెలుపుతున్నది. వచ్చే ఏడాది ఎన్నికలు జరుగుతున్నందున పోలాండ్ ప్రధాని మోరావిక్కీ తన గెలుపు గురించి ఆందోళన చెందుతున్నాడు, ధాన్య ధరలు తన పతనానికి కారణం అవుతాయోమనని భయపడుతున్నాడు.

పశ్చిమ దేశాలు ఇప్పటికే తమ వద్ద ఉన్న ఆధునిక విమానాలు తప్ప అన్ని రకాల ఆయుధాలను ఉక్రెయిన్‌కు అందచేశాయి. వాటినే ఇంకా సరఫరా చేయటం తప్ప అంతకు మించి మరో అడుగువేయలేని స్థితి. జెలెన్‌స్కీని ముందుకు నెట్టటం తప్ప నేరుగా నాటో కూటమి దేశాలు రంగంలోకి దిగే అవకాశాలు ప్రస్తుతానికి కనిపించటం లేదు. ప్రస్తుతం ఎలాంటి స్థంభన లేదంటూ బింకాలు పలుకుతున్నప్పటికీ ఎంతకాలం అన్న ప్రశ్న ముందుకు వస్తున్నది.

రష్యాతో శాంతి చర్చలకు ఉన్న అవకాశాలేమిటి అంటూ అమెరికా, ఐరోపా సమాఖ్య ప్రతినిధులు ఉక్రెయిన్ అధికారులను అడిగినట్లు అమెరికా ఎన్‌బిసి టీవీ పేర్కొన్నది. ఉక్రెయిన్‌కు మద్దతునిస్తున్న 50కిపైగా దేశాల ప్రతినిధులతో అక్టోబరు నెలలో బ్రసెల్స్‌లో జరిగిన సమావేశం సందర్భంగా ఈ మేరకు కదిలించి చూసినట్లు అది వెల్లడించింది. దీని గురించి జెలెన్‌స్కీ స్పందిస్తూ చర్చలకు ఇది తరుణం కాదని, అందుకోసం పశ్చిమ దేశాల నేతలెవరూ తనను ఒత్తిడి చేయటం లేదని చెప్పుకున్నాడు. రష్యాతో తమ పోరు కదలిక లేని, ఘర్షణపూర్వక బల హీన స్థితి ఉండే దశలోకి ప్రవేశిస్తున్నదని, ఇలాంటి పరిస్థితి రష్యా తనమిలిటరీ శక్తిని తిరిగి సమకూర్చుకొనేందుకు వీలు కల్పి స్తుందని ఉక్రెయిన్ దళాధిపతి జనరల్ వాలెరీ జలుఝని ఎకాన మిస్ట్ పత్రికలో రాసిన వ్యాసంలో పేర్కొన్నాడు. ఆ తరువాతే ఎన్‌బిసి వార్త, దాని మీద జెలెన్‌స్కీ స్పందన వెలువడింది. "కాలం గడిచింది జనాలు అలసిపోయారు, కానీ ఇది ప్రతిష్టంబన కాదు" అని కూడా అన్నాడు. 2014లో రష్యా విలీనం చేసుకున్న క్రిమియా ద్వీపంతో పాటు గత ఏడాది నుంచి ఉక్రెయిన్లో స్వాధీనం చేసుకున్న ప్రాంతాలన్నింటినీ తిరిగి స్వాధీనం చేసుకుంటామని ఉక్రెయిన్ చెబుతున్నది. ప్రస్తుతం ఉక్రెయిన్లో స్వాతంత్ర్యం ప్రకటించుకున్న రెండు రిపబ్లిక్‌లను రష్యా గుర్తించింది. వాటితో సహా అంతర్జాతీయంగా గుర్తించిన ఉక్రెయిన్‌లో 17.5శాతం ప్రాంతం రష్యా దళాల అదుపులో ఉంది. ఉక్రెయిన్ నాటోలో చేరబోనని, పశ్చిమ దేశాలతో కలసి తమ భద్రతకు ముపు కలిగించబోమని హామీ ఇస్తే క్రిమియా మినహా తమ స్వాధీనంలో ఉన్న వాటిని వెంటనే అప్పగిస్తామని పుతిన్ మొదటి నుంచీ చెబుతున్నాడు. పశ్చిమ దేశాలు దాన్ని పడనివ్వకుండా అడ్డుపడటమే కాదు, ఫిన్లండ్, స్వీడన్‌లను నాటోలో చేర్చుకొని మరో వైపు నుంచి రష్యాను దెబ్బతీసేందుకు పూనుకున్నాయి.

> పశ్చిమ దేశాలు ఇప్పటికే తమ వద్ద ఉన్న ఆధునిక విమానాలు తప్ప అన్ని రకాల ఆయుధాలను ఉక్రెయిన్‌కు అందచేశాయి. వాటినే ఇంకా సరఫరా చేయటం తప్ప అంతకు మించి మరో అడుగువేయలేని స్థితి. జెలెన్‌స్కీని ముందుకు నెట్టటం తప్ప నేరుగా నాటో కూటమి దేశాలు రంగంలోకి దిగే అవకాశాలు ప్రస్తుతానికి కనిపించటం లేదు. ప్రస్తుతం ఎలాంటి స్థంభన లేదంటూ బింకాలు పలుకుతున్నప్పటికీ ఎంతకాలం అన్న ప్రశ్న ముందుకు వస్తున్నది.

ప్రస్తుతానికి పశ్చిమ దేశాల సాయం నిలిచిపోతుందని చెప్పలేము గానీ వచ్చే ఏడాది నుంచి జరగవచ్చని ఐరోపా విశ్లేషకులు చెబుతున్నారు. రానున్న పద్దెనిమిది నెలలు ప్రస్తుత పోరులో కీలకంగా మారనున్నాయని, 2025 వసంత రుతువుకు ముందు రష్యన్లు విజయవంతమైన ఎదురుదాడి చేయలేరని, వచ్చే ఏడాది ఉక్రెయిన్ పెద్ద ముందడుగు వేయవచ్చని కొందరు అంచనా వేస్తున్నారు. తాము కోల్పోయిన ప్రాంతాలన్నింటినీ తిరిగి ఇస్తే తప్ప చర్చలు లేవని ఉక్రెయిన్ చెబుతుండగా, తమ ఆధీనంలోకి వచ్చిన ప్రాంతాలను వదిలేదని రష్యా చెబుతున్నందున రెండు దేశాల మధ్య చర్చలకు ప్రస్తుతం ప్రాతిపదిక లేదనే పద్ధతిలో విశ్లేషణలు సాగుతున్నాయి. రష్యా మమ్మల్నందరినీ చంపిన తరువాత వారు నాటో దేశాల మీద దాడి చేస్తారు, అప్పుడు గాని మీ కొడుకులూ, కుమార్తెలను పోరాటానికి పంపరా అని జెలెన్స్కీ ఒక అమెరికా టీవీ ఎన్‌బిసి ఇంటర్వ్యూలో నాటో కూటమి మీద అసహనాన్ని వెళ్లగక్కాడు. ఒకసారి డోనాల్డ్ ట్రంప్ తమ దేశానికి వస్తే కేవలం 24 నిమిషాల్లో అంతా వివరిస్తానని గెలిస్తే 24 గంటల్లో యుద్ధాన్ని అంతం చేస్తాడని అన్నాడు. మొత్తం మీద ఉక్రెయిన్ సంక్షోభం మరో మలుపు తిరిగే సూచనలు కనిపిస్తున్నాయి.

మెయిల్ @ నవతెంగాణ

గాలి కాలుష్య కోరల్లో మెగాసిటీలు

21వ శతాబ్దంలో అతి పెద్ద ప్రజారోగ్య సమస్యగా మహానగరాల గాలి కాలుష్యం నిలుస్తున్నది. నేడు దేశవ్యాప్తంగా విస్తరించిన మెగా సిటీలు ఈ కోరల్లో చిక్కి నగర వాసులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అత్యంత గాలి కాలుష్యం కలిగిన ప్రపంచ నగరాల జాబితాలో భారత దేశానికి చెందిన మహానగరాలు అనేకం ఉండడం నగర వాసుల విషమ పరిస్థితులకు అద్దం పడుతున్నది. పరిశుభ్రమైన భారత నగరాలు అతి తక్కువగా కనిపించడం విచారకరం. శీతాకాలపు అక్టోబర్, నవంబర్, డిసెంబర్ మాసాల్లో మంచు కురవడం, కాలుష్య పొగ చేరడం, ధూళి కణాలు, వాహన కాలుష్య పొగలు, పారిశ్రామిక విష తుల్య రసాయనాలు, ప్రాణాంతక లోహాలు మొదలగు పలు కాలుష్యాలు కలిసి ప్రజారోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్ట డం ప్రతి ఏట చూస్తున్నాం. ముఖ్యంగా ఢిల్లీ, ముంబాయి, కోల్‌కతా, చెన్నై, బెంగుళూరు, హైదరాబాదు లాంటి అనేక మహానగరాలు గాలి కాలుష్య తీవ్రతలు ప్రమాదకర స్థాయికి చేరడం చూస్తున్నాం. నగరాలు కుంపట్లను తలపిస్తున్నాయి. ప్రమాదకర గాలి కాలుష్యంతో ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. మురికి వాడల్లో నివసించే కడు పేదలు కాలుష్య కారణ అనారోగ్యాలతో పడరాని పాట్లు పడుతున్నారు. గాలి కాలుష్యం వల్ల అనేక దుష్ప్రభావాలు ఉన్నాయి. కాలుషిత గాలి కాలుష్యంతో విషపూరిత సూక్ష్మ కణాలు ఊపిరితిత్తుల ద్వారా రక్తంలోకి చేరడంతో బీపీ, గుండె పోటు, స్ట్రోక్, అవయువ వాపులు లాంటివి తక్షణమే కలుగుతాయి. మెదడు ప్రభావితం కావడం, నాడీమండల రుగ్మతలు కూడా కలుగుతాయి. ఇంకా చర్మ సమస్యలు, చర్మం ముడతలు పడడం, వాపులు సహితం కలుగుతాయి. శారీరక బలహీనత, అలసట, జ్ఞాపకశక్తి లోపం, వాంతులు, విరోచనాలు, కళ్ల మంటలు లాంటి అనారోగ్యాలు కూడా అనుభవంలోకి వస్తాయి. గాలి కాలుష్య సంబంధ భయంకర వాస్తవాలను గమనిస్తూ పౌర సమాజం తగు జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యక్తిగతంగా, సమాజ పరంగా, ప్రభుత్వపరంగా అందరూ సమన్వయంతో గాలి కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతినబూనాలి. స్వచ్ఛమైన గాలిని భవిష్యత్తు తరాలకు అందజేయాలి.

- మధు

పార్టీల తీరు విడ్డూరం! హాస్యాస్పదం?

రాష్ట్రంలో ఎన్నికల ప్రచార హడావిడీ కొనసాగుతోంది. ఆయా రాజకీయ పార్టీలు మేనిఫెస్టో(హామీలు)ను వివరిస్తూ ప్రజల నుంచి ఓట్లు రాబట్టే ప్రయత్నం చేస్తున్నాయి. ఇందులో అధికార పార్టీ నాయకులు.. పెన్షన్ వస్తుందా?, రైతు బంధు, రైతు బీమా అందుతుందా అని అడుగుతున్నారు. ప్రతిపక్ష, విపక్షాలు మాత్రం.. గెలిచాక మేము అది చేస్తాం! అవి ఇవి ఇస్తాం అంటున్నాయి. అదే విధంగా గ్యాస్ రూ.500కే ఇస్తామని ఓ పార్టీ, రూ.400కే అందిస్తామని కొన్ని పార్టీలు ప్రగల్భాలు పలుకుతున్నాయి. కానీ, ఒక ఇంట్లో ఎంతమంది విద్యావంతులున్నారు?. ఎందరికి ప్రభుత్వ ఉద్యోగం వచ్చింది?. రైతులు, చేనేతలు ఉన్నారా?.. వాళ్లు ఎవరైనా ఆత్మహత్య చేసుకున్నారా? అని ఎందుకు అడగడం లేదు? అసలు ఇలాంటివి ఏవైనా ఆరా తీస్తున్నారా?. ప్రస్తుత ప్రభుత్వంలో చేయలేనివి.. మళ్లీ అధికారంలోకి వచ్చాక చేస్తామని చెప్పడం విడ్డూరం!. అంతేగాక గతంలో పాలించిన పార్టీలు అప్పుడు చేయలేని.. ఒక్క అవకాశం ఇస్తే అన్నీ చేస్తామని మాట్లాడడం హాస్యాస్పదం?.

- తలారి గణేష్

సమ్మిళిత వృద్ధిలో వికలాంగుల స్థానమేది?

భారతదేశంలో సుమారు 21 మిలియన్ల మంది అనగా రెండు శాతం జనాభా వికలాంగులుగా ఉన్నట్లు తెలుస్తోంది. దేశ సమ్మిళిత అభివృద్ధిలో వీరి పాత్ర కూడా సముచితంగా ఉండాలని పలు నివేదికలు చెబుతున్నాయి. చిన్న చిన్న లోపాలు, అంగవైకల్యం ఉన్నంత మాత్రాన, వీరి పట్ల ఎవరూ వివక్షత చూపరాదు. ఇటీవల చైనాలో జరిగిన పారా ఆసియన్ గేమ్స్‌లో వీరు క్రీడా నైపుణ్యాలు, సామర్థ్యాలు ద్వారా మనదేశానికి 111 పతకాలు సాధించి దేశ గౌరవాన్ని కీర్తి ప్రతిష్టలు ఇనుమడింప చేసారు. ఇక దేశ ఆర్థికాభివృద్ధికి కేంద్రాలు అయిన పరిశ్రమలు, ఆఫీస్లు, ఉద్యోగ ఉపాధి కేంద్రాల్లో అనగా "వర్క్ ఫోర్స్" లో వీరికి అవకాశాలు బహు తక్కువగా ఉంటున్నాయి. మొత్తం వికలాంగుల్లో కేవలం 36 శాతం మాత్రమే పనిలో భాగస్వామ్యం (వర్కర్లు) ఉండుట గమనార్హం. ఇందులో పురుషులు 47శాతం కాగా, మహిళలు కేవలం 23శాతంగా ఉన్నారు. ఇక్కడ కూడా లింగ వివక్షత స్పష్టంగా కనిపిస్తుంది. అంతేకాకుండా వికలాంగుల్లో గ్రామీణ ప్రాంతాల్లో 25 శాతం ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందుతుండగా, పట్టణ ప్రాంతాల్లో కేవలం 16 శాతం మంది మాత్రమే ఉపాధి అవకాశాలు పొందుతున్నారని నివేదికలు పేర్కొంటున్నాయి. ప్రభుత్వ రంగంలో, ప్రయివేటు రంగంలో సరైన ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించుట లేదు. 2019 "ఆక్స్ఫామ్" నివేదిక ప్రకారం అవిద్య, నైపుణ్యాలు లేమి, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంలో వెనుకబాటుతనం, చిన్నచూపు, వివక్షత వంటి కారణాల వల్ల వికలాంగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోలేకపోతున్నారు అని తెలిపారు. వీరికి పని ప్రదేశాలు అందుబాటులో లేకపోవడం, రవాణా సౌకర్యాలు లేకపోవడంతో వర్క్ ఫోర్స్‌లో భాగస్వామ్యం కాలేకపోతున్నారు. విద్యా సౌకర్యాలు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. మరి భవిష్యత్తులో మనదేశాన్ని మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపొందించుటకు చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్న పాలకులు దేశంలో రెండు శాతంగా ఉన్న వికలాంగుల్ని సమ్మిళిత అభివృద్ధిలో భాగస్వామ్యులుగా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

- ఐపి రావు

మోడీ లేకుండానే... మిజోరంలో ప్రచారం!

> మోడీ, అమిత్ షాలు ఇప్పుడు హిందీ భాషా రాష్ట్రాల్లో బీజేపీ వ్యతిరేక సెంటిమెంట్‌ను ఎలా అధిగమించాలనే అంశంపై పరిశోధనలు చేస్తున్నారు. హిందీ ప్రాంతంలోని మూడు రాష్ట్రాల్లో మత విద్వేషాలను తీవ్రం చేసే తన రెగ్యులర్ ఎజెండాకు తిరిగి వెళ్లేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగానే మోడీ-మందిరం, సనాతన ధర్మం వంటి అంశాలను బీజేపీ నేతల చేత లేవనెత్తించారు. ఈ ఎన్నికల వ్యూహంలో భాగంగానే రామక్షేత్ర అంశం తిరిగి ముందుకొచ్చింది. జనవరి 22న అయోధ్యలో రామ మందిరాన్ని ప్రారంభిస్తామని మోడీ ప్రకటించారు. అయితే ఈ అంశం మునుపటి లాగా ఓటర్లను ప్రభావితం చేయకపోవడం, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపలేకపోవడం బీజేపీని కలవరపెడుతోంది.

ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల సమయాన కేంద్ర అధికార పార్టీ బీజేపీ తీవ్ర సంక్షోభంలోకి వెళ్తున్నట్లు వారి చర్యలు తెలియజేస్తున్నాయి. గత తొమ్మిదేళ్లుగా అవలంబిస్తున్న ప్రచార వ్యూహాలు అంతగా పని చేయకపోవడం బీజేపీకి నిరాశ మిగిల్చింది. హిందీ మాట్లాడే మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో బీజేపీ వ్యతిరేక సెంటిమెంట్ బలంగా, స్పష్టంగా కనిపిస్తున్నది. ఈ మూడు రాష్ట్రాల్లో మోడీ-అమిత్ షా ద్వయం ఇష్టం లేకపోయినా...శివరాజ్‌సింగ్ చౌహాన్ (మధ్యప్రదేశ్), వసుంధర రాజె సింధియా (రాజస్థాన్), రమణ్‌సింగ్ (ఛత్తీస్‌గఢ్)కు టికెట్లు ఇవ్వక తప్పని పరిస్థితి వచ్చింది. మిజోరంలో అధికార పార్టీ 'మిజో నేషనల్ ఫ్రంట్' బీజేపీని దూరం పెడుతోంది. తెలంగాణలో బీజేపీకి ఆశ లేదు. అక్కడ బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యే ప్రధాన పోరు నెలకొంది.

తొమ్మిదేళ్ల క్రితం కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి ఎన్నికల్లోనూ బీజేపీ స్టార్ క్యాంపైనర్‌గా ప్రధాని వ్యవహరిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లోనే కాదు, అసెంబ్లీ ఎన్నికలు, స్థానిక ఎన్నికలు, ఉప ఎన్నికల్లో కూడా మోడీనే ప్రధాన ప్రచారకర్త. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఏడు రోజుల పాటు ప్రచారం చేసిన ప్రధాని 19 ర్యాలీలు, ఆరు రోడ్ షోలలో పాల్గొన్నారు. మోడీకి పాలనకంటే సొంత పార్టీ ప్రచారమే ముఖ్యం. అలాంటిది మిజోరంలో ఈసారి ప్రచారానికి ప్రధాని దూరంగా ఉండడం సహజంగానే వార్తగా మారింది. అక్టోబర్ 30న మిజోరంలో ప్రధాని ఎన్నికల ప్రచారం నిర్వహించాల్సి ఉంది. మిజోయేతర జనాభా అధికంగా ఉన్న మామిత్‌లో ప్రధాని బహిరంగ సభకు ఏర్పాట్లు జరిగాయి. అయితే ప్రధానితో వేదిక పంచుకోవడానికి తాను సిద్ధంగా లేనని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఎన్డీయే నేత జోరమ్ తంగ చెప్పడంతో మోడీ సిగ్గుతో ప్రచారం నుంచి తప్పుకున్నారు. మణిపూర్‌లో డజన్ల కొద్దీ క్రైస్తవ చర్చిలను తగలబెట్టారు. అలాంటి బీజేపీ ప్రధానితో వేదికను ఎలా పంచుకుంటామని జోరమ్ తంగ ప్రశ్నించారు. మిజోరం క్రైస్తవుల మెజారిటీ ఉన్న రాష్ట్రం. మయన్మార్ శరణార్థుల బయోమెట్రిక్ డేటా సేకరించాలని కేంద్రం చేసిన అభ్యర్థనను మిజోరం ప్రభుత్వం పట్టించుకోలేదు. మిజో నేషనల్ ఫ్రంట్ కూడా ఏకరూప పౌరస్మృతి (యుసిసి)ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ప్రకటించింది. ఎన్డీయే పక్షమైనప్పటికీ మోడీ ప్రభుత్వాన్ని విశ్వాసంలోకి తీసుకోవడానికి ఎంఎన్ఎఫ్ సిద్ధంగా లేదు. ఈ స్థితిలో మోడీ మిజోరం పర్యటనకు దూరంగా ఉన్నారు. మిజోరంలో ప్రచారానికి దూరంగా ఉండేందుకు ప్రధానిని ప్రేరేపించిన మరొక అంశాన్ని కూడా ప్రస్తావించుకోవాలి. మిజోరం వెళితే మణిపూర్‌లో ఎందుకు పర్యటించడంలేదన్న ప్రశ్న ఉత్పన్నమౌతుంది. మే 3వ తేదీన మణిపూర్‌లో మారణహోమం ప్రారంభమైంది. నవంబర్ 3కి ఆరు నెలలు పూర్తవుతుంది. మోడీ ఇప్పటివరకు ఒక్కసారి కూడా మణిపూర్‌లో పర్యటించలేదు. బ్రిడ్జిలు, రోడ్లు, వందేభారత్ రైళ్లకు పచ్చ జెండా ఊపేందుకు తీరిక వుంది కానీ... డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఉన్న మణిపూర్‌లో పర్యటించడానికి ప్రధానికి తీరిక దొరకలేదని ప్రతిపక్షం ఇప్పటికే ఎద్దేవా చేసింది. ఒకవేళ మోడీ మిజోరం పర్యటించినట్లయితే... పక్కనే వున్న మణిపూర్ బాధితులను పరామర్శించాలన్న విపక్షాల డిమాండ్ ఊపందుకుంటుంది. ఈ కారణంగానే మోడీ మిజోరం ప్రచారానికి దూరంగా ఉన్నారు. ఇది మోడీకి, బీజేపీకి గట్టి దెబ్బ.



మోడీ, అమిత్ షాలు ఇప్పుడు హిందీ భాషా రాష్ట్రాల్లో బీజేపీ వ్యతిరేక సెంటిమెంట్‌ను ఎలా అధిగమించాలనే అంశంపై పరిశోధనలు చేస్తున్నారు. హిందీ ప్రాంతంలోని మూడు రాష్ట్రాల్లో మత విద్వేషాలను తీవ్రం చేసే తన రెగ్యులర్ ఎజెండాకు తిరిగి వెళ్లేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగానే మోడీ-మందిరం, సనాతన ధర్మం వంటి అంశాలను బీజేపీ నేతల చేత లేవనెత్తించారు. ఈ ఎన్నికల వ్యూహంలో భాగంగానే రామక్షేత్ర అంశం తిరిగి ముందుకొచ్చింది. జనవరి22న అయోధ్యలో రామ మందిరాన్ని ప్రారంభిస్తామని మోడీ ప్రకటించారు. అయితే ఈ అంశం మునుపటి లాగా ఓటర్లను ప్రభావితం చేయకపోవడం, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపలేక పోవడం బీజేపీని కలవరపెడుతోంది. అయినప్పటికీ మధ్యప్రదేశ్, ఇతర చోట్ల బీజేపీ ఎన్నికల ప్రచారంలో అయోధ్య ఆలయ అంశాన్ని విస్తృతంగా ఉపయోగించారు. అక్టోబర్ 28 నుండి 30 వరకు మధ్యప్రదేశ్‌లో ప్రచారం చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా లేవనెత్తిన ప్రధాన అంశం రామమందిరమే. గతంలో డిఎంకే మంత్రి సనాతన ధర్మానికి వ్యతిరేకంగా తెరపైకి రాగానే... దాన్ని ప్రధాన ఎన్నికల అంశంగా మార్చేందుకు మోడీ సహా ముఖ్య నేతలంతా సిద్ధమయ్యారు. కానీ అది కూడా తగినంత దృష్టిని ఆకర్షించలేదు. హిందీ భాష వంటి వివాదాస్పద అంశాలను తెరపైకి తెచ్చినప్పటికీ ఆశించిన స్థాయిలో ఫలితాన్నివ్వకపోవడం బీజేపీ వర్గాలను నిరాశకు గురిచేసింది. ఇలాంటి అంశాలకంటే నిరుద్యోగం, ధరల పెరుగుదల, అవినీతి తదితరాలపై ప్రజల్లో చర్చ జరుగుతోంది. దీంతో పాటు కులగణన చేయాలనే విపక్షాల డిమాండ్ కూడా చర్చనీయాంశం అవుతోంది. అయితే అధికారం, డబ్బు బీజేపీకి అనుకూల అంశాలు. బీజేపీకి ఎలాంటి రాజకీయ విలువలపైనా నమ్మకం లేదు. ఎలాగైనా గెలుపు సాధించాలన్నదే లక్ష్యం.

అఖిల భారత స్థాయిలో మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా విశాల ప్రతిపక్ష వేదిక 'ఇండియా'ను ఏర్పాటు చేసినప్పటికీ, అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ చొరవతో ముందుకు తీసుకెళ్లడానికి సిద్ధంగా లేకపోవడం శోచనీయం. ఉదాహరణకు మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్‌తో కలిసి పోటీ చేసేందుకు సమాజ్‌వాది పార్టీ సిద్ధమైంది. ఉత్తరప్రదేశ్‌కు ఆనుకుని ఉన్న మధ్యప్రదేశ్ జిల్లాల్లో సమాజ్‌వాది పార్టీ ప్రభావం ఉంది. గతసారి ఎస్.పికి ఒక్క సీటు వచ్చింది. నాలుగు నుంచి ఆరు సీట్లు ఇస్తే పొత్తు పెట్టుకోవచ్చని ఎస్.పి తెలియజేసింది. ఎస్.పి నేత అఖిలేష్ యాదవ్, కాంగ్రెస్ నేత దిగ్విజయ్ సింగ్ కూటమి ఏర్పాటు కానుందని సమాచారం. అయితే ఎస్.పి సిట్టింగ్ సీటుతో సహా ఏకపక్షంగా కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించడంతో పొత్తు కుప్పకూలింది. దాంతో అఖిలేష్ యాదవ్ మరింత ముందుకెళ్లిపోయి... లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు సీటు ఇచ్చేందుకు తాను సిద్ధంగా లేనన్నారు. దీన్ని బట్టి, కాంగ్రెస్ ఇతర పార్టీలను అంగీకరించలేకపోతోంది. వాటితో కలిసి ముందుకు సాగడం లేదన్న వాస్తవం అర్థమౌతున్నది. రాజస్థాన్‌లోనూ ఇదే పరిస్థితి. తెలంగాణ సంగతి సరేసరి. కాంగ్రెస్ ఒక్కటే బీజేపిని గద్దె దించలేదనే రాజకీయ వాస్తవాన్ని అంగీకరించడానికి వారు ఇప్పటికీ సిద్ధంగా లేరు. లోక్‌సభ ఎన్నికలలో కూడా కాంగ్రెస్ ఇదే విధానాన్ని అవలంబిస్తే ఆత్మహత్యా సదృశ్యమే అవుతుంది.


('దేశాభిమాని' సౌజన్యంతో)

- వి.బి. పరమేశ్వరన్

డీజీపీకి సోమేష్ కుమార్ తీర్పే వర్తిస్తుంది

మరో ఐదుగురికీ కూడా

- ఆరుగురు అధికారుల కేసుల్లో విచారణ జరపాలి
- ఆలిండియా సర్వీస్ ఆఫీసర్ల కేటాయింపుపై హైకోర్టుకు నివేదించిన కేంద్రం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డీజీపీ అంజనీకుమార్ ఏపీ క్యాడర్ అధికారేనని పేర్కొంటూ కేంద్ర ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. డీజీపీ అంజనీకుమార్ మరో ఐదుగురు కేంద్ర సర్వీస్ ఆఫీసర్లు రోనాల్డ్ రాస్, జె. అనంతరాము, ఎస్.ఎస్.రావత్. అమ్రపాలి, అభిలాస్ బిస్తలకు గతంలో సోమేష్‌కుమార్ కేసులో ఇచ్చిన తీర్పునే వర్తింపజేయాలని కేంద్రం హైకోర్టును కోరింది. తెలంగాణ తొలి సీఎస్‌గా చేసిన సోమేష్‌కుమార్ ఏపీ క్యాడర్ ఆఫీసరేనని హైకోర్టు తీర్పు చెప్పిందనీ, అదే తరహా తీర్పును డీజీపీ మరో ఐదుగురు అధికారులకూ వర్తింపజేయాలని కోరింది. మరో ఆరుగురు అధికారుల కేసుల్లో వ్యక్తిగత అంశాలు ఉన్నందున వాటిపై విచారణ జరిపితే తమ వాదనలను తెలియజేస్తామని చెప్పింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ బి. నరసింహాశర్మ వాదనలు వినిపించారు. రాష్ట్ర విభజన తరుణంలో కేంద్ర సర్వీస్ ఆఫీసర్ల విభజనకు ప్రత్యూష్ కుమార్ సిన్హా కమిటీ ఏర్పాటైంది. ఆ కమిటీ సిఫార్సుల మేరకు ఏపీ, తెలంగాణలకు ఐఏఎస్, ఐపీఎస్ వంటి కేంద్ర సర్వీస్ అధికారుల విభజన చేయడాన్ని పలువురు ఆఫీసర్లు సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (క్యాట్)లో సవాల్ చేసి స్టే ఆర్డర్‌తో తెలంగాణలో కొనసాగుతున్నారు. క్యాట్ తీర్పును రద్దు చేయాలని కేంద్రం దాఖలు చేసిన అప్పీళ్లను హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ జె.అనిల్‌కుమార్‌లతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం విచారించింది. కేంద్ర ప్రభుత్వ వాదనలపై ప్రతివాదులైన 12 మంది ఆఫీసర్లు తమ వాదనలతో అఫిడవిట్లను దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణ ఈ నెల 15కి వాయిదా పడింది.

ట్రిబ్యునల్స్ ఎందుకు ఏర్పాటు చేయలేదు?

రాష్ట్ర పంచాయతీరాజ్ యాక్ట్, మున్సిపల్ యాక్ట్‌ల కింద ఆ రెండు డిపార్ట్‌మెంట్లలో ఎదురయ్యే వివాదాల విచారణకు వీలుగా చట్ట ప్రకారం టిబ్యునల్స్‌ను ఎందుకు ఏర్పాటు చేయలేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. ఈ వ్యవహారంపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. చీఫ్ సెక్రటరీ, జీఏడీ, మున్సిపల్, పంచాయతీరాజ్, లా డిపార్ట్‌మెంట్ల ముఖ్యకార్యదర్శులకు, మున్సిపల్ డైరెక్టర్, పంచాయతీరాజ్ కమిషనర్లకు నోటీసులు జారీ చేసింది. పంచాయతీరాజ్ చట్టం, మున్సిపల్ చట్టాల కింద ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేయలేదని వివరిస్తూ అందిన లేఖను హైకోర్టు పిల్‌గా పరిగణించింది. దీనిని చీఫ్ జస్టిస్ అశోక్ ఆరాదే, జస్టిస్ ఎ.లక్ష్మీనారాయణల డివిజన్ బెంచ్ విచారించింది.

ఆ చట్టాల వల్ల ఎదురయ్యే సమస్యలను పరిష్కరించు కోవడానికి ట్రైబ్యునళ్లు లేకపోవడంతో ప్రజలు రెగ్యులర్ కోర్టులను ఆశ్రయి స్తున్నారనీ, ఫలితంగా కోర్టుల్లో కేసులు పెరిగిపోయి కేసుల పెండింగ్ పెరుగుతోందనీ, కోర్టు ఫీజులు చెల్లించే స్థోమత లేక సామాన్యులకు కష్టంగా ఉందని లేఖలో పేర్కొన్నారు.

ప్రయివేటు కేంద్రానికి భూమి కేటాయింపుపై రిట్

ప్రయివేటు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హైదరాబాద్ అంతర్జాతీయ మధ్యవర్తిత్వ కేంద్రం (ఐఏఎంసీ)కు ప్రభుత్వం శేరిలింగంపల్లి మండలం రాయదుర్గంలో రూ.300 కోట్ల విలువైన 3 ఎకరాలకుపైగా భూమి ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో రిట్ దాఖలైంది. దీనిని న్యాయమూర్తులు జస్టిస్ కె లక్ష్మణ్, జస్టిస్ కె.సుజనలతో కూడిన డివిజన్ బెంచ్ విచారించింది. సీఎస్, లా సెక్రటరీ, ఐఏఎంసీ సీఈవోలకు నోటీసులిచ్చింది. విచారణను డిసెంబర్ 21కు వాయిదా వేసింది. ఎకరం భూమి వంద కోట్లకుపైగా ఉన్న విలువైన భూమితోపాటు ప్రభుత్వం ఆర్థికంగా కోట్ల రూపాయలను సాయం చేసేలా జీవోలు ఉన్నాయనీ, వాటిని రద్దు చేయాలని కేఆర్ రావు పిటిషన్ వేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన భవనంలోనే ప్రస్తుతం ఐఏఎంసీ ఉంది.

చెరువుల భూముల్లో నిర్మాణాలపై పిల్

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నిజాంపేట్‌లోని కోమటికుంట చెరువు భూముల్లో అక్రమ నిర్మాణాలను నిలిపివేసేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్, నిజాంపేట మున్సిపల్ కమిషనర్, ఇరిగేషన్ ఆఫీసర్లతో పాటు వాసవీ ఇన్‌ఫ్రా ప్రయివేట్ లిమిటెడ్‌కు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింధి .విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. ప్రయివేటు బిల్డర్లతో చేతులు కలిపిన అధికారులు సర్వే నంబర్ 127, 137లోని చెరువు భూములు అన్యాక్రాంతం అవుతున్నా పట్టించుకోవడం లేదని పేర్కొంటూ ఆకుల సతీశ్ అనే సోషల్ వర్కర్ దాఖలు చేసిన పిల్‌ను చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్‌ల డివిజన్ బెంచ్ విచారణ చేపట్టింది. వాదనల తర్వాత హైకోర్టు తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.

"తెలంగాణలో కాంగ్రెస్ పాపాల శతకం"



- "స్కాంగ్రెస్" పుస్తకాల ఆవిష్కరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"తెలంగాణలో కాంగ్రెస్ పాపాల శతకం", "స్కాంగ్రెస్" పుస్తకాలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవిష్కరించారు. బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా విభాగం రూపొందించిన ఈ పుస్తకాలను మంగళవారం తెలంగాణ భవన్ లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాపాలకు ఈ ఎన్నికల్లో ప్రజలే శిక్ష వేస్తారని తెలిపారు. కాంగ్రెస్ పాపాల చిట్టాను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందని తెలిపారు. వీటిని రూపొందించిన సోషల్ మీడియాను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్లు వై.సతీష్ రెడ్డి, జగన్ మోహన్ రావు, దినేష్ చౌదరి,మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య సీనియర్ నాయకులు దాసోజు శ్రవణ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరికలు

కాంగ్రెస్ పార్టీ నుంచి నాలుగు నియోజకవర్గాలకు చెందిన నేతలు బీఆర్ఎస్ లో చేరారు. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్య క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసి డెంట్ కె.తారక రామారావు గులాబీ కండువాలు కప్పి వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పాలకుర్తి కాంగ్రెస్ నేత తిరుపతి రెడ్డి ,గద్వాల నేత కురువ విజయ్ కుమార్ ,ముధోల్ కాంగ్రెస్ నేత కిరణ్ వాగ్మోరేతో పాటు జనగామ నేతలు బీఆర్ఎస్‌లో చేరిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఇవ్వాళ ఎమ్మెల్యే టికెట్లు అమ్ము కుంటున్న రేవంత్ రెడ్డి పొరపాటున సీఎం అయితే రాష్ట్రాన్ని అమ్ము కుంటారని విమర్శించారు. ఒకప్పుడు పాలమూరు అంటే మైగ్రే షన్ అనీ, బీఆర్ఎస్ దాన్ని ఇరిగేషన్‌గా మార్చి ందని తెలిపారు.

15 రాష్ట్రాల బీజేపీ ముఖ్యమంత్రులు, అమిత్ షా, ప్రధాని మోడీ, కాంగ్రెస్ అగ్రనేతలు రాష్ట్రానికి క్యూ కట్టారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ సింహంలాగా సింగిల్‌గా వస్తారని తెలిపారు.

సమన్వయకర్తల నియామకం

పలు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల సమన్వయ కర్తలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.తారక రామారావు నియమించారు. షేక్ అబ్దుల్లా సోహైల్ (జీహెచ్ఎంసీ), రాపోలు ఆనంద భాస్కర్ (మునుగోడు), పద్మావతి డీపీ రెడ్డి (అంబర్ పేట)లు నియమితులైన వారిలో ఉన్నారు.

కార్మికులను ఇజ్రాయిల్ పంపొద్దు

పాలస్తీనాకు సంఘీభావం తెలపండి

- ఇజ్రాయిల్ మారణహోమాన్ని నిరసించండి : మోడీ ప్రభుత్వానికి సీఐటీయూ డిమాండ్



న్యూఢిల్లీ : ఇజ్రాయిల్ బిల్డర్స్ అసోసియేషన్ కోరిక మేరకు భారతీయ కార్మికులను ఆ దేశానికి పంపవద్దని సీఐటీయూ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. పాలస్తీనాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణహోమానికి వత్తాసు పలకవద్దని, పాలస్తీనా ప్రజలకు సంఘీ భావం తెలపాలని కోరింది. పాలస్తీనాలో ఇజ్రాయిల్ దళాలు వెంటనే కాల్పుల విరమణ పాటించేలా, ఆక్రమణల నుండి పాలస్తీనా భూభాగానికి విముక్తి కల్పించేలా కృషి చేయాలని మోడీ ప్రభుత్వానికి సూచించింది. ఈ మేరకు సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు.'ఇజ్రాయిల్ దళాలు పాలస్తీనాపై ఉద్దేశపూర్వకంగా దాడులు జరుపుతూ మహిళలు, చిన్నారులు సహా వేలాది మంది ప్రజలను పొట్టనపెట్టుకుంటున్నాయి. అంతేకాక తమ దేశంలో వివిధ రంగాల్లో పనిచేస్తున్న పాలస్తీనా కార్మికులను దేశం విడిచి వెళ్లాలని ఇజ్రాయిల్ ప్రభుత్వం ఆదేశించింది.

ఈ క్రమంలో ఇజ్రాయిల్ బిల్డర్స్ అసోసియేషన్ వారు యాభై వేల నుండి లక్ష మంది కార్మికులు, నిర్మాణ కార్మికులను పంపాలని మన దేశాన్ని కోరుతున్నారు. ఇజ్రాయిల్‌లో పని చేసేందుకు వీరిని ఉపయోగించుకోవాలని చూస్తున్నారు. ఇజ్రాయిల్ బిల్డర్స్ అసోసియేషన్ ఇప్పటికే మన ప్రభుత్వానికి నేరుగా, అక్కడి ప్రభుత్వం ద్వారా అభ్యర్థన పంపినట్లు తెలిసింది. ఇజ్రాయిల్‌లో పనిచేస్తున్న పాలస్తీనా కార్మికుల పట్ల అక్కడి ప్రభుత్వం అమానుషంగా, ఆటవికంగా ప్రవర్తించడాన్ని సీఐటీయూ తీవ్రంగా నిరసిస్తోంది. ఖండిస్తోంది. పాలస్తీనాలో ఇప్పటికే ఇజ్రాయిల్ దళాలు ఉద్దేశపూర్వకంగా మారణహోమానికి పాల్పడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో భారతీయ కార్మికులను ఇజ్రాయిల్‌కు పంపవద్దని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఒకవేళ కేంద్రం ఇలాంటి చర్యలకు పూనుకున్నప్పటికీ స్పందించవద్దని, తిరస్కరించాలని కార్మికులను కోరుతున్నాం' అని తపన్ సేన్ ఆ ప్రకటనలో కోరారు.

ఇలాంటి కీలక సమయంలో ఇజ్రాయిల్‌కు భారతీయ కార్మికులను పంపడాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానం ఆమోదించిన భారత నిర్మాణ కార్మికుల సమాఖ్యను సీఐటీయూ అభినందించింది. ఇజ్రాయిల్ ప్రభుత్వం, అక్కడి బిల్డర్స్ అసోసియేషన్ అభ్యర్థనను తిరస్కరించాలని కార్మిక వర్గం తరఫున ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. కాల్పుల విరమణ పాటించాలంటూ ఐరాస ఇటీవల చేసిన తీర్మానానికి మద్దతు ఇవ్వాలని, అన్ని రకాల ఆక్రమణల నుండి పాలస్తీనా భూభాగానికి విముక్తి కలిగించడానికి కృషి చేయాలని మోడీ ప్రభుత్వానికి సూచించింది.

పాలస్తీనా ప్రజలకు, వారి డిమాండ్‌కు సంఘీభావంగా, అదే సమయంలో పాలస్తీనాకు వ్యతిరేకంగా సామ్రాజ్యవాద అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ సాగిస్తున్న దాడులకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించాలని కార్మికలోకానికి సీఐటీయూ పిలుపునిచ్చింది. అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్, రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్ మన దేశంలో పర్యటిస్తున్న నేపథ్యంలో పాలస్తీనా అంశంపై ఈ నెల 7-10 తేదీల మధ్య ప్రగతిశీల, వామపక్ష శక్తులు నిర్వహిస్తున్న నిరసన-సంఘీభావ కార్యక్రమంలో భాగస్వాములవ్వాలని కార్మికులను కోరింది.

పారిశ్రామిక కాలుష్య నియంత్రణ చర్యలకు హైకోర్టు ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జీడిమెట్ల పారిశ్రామికవాడలో వ్యర్థాల నిర్వహణకు చర్యలు తీసుకోకుండా డ్రైనేజీలోకి వదిలివేయడంపై హైకోర్టు స్పందించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, కాలుష్య నియంత్రణ మండళ్లు. మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్లతోపాటు 69 పరిశ్రమలకు సోమవారం నోటీసులు జారీ చేసింది. వ్యర్థాలను శు ద్ధి చేయకుండా నేరుగా నాలాల్లోకి వదులుతున్నారనే ప్రజాహిత వ్యాజ్యాన్ని సామాజిక కార్యకర్త పి.ఎల్.ఎన్. రావు దాఖలు చేశారు. దీనిని ప్రధాన న్యాయమూర్తి అలోక్ ఆరాదే, జస్టిస్ ఎన్ వి. శ్రవణ్ కుమార్లతో కూడిన డివిజన్ బెంచ్ ఇటీవల విచారించింది. జీడిమెట్ల ప్రాంతంలో 300 పరిశ్రమలుండగా ఇందులో 70 వరకు రసాయన, ఔషధ కంపెనీలు ఐడీఏ పరిధిలో ఉన్నాయని పిటిషనర్ న్యాయవాది అనిరుద్ తెలిపారు. రోజుకు 5 లక్షల లీటర్ల ద్రవ, ఘనవ్యర్థాలను విడుదల చేస్తున్నాయని తెలిపారు. వీటిలో ప్రమాదకర వ్యర్థాల నిర్వహణ నిబంధనలకు విరుద్ధంగా నేరుగా నాలాల్లోకి వదులుతున్నారని చెప్పారు.

నాలాల ద్వారా ఆ కాలుష్య జలాలు హుసేన్ సాగర్, మూసీలోకి చేరుతున్నాయని అన్నారు. ఇవి రంగారెడ్డి, నల్గొండ జిల్లాల ద్వారా ప్రవహించి కృష్ణానదిలో కలుస్తున్నాయని వివరించారు. 200 కిలో మీటర్ల మేర నదుల్లో ప్రవహిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని చెప్పారు. ఈ సమస్యపై వినతి పత్రాలు ఇచ్చినా స్పందన లేదని తెలియజేశారు. ప్రమాదకర (రెడ్) జోన్లోని పరిశ్రమలను ఔటర్ రింగు రోడ్డు ఆవలకి తరలించాలంటూ జీవో 20 జారీ చేసి దశాబ్దం దాటినా ఆచరణలోకి రాలేదని చెప్పారు.

జీడిమెట్ల పారిశ్రామికవాడ వ్యర్థాలను రాత్రిపూట అక్రమంగా నాలాల్లోకి వదలడం వల్ల ప్రజల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. పీసీబీ అధికారులు చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం లేదని చెప్పారు. జవ్వర్ల ఫార్మ సిటీ పేరుతో భూమిని ప్రభుత్వం సేకరించి అనుమతులిచ్చినా తరలింపు చేయలేదన్నారు. వాదనల తర్వాత హైకోర్టు, ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.

పోలీస్ రాజ్యం !

రాష్ట్రమంతా భారీగా తనిఖీలుఎక్కడ చూసినా వారే

- బంగారం, మద్యం, డ్రగ్స్ స్వాధీనం
- ఎన్నికల నేపథ్యంలో 'పవర్'ను ఎంజాయ్ చేస్తున్న ఖాకీలు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ పోలీస్ నిర్బంధంలో ఉందా ? ఏజెన్సీలోనూ పారా మిలిటరీ దళాల హవా నడుస్తున్నదా ? జిల్లాల్లో ఎక్కడికక్కడ వాహనాల తనిఖీలు జోరుగా సాగుతున్నాయా ? అంటే అవుననే సమాధానాలు వస్తున్నాయి. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రమంతా పోలీస్ వలయంలో ఉంది. ఏ గ్రామం చూసినా, ఏ పట్టణానికెళ్లినా, ఏ నగరాన్ని పరిశీలించినా పోలీసుల బూట్ల చప్పుళ్లే వినిపిస్తున్నాయి. లాఠీ కర్రల హడావిడే వినిపిస్తున్నది. తుపాకులను భుజానికేసుకుని విధుల్లో సాగిపోతుంటే అబ్బురపడిచూస్తున్నవారు కొందరైతే, భయానికి లోనవుతున్నవారు మరికొందరు. సాధారణ సమయంలో అధికార పార్టీ అనుచరులుగా ఉండే ఏ ప్రభుత్వ శాఖ అధికారి అయినా, పోలీసులు అయినా ఎన్నికల సమయంలో 'షేర్' అవుతారు. తమ పవర్‌ను చూపించే ప్రయత్నం చేస్తుంటారు. సరిగ్గా రాష్ట్రంలో ఇప్పుడు అదే చిత్రం కనిపిస్తున్నది. జరుగుతున్నది. ప్రభుత్వం యంత్రాంగం తమ అధికారాలను వినియోగించే పనిలో నిమగ్నమయ్యారు. పోలీసులైతే తమ పవర్‌ను ఉపయోగించుకునే పనిలోపడ్డారు. దాదాపు 45 రోజుల ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేసేందుకు అహర్నిశలు కృషిచేస్తున్నారు.

రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల సందడి నెలకొంది. ఇక్కడా, అక్కడా అని కాకుండా ఎక్కడబడితే అక్కడ పోలీసులు, ఎన్నికల అధికారులు, టాస్క్‌ఫోర్స్ బృందాలు తనిఖీలు చేస్తున్నాయి. ఎన్నికల్లో డబ్బు ప్రభావాన్ని తగ్గించేందుకు, మద్యాన్ని అరికట్టేందుకు విస్తృత ప్రయత్నాలు జరుగుతున్నాయి. దాదాపు 148 చెక్‌పోస్టుల ద్వారా 275 కంపెనీల పారామిలిటరీ దళాలు విధుల్లో ఉన్నాయి. డబ్బు, మద్యం, బంగారం, డ్రగ్స్ తదితరాలను 'సీజ్' చేస్తున్నాయి. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తోపాటు మున్సిపల్ కార్పొరేషన్లు, జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో పోలీసులు, సీఆర్‌పీఎఫ్ జవాన్ల కవాతు జరుగుతున్నది. అలాగే ఏజెన్సీ ఇందుకు మినహాయింపేమి కాదు. పారామిలిటరీ దళాలు కొండలు, గుట్టలను జల్లెడపడుతున్నాయి. మావోయిస్టుల ప్రభావం ఉండే ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేపడుతున్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై 24 గంటల నిఘా కొనసాగుతున్నది. అక్కడ నిత్యం కవాతు చేస్తున్నారు. మొబైల్ వాహనాల్లో గ్రామాల్లో తిరుగుతున్నారు.

షెడ్యూల్ వచ్చిన కొద్ది గంటల్లోనే పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. టాస్క్‌ఫోర్స్, సివిల్ అధికారులతో కలిపి పోలీసులు పనిచేస్తున్నారు. లారీలు, బస్సులు, కార్లు, జీపులు, చివరకూ బైకర్లనూ వదలడం లేదు. పిల్లలు,వృద్ధులు, మహిళలు అని కూడా చూడటం లేదు. వాహనం ఉందా, అందులో బ్యాగులు, కవర్లు కనిపిస్తే అంతే. అన్ని దులపాల్సిందే. చెక్ చేయాల్సిందే. రూ. 50 వేలకు మించి దొరికితే అంతే. సరైన ధ్రువపత్రాలు చూపకపోతే కేసు పెట్టాల్సిందే. ఫోన్లు చేసి మాట్లాడించే ప్రయత్నాలను పోలీసులు అడ్డుకుంటున్నారు. సిఫారసులను ససేమిరా అంటున్నారు. 'మేము ఇప్పుడే డ్యూటీ సక్కగా చేస్తున్నం...'' అని పేరు రాయడానికి ఇష్టపడని ఓ పోలీస్ అధికారి 'నవతెలంగాణ'తో వ్యాఖ్యానించడం గమనార్హం.



ఎప్పుడూ మంత్రులు, ఎమ్మెల్యేల ఆదేశాలు, ఫోన్లతో విసిగిపోయాం..ఇప్పుడైనా మమ్మల్ని సరిగ్గా పనిచేయనివ్వండి అంటూ నవ్వుకుంటూ వెళ్లిపోయారు. ఐదేండ్లకోసారి వచ్చే ఈ అవకాశాన్ని నిజాయితీగా పనిచేస్తూ సద్వినియోగం చేసుకుంటామని చెబుతున్న వారూ లేకపోలేదు. ఎవరి వాహనాలను వదిలిపెట్టడంలేదు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధుల వెహికిళ్లను చెక్ చేస్తున్నారు. సర్కారీ వాహనాలనూ వదలడం లేదు. చివరకూ ముఖ్యమంత్రి కేసీఆర్ వాహనం 'ప్రగతి రథం' సైతం తనిఖీకి గురైంది. మంగళవారం చెన్నూరు, మంథని, పెద్దపల్లి నియోజకవర్గాల పర్యటనలో భాగంగా సీఎం ప్రయాణించే వాహనాన్ని పెద్దపల్లి దగ్గర ఎన్నికల అధికారులు పూర్తిస్థాయిలో రెండోసారి తనిఖీ చేశారు.

ఇక హైదరాబాద్ విషయానికొస్తే నిజంగానే పోలీస్ వలయంలో చిక్కుకుందా అన్నట్టుగా కనిపిస్తున్నది. అవుటర్ రింగు రోడ్డు దగ్గర నుంచి మొదలెడితే లోపలికొచ్చేవరకు ఎన్నో చెక్‌పోస్టులు దాటాలి. నగరంలోకి వస్తున్నకొద్ది వాహనాల వేగం తగ్గిపోతున్నది. ట్రాఫిక్‌తోపాటు తనిఖీలే ఇందుకు ప్రధాన కారణం. సాధారణంగా హైదరాబాద్‌లో అన్ని ప్రధాన కూడళ్లలో పోలీసులు సహజంగానే కనిపిస్తారు. ట్రాఫిక్ పోలీసులైతే మరీ కామన్. కానీ ఇప్పుడు చిన్న చిన్న చౌరస్తాల్లోనూ దర్శనమిస్తున్నారు. సీసీ కెమెరాల డేగ కన్ను మరోవైపు ఉండనే ఉంది. నిరంతరం అవి పనిచేసేలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఒక్కో చోట 10 నుంచి 20 మంది పోలీసులు ఉంటున్నారు. పాతబస్తీలో ఈ సంఖ్య కాస్త ఎక్కువే. వాహనాలు, లారీలు, తుపాకులు వెంటే ఉంటున్నాయి. ఎన్నికల్లో ఇది మామూలే అయినా, జనం ఒకింత టెన్షన్‌కు గురవుతున్నారు. సరిగ్గా మరో 23 రోజుల్లో పోలింగ్ జరగనుండటంతో అందరిలోనూ ఆసక్తి కనిపిస్తున్నది. ఈసారి యువత ఎక్కువ సంఖ్యలో ఓట్లు నమోదు చేసుకున్నది. పారా మిలిటరీ బలగాలు గతంలో 100 కంపెనీలు వస్తే, ఈమారు 275 కంపెనీలు రప్పిస్తున్నారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్లతోపాటు హెచ్ఎండీఏ పరిధిలోనూ పోలీసు యంత్రాంగం అప్రమత్తతతో పనిచేస్తున్నది. నామినేషన్ల ఉపసంహరణ తర్వాత ప్రతి అభ్యర్థి ఒక్కో షాడో పార్టీని ఏర్పాటు చేస్తారు. వారంతా 24 గంటలు అభ్యర్థుల వెనకాలే తిరుగుతుంటారు. ఇదిలావుండగా హెలికాప్టర్లనూ తనిఖీ చేసే అవకాశాలు ఉంటాయి.

పెండింగ్ డీఏలను విడుదల చేయాలి

- దీపావళి సెలవును 13కు మార్చాలి : సీఎస్‌కు టీఎన్జీవో వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దీపావళి పండుగను పురస్కరించుకుని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎదురుచూస్తున్న పెండింగ్‌లో మూడు డీఏలను వెంటనే విడుదల చేయాలని టీఎన్జీవో కేంద్ర సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. దీపావళి సెలవు దినాన్ని 12కు బదులుగా 13వ తేదీకి మార్చాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతికుమారిని మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. సీఎస్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకట్, కోశాధికారి రామినేని శ్రీనివాసరావు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ముజీబ్ హుస్సేనీ, నాయకులు శ్రీకాంత్, మహేష్, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్‌లో ఇరుక్కొని బాలుడి మృతి



నవతెలంగాణ-హయత్ నగర్

హైదరాబాద్ ఎల్బీనగర్‌లోని ఓ నూతన భవనంలో లిఫ్ట్‌లో ఇరుక్కొని బాలుడు మృతి చెందాడు. పోలీసులు, బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలానికి చెందిన బొల్లికొండ నాగరాజు, అనురాధ దంపతులకు ఇద్దరు మగ పిల్లలున్నారు. జీవనోపాధికి కోసం కుటుంబంతో పాటు నగరానికి వచ్చిన నాగరాజు ఇటీవలే ఎల్బీనగర్ ఆర్టీసీ కాలనీలోని నూతన అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా చేరాడు. మంగళవారం అతని పెద్ద కుమారుడు అక్షయ్(4) భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్‌కు వెళ్లేందుకు రెండో అంతస్తులో లిఫ్ట్ ఎక్కాడు. అయితే లిఫ్ట్ సరిగ్గా పనిచేయకపోవడంతో చిన్నారి లిఫ్ట్‌లో ఇరుక్కుపోయాడు. గమనించిన తల్లిదండ్రులు అక్షయ్‌ను బయటకు తీసి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అయితే తమ కొడుకుని తమకు చూపించకుండా పోలీసులు, బిల్డింగ్ ఓనర్స్ పోస్ట్‌మార్టమ్‌కు తరలించారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.

రంగాపురంలో పగడాల మానస అంత్యక్రియలు

నవ తెలంగాణ - గరిడేపల్లి



నవతెలంగాణ సంగారెడ్డి జిల్లా అకౌంటెంట్‌గా పనిచేస్తున్న పగడాల మానస సోమవారం ఉదయం సంగారెడ్డి జిల్లాకేంద్రంలోని తన నివాసంలో చనిపోయింది. వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకున్నట్టు ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. మానస భౌతికకాయాన్ని మంగళవారం ఉదయం ఆమె అత్తగారి నివాసమైన సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం రంగాపురం గ్రామానికి తీసుకొచ్చారు. సాయంత్రం అంత్యక్రియలు జరిగాయి. పగడాల మానస విద్యార్థి దశలో ఎస్ఎఫ్ఐలో పనిచేశారు. కొన్నేండ్లుగా మానస నవతెలంగాణలో అకౌంటెంట్‌గా పనిచేస్తోంది. రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలో పనిచేసింది. మానస మాజీ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి పగడాల లక్ష్మయ్య సతీమణి. ఆమెకు కుమారుడు, కూతురు ఉన్నారు. మానస అకాల మరణం పట్ల నవతెలంగాణ సంగారెడ్డి జిల్లా కార్యాలయం సిబ్బంది, ఉమ్మడి నల్గొండ జిల్లా ఎస్ఎఫ్ఐకి చెందిన పలువురు నాయకులు ఆమె కుటుంబానికి సంతాపం తెలిపారు. ఆమె మృతి పట్ల నవతెలంగాణ ఎడిటర్ ఆర్. సుధాభాస్కర్, సీజీఎం పి. ప్రభాకర్ సంతాపం తెలియజేశారు.

రాజేందర్ నగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఆప్ ఎమ్మెల్యే అభ్యర్థిగా హేమ నామినేషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రంగారెడ్డి జిల్లా రాజేందర్ నగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు, సినీ నటి హేమ జిల్లోజు మంగళవారం అత్తాపూర్ ఆర్డీఓ కార్యాలయంలో నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు.. అంతకుముందు పార్మారెడ్డి కాలనీ తన నివాసం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు నిర్వహించిన పాదయాత్రలో వందలాది మంది పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హేమ మాట్లాడుతూ బీఆర్ఎస్ కుటుంబ అవినీతి పాలన, బీజేపీ విద్వేష రాజకీయాలు, కాంగ్రెస్ కుమ్ములాటలతో ప్రజలు విసిగిపోయి మార్పు కోరుకుంటున్నారని తెలిపారు. సమస్యలపై అసెంబ్లీలో ప్రశ్నించే గొంతుకగా పని చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాము గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు కుడికంటికి శస్త్రచికిత్స

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తెలుగుదేశం జాతీయ అధినేత ఎన్.చంద్రబాబునాయుడు కుడి కంటికి శస్త్ర చికిత్స జరిగింది. మంగళవారం హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి డాక్టర్లు బాబుకు అపరేషన్ చేశారు. ఈ సర్జరీ దాదాపు రెండు గంటలపాటు నిర్వహించినట్టు సమాచారం. అనంతరం ఆస్పత్రి నుంచి కాన్వాయ్‌లో చంద్రబాబు, జూబ్లీహిల్స్‌లోని తన ఇంటికి వెళ్లిపోయారు. జూన్‌లో చంద్రబాబు ఎడమ కంటికి సర్జరీ జరిగిన విషయం తెలిసిందే. మంగళవారం కుడి కంటికి అపరేషన్ చేశారు. సోమవారం ఏఐజీలో చంద్రబాబుకు డాక్టర్లు చర్మ సంబంధిత పరీక్షలు నిర్వహించిన విషయమూ విదితమే.

10న కామారెడ్డికి కర్నాటక సీఎం

ఈనెల 10న కామారెడ్డిలో నిర్వహించబోయే సభకు కర్నాటక సీఎం సిద్ధ రామయ్య హాజరుకానున్నారు. ఈ సభలో బీసీ డిక్లరేషన్ విడుదల చేస్తారు.అందులో బీసీ సబ్‌ప్లాన్ కాంగ్రెస్ ఏర్పాటు, కులగణన చేస్తామనే ప్రకటన చేయనున్నారు. వాటితోపాటు క్రిమిలేయర్ ఎత్తివేయాలనే హామీ ఇవ్వనున్నారు.

ఎంసీపీఐ(యూ) నుంచి సబ్బని కృష్ణ బహిష్కరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన సబ్బని కృష్ణను బహిష్కరిస్తున్నట్టు ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వల్లెపు ఉపేందర్‌రెడ్డి ప్రకటించారు. ఆయన పార్టీ ప్రాథమిక సూత్రాలకు కట్టుబడి పని చేయకుండా ఒంటెద్దు పోకడలతో పని చేస్తూ పార్టీకి నమ్మక ద్రోహం చేస్తున్నారని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దాదాపు ఏడాది కాలం నుంచి క్రమశిక్షణ రాహిత్యాన్ని సరి చేసుకోవాలంటూ హెచ్చరించినా ఆయన పనితీరులో మార్పు రానందునే ఈ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు.

చుక్కా రామయ్యను పరామర్శించిన మంత్రి ఎర్రబెల్లి

నవతెలంగాణ బ్యూరో, హైదరాబాద్



వయోభారం మూలంగా వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న మాజీ ఎమ్మెల్సీ, ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్యను రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పరామర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తాను పాలకుర్తి బీఆర్ఎస్ అభ్యర్థిగా నామినేషన్ వేసినట్లు చెప్పి ఆశీర్వాదం తీసుకున్నారు. కాగా, గతంలోనూ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు చుక్కా రామయ్య ను కలిసి, ఆశీర్వాదం తీసుకున్నారు.

ఎన్నికల కో-ఆర్డినేటర్‌గా పద్మావతి డిపి రెడ్డి

- బీఆర్ఎస్ శ్రేణులంతా సమన్వయంతో పని చేయాలి: అంబర్‌పేట్ బీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలి
- వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ దిశానిర్దేశం



హైదరాబాద్: అంబర్‌పేట్ అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల కో-ఆర్డినేటర్‌గా పద్మావతి డిపి రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆమె నియామకానికి సంబంధించిన కాపీని బీఆర్ఎస్ పార్టీ అంబర్‌పేట్ కార్యాలయంలో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, నియోజకవర్గ ఇంఛార్జీ గంధ్ర మోహన్ రావు అందజేశారు. అంబర్‌పేట్ బీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని పద్మావతి డిపి రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రివర్యులు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. మహిళామణుల కోసం, సబ్బండ వర్గాల సంక్షేమం కోసం బీఆర్ఎస్ సర్కార్ అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజలకు వివరించాలని కోరారు. బీఆర్ఎస్ శ్రేణులతో సమన్వయంతో పని చేయాలని కోరారు. అంబర్‌పేట్ నియోజకవర్గంలో గడపగడపకు సంక్షేమ ఫలాలను అందించేందుకు బీఆర్ఎస్ సర్కార్ చిత్తశుద్ధితో పని చేస్తున్నదని అన్నారు. కాగా, అంబర్‌పేట్ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల కో-ఆర్డినేటర్‌గా తనను నియమించిన పార్టీ చీఫ్ కేసీఆర్‌కు, మంత్రి కేటీఆర్‌కు, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, నియోజకవర్గ ఇంఛార్జీ గంధ్ర మోహన్ రావుకు పద్మావతి డిపి రెడ్డి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

బీసీలు ఇప్పుడు గుర్తొచ్చారా?

- మోడీపై వి హనుమంతరావు ఆగ్రహం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ప్రధాని మోడీకి బీసీలు ఇప్పుడు గుర్తొచ్చారా? అని మాజీ ఎంపీ వి. హనుమంతరావు ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు బీసీ జపం చేస్తే బీజేపీని ప్రజలు నమ్మరని గుర్తు చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేతలు పొన్నం ప్రభాకర్, కత్తి వెంకటస్వామి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, చరణ్‌కౌశిక్, డాక్టర్ లింగంయాదవ్‌తో కలిసి ఈ సందర్భంగా 'మార్పు రావాలి...కాంగ్రెస్ రావాలి' అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం హనుమంతరావు మాట్లాడుతూ బీసీల కోసం కాంగ్రెస్ ఎంతో చేసిందన్నారు.

ఐఐటీ, ఐఐఎమ్‌లో రిజర్వేషన్లు కావాలని కోర్టుకు వెళ్తే అవకాశం లేదని సుప్రీం కోర్టు చెప్పిందని గుర్తు చేశారు. ఓబీసీ కుల గణన చేసేందుకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారని తెలిపారు. ఇప్పుడు మోడీకి బీసీల ఆత్మగౌరవం గుర్తొచ్చిందా? అని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కావాలని అడిగిన పవన్ కళ్యాణ్ ఇప్పుడు మోడీ పక్కన చేరారని ఎద్దేవా చేశారు. పవన్ కళ్యాణ్‌ను బీజేపీ వాళ్ళు వాడుకుంటున్నారని తెలిపారు. బీసీల గురించి చెప్తున్న పవన్ కళ్యాణ్ కాపు సామాజికతరగతికి చెందినవారన్నారు. ప్రయివేటు పరిశ్రమల్లో రిజర్వేషన్లు ఎందుకు అడగలేదని నిలదీశారు. మోడీ ఓబీసీలకు చేస్తున్న మోసాన్ని గమనించాలన్నారు. కాంగ్రెస్ ఒక్కటే బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేస్తుందని ఆయన చెప్పారు. కేసీఆర్ చేసిన సమగ్ర సర్వే రిపోర్టును బయట పెట్టాలని డిమాండ్ చేశారు. ఓబీసీ జాతీయ అధ్యక్షులు లక్ష్మణ్ ఏడాది కాలంగా ఎందుకు బీసీ సమావేశం నిర్వహించలేదని ప్రశ్నించారు.

వేములవాడ తుల ఉమకే

- పంతం నెగ్గించుకున్న ఈటల
- బీజేపీ స్టేట్ ఆఫీస్ వద్ద కార్యకర్త ఆత్మహత్యాయత్నం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సుదీర్ఘమంతనాలు, మల్లగుల్లాల తర్వాత వేములవాడ అభ్యర్థిగా తుల ఉమను బీజేపీ జాతీయ నాయకత్వం ప్రకటించింది. ఈ విషయంలో ఈటల రాజేందర్ పంతం నెగ్గించుకున్నారు. అయితే, వికాస్‌రావుకు సీటు ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద ఓ కార్యకర్త ఆత్మహత్యాయత్నం చేసుకోవడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. తన సుదీర్ఘ అనుభవాన్ని జోడించి జాతీయ స్థాయిలో సీటు కోసం పట్టుబట్టినా మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు తన కొడుక్కి సీటు దక్కించుకోలేకయారు. ఈ విషయంలో వికాస్‌రావుకు చివరకు మొండిచేయి ఎదురైంది. మొత్తం 12 మందితో బీజేపీ నాలుగో జాబితాను విడుదల చేసింది. దీంతో ఇప్పటి వరకూ బీజేపీ నాలుగు విడతల్లో 100 మంది అభ్యర్థులను ప్రకటించినట్టు అయింది. మునుగోడు సీటును చల్లమల్ల కృష్ణారెడ్డికి ఇచ్చింది. పొత్తుల్లో భాగంగా జనసేన పార్టీకి ఎనిమిది స్థానాలను బీజేపీ కేటాయించింది. శేరిలింగంపల్లి సీటు విషయంలో ఇంకా ఎటూ తేల్చలేదు. అయితే, వికాస్‌రావుకు టికెట్ కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ అతని అనుచరులు మంగళవారం సాయంత్రం బీజేపీ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. వేములవాడ టికెట్‌ను వికాస్‌రావుకు కేటాయించే వరకూ ఆందోళన విరమించబోమని పట్టుబట్టడంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది.

జాతీయ పెన్షన్ విధానం తేవాలి

- ఏఐఎస్‌జీఈఎఫ్ ప్రధాన కార్యదర్శి శ్రీకుమార్ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లందరికీ జాతీయ పెన్షన్ విధానాన్ని రూపొందించాలని, కనీస పెన్షన్ రూ.12 వేలు ఉండాలని అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య (ఏఐఎస్‌జీఈఎఫ్) ప్రధాన కార్యదర్శి శ్రీకుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమిళనాడు రాజధాని చెన్నైలో మంగళవారం అఖిల భారత పెన్షనర్ల జాతీయ ప్రథమ మహాసభ ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు అశోక్ తులే అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీకుమార్ మాట్లాడుతూ పెన్షన్ అనేది ప్రభుత్వాలు ఇస్తున్న బిక్ష కాదనీ, ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించిన హక్కు అని చెప్పారు. దురదృష్టవశాత్తు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్యల మూలంగా పెన్షన్ ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. పెన్షన్ ఖర్చులు తగ్గించుకునేందుకు ప్రభుత్వాలు చూస్తున్నాయని విమర్శించారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎలాంటి కాంట్రిబ్యూషన్ లేకుండా జాతీయ స్థాయిలోనే హెల్త్ ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రారంభించాలని కోరారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు 300 మంది ప్రతినిధులు ఈ మహాసభలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి పాలకుర్తి కృష్ణమూర్తి, రాష్ట్ర నాయకులు లింగాల అరుణ, జనార్దన్ రెడ్డి. నరహరి, క్యాథరిన్, నాగేశ్వరరావు, కె రామ్మోహన్‌రావు. రమేష్, స్వరాజ్ కుమార్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పాలమూరులో 14 స్థానాల్లోనూ కాంగ్రెస్‌ను గెలిపించాలి

అలంపూర్ బహిరంగ సభలో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి

- కేసీఆర్ నిర్లక్ష్యం వల్ల తుమ్మెళ్ళ రిజర్వాయర్ పూర్తి కాలే
- వాల్మీకులను ఎస్టీలో చేర్చడంతో పాటు ఎమ్మెల్సీ ఇస్తాం
- 24 గంటల విద్యుత్ ఇస్తున్నట్టు నిరూపిస్తే నామినేషన్ వేయను..

నవతెలంగాణ- అలంపూర్



ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని 14 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. జోగులాంబ గద్వాల జిల్లాలోని అలంపూర్‌లో జోగులాంబ బాల బ్రహ్మేశ్వర ఆలయాన్ని అలంపూర్ కాంగ్రెస్ అభ్యర్థి సంపత్ కుమార్‌తో కలిసి దర్శించుకున్నారు. అనంతరం శాంతినగర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధి చెందాలంటే, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలన్నారు. అలంపూర్ రైతులకు ఆర్డీఎస్‌పై కుర్చీ వేసుకొని నీరు పారిస్తామని చెప్పిన కేసీఆర్ హామీ నెరవేర్చకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉన్న సంపత్ కుమార్ ఆర్డీఎస్‌పై కేసీఆర్‌కు కుర్చీ వేసి నిరాహార దీక్ష చేశారని గుర్తుచేశారు. ఆర్డీఎస్ సమస్య పరిష్కారం కోసం సంపత్ కుమార్ చేసిన పోరాటం వల్ల తుమ్మిళ్ల సాధించుకున్నామన్నారు. కానీ నేటికీ తుమ్మిల రిజర్వాయర్ పూర్తి చేయడంలో కేసీఆర్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. సమస్యల పరిష్కారానికి తాను.. సంపత్ బాధ్యత తీసుకుంటానన్నారు. ధరణి పోర్టల్ బీఆర్ఎస్‌కు ఏటీఎంలా మారిందని తెలిపారు. రాష్ట్రంలో వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ ఇస్తున్నట్టు నిరూపిస్తే తాను నామినేషన్ వేయబోనని సవాల్ విసిరారు. జోగులాంబ ఆలయ అభివృద్ధికి రూ.100 కోట్లు ఇస్తామని చెప్పిన కేసీఆర్.. మాట తప్పిందని తెలిపారు. కాంగ్రెస్ నాయకుడిగా ఉన్న చల్లా వెంకట్రామిరెడ్డికి, వారి తాతకు, వారి తండ్రికి కాంగ్రెస్ పార్టీ పదవులను కట్టబెట్టిందని గుర్తుచేశారు. చల్లా వెంకట్రామిరెడ్డికి ఒకప్పుడు మంచి వారైన సంపత్ కుమార్, అబ్రహం.. ఇప్పుడు చెడ్డవారు ఎలా అయ్యారని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చడంతో పాటు, ఎమ్మెల్సీ పదవి ఇస్తామని తెలిపారు. కాంగ్రెస్ తీసుకువచ్చిన ఆరు వాగ్దానాలను పూర్తిగా అమలు చేస్తామని అన్నారు. సభలో కాంగ్రెస్ నాయకులు అడకుల రాము, సర్పంచులు రాంప్రసాద్, రవి, నాయకులు బైరాన్ పల్లి వెంకటేశ్వర్లు, ధర్మరాజు, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు తుమ్మల రవికుమార్, గుందిమల్ల నాయుడు, శ్యాంసుందర్రావు, రామకృష్ణ, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌లో ఈటల రాజేందర్ నామినేషన్ దాఖలు

- జనగామలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఖమ్మంలో పువ్వాడ తరపున..
- ముమ్మరంగా స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్లు పలు జిల్లాల్లో కొనసాగుతున్న ప్రక్రియ



నవ తెలంగాణ-విలేకరులు

ఐదవ రోజున మంగళవారం నామినేషన్ల ప్రక్రియ ఊపందుకుంది. మెదక్ జిల్లా గజ్వేల్ అసెంబ్లీ స్థానానికి హుజురాబాద్ ఎమ్మెల్యే, బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్, జనగామలో బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి నామినేషన్ పత్రాలను సమర్పించారు. అలాగే, సిర్పూర్(టి) నియోజకవర్గం నుంచి బీఎస్పీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తరపున పార్టీ నాయకులు అర్షద్ ఉస్సేన్ నామినేషన్ దాఖలు చేశారు. వారితో పాటు పలు పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేశారు. మరో మూడు రోజుల్లో నామినేషన్ల గడువు ముగుస్తుండటంతో అన్ని పార్టీల అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు సమాయత్తమవుతున్నారు. గజ్వేల్ అభ్యర్థి ఈటల రాజేందర్‌తో పాటు మరో ఐదుగురు నామినేషన్ పత్రాలు వేశారు. గజ్వేల్ బీజేపీ అభ్యర్థిగా ఈటల జమున, స్వాతంత్ర అభ్యర్థులుగా బొంగుల రాజు, కర్ణాకర్ రెడ్డి, మండల నరసింహులు, సదానంద రెడ్డి నామినేషన్ పత్రాలను సమర్పించినట్టు ఎన్నికల అధికారి బన్సీలాల్ తెలిపారు. ఈటల రాజేందర్ నామినేషన్ కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఐదవ రోజు 31 మంది నామినేషన్లు వేశారు. రంగారెడ్డి జిల్లాలో 27 మంది ఎమ్మెల్యే అభ్యర్థులు నామినేషన్ వేయగా.. వికారాబాద్ జిల్లాలో నలుగురు వేశారు. రంగారెడ్డి జిల్లాలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి, తాండూరు నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి కుర్ర వెంకటయ్య నామినేషన్ దాఖలు చేశారు. జిల్లాలో ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు 26 మంది ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి దరఖాస్తు చేసుకున్నారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 10 నామినేషన్లు దాఖలయ్యాయి. సిర్పూర్(టి) నియోజకవర్గం నుంచి నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. అందులో బీఎస్పీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తరపున పార్టీ నాయకులు అర్షద్ ఉస్సేన్ నామినేషన్ దాఖలు చేశారు. రెండో నామినేషన్ స్వతంత్ర అభ్యర్థిగా వెంకటేష్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా జాడి దీపక్, ఇండియన్ ప్రజాబంధు పార్టీ అభ్యర్థిగా కామ్రే నగేష్, నామినేషన్లు దాఖలు చేశారు. ఆదిలాబాద్‌లో ఒక స్వతంత్ర అభ్యర్థి, మంచిర్యాలలో బీజేపీ అభ్యర్థి వెరబెల్లి రఘునాథ్ రావు నామినేషన్లు వేశారు. ముధోల్, చెన్నూర్‌లో ఒక్కోచోట రెండు నామినేషన్లు దాఖలు చేశారు. బోథ్, నిర్మల్, ఖానాపూర్, బెల్లంపల్లి, ఆసిఫాబాద్ నుంచి ఒకటి కూడ నామినేషన్ రాలేదు.

ఖమ్మం నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్ కుమార్ నామినేషన్ సెట్‌ను నగర మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహార, సుడా చైర్మెన్ విజయ్ కుమార్, జడ్పీటీసీ ప్రియాంక దాఖలు చేశారు. పాలేరులో బీజేపీ అభ్యర్థి రవికుమార్ నున్న నామినేషన్ వేశారు. ఇల్లందులో కాంగ్రెస్ పార్టీ తరపున కోరం కనకయ్య నామినేషన్ వేశారు.

ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు సమర్పించారు. వైరా, సత్తుపల్లిలో ఒక్కో స్వతంత్ర అభ్యర్థి, ఖమ్మం, పాలేరులో ఇద్దరు చొప్పున తమ నామినేషన్లు దాఖలు చేశారు.

జనగామ జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. జనగామ నియోజకవర్గంలో పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు మరో ముగ్గురు నామినేషన్లు వేశారు. స్టేషన్ ఘన్‌పూర్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సింగారపు ఇందిర, ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థి ప్రేమ్‌రెడ్డి రిపిక నామినేషన్లు దాఖలు చేశారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి పద్మతో పాటు మరో ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు సమర్పించారు. పాలకుర్తి, వరంగల్‌లో ఒక్కో స్వతంత్ర అభ్యర్థి నామినేషన్లు వేశారు. భూపాలపల్లి నియోజకవర్గంలో మూడు నామినేషన్ దాఖలయ్యాయి.



చక్కదిద్దుకోవాల్సిన బంధం..

బాధపడినప్పుడు ఓదార్చేవారు, ఆనందంలో పాలు పంచుకునేవారు మన స్నేహితులు. అటువంటి స్నేహితుల మధ్య అనుకోకుండా కొన్ని చిన్న చిన్న మనస్పర్థలు వస్తుంటాయి. స్కూల్లో, కాలేజీల్లో, పని ప్రదేశాల్లో ఎక్కడో చోట ఇటువంటి సంఘటనలు ఎదురయ్యే ఉంటాయి. అయితే ఇవి కేవలం స్నేహితుల మధ్యే కాదు బంధువుల మధ్య కూడా తలెత్తుతుంటాయి. మనం పెద్దయ్యాక ఇతరులతో స్నేహం చేసే విధానం చాలా వరకు వృత్తి పరంగానే ఉంటుంది. అందువల్ల ఈ బిజీ జీవితంలో చిన్నతనంలో దూరమైన స్నేహాలను, సంబంధాలను తిరిగి కలుపుకోవడం గురించి ఎక్కువగా ఆలోచించం. కొంతమంది తమ స్నేహితులతో తిరిగి మాట్లాడాలి అనుకున్నా.. వాళ్లు ఎలా స్వీకరిస్తారో తెలియక ఆ వైపు అడుగులు వేయడానికి సందేహిస్తారు. అలా కాకుండా సందేహాలను పక్కనపెట్టి బంధాన్ని తిరిగి చక్కదిద్దుకోవడానికి కొన్ని మార్గాలను అనుసరించండి.

సమస్యల గుర్తింపు : విడిపోయిన స్నేహబంధాన్ని చక్కదిద్దడానికి మీరే ముందడుగు వేయండి. మొదట విడిపోవడానికి గల కారణాలను గుర్తించి, మీ మధ్య మనస్పర్థలు రావడానికి గల కారణాలను, దాని పరిష్కారాలను అన్వేషించుకోవాలి. ఒకవేళ మీ వైపే తప్పుంటే దాన్ని అంగీకరించండి. మీ స్నేహితుల తప్పుంటే వారిని క్షమించండి.

నమ్మకం : ఏ బంధమైనా నమ్మకంతోనే ముడిపడి ఉంటుంది. కాబట్టి, స్నేహితులతో నమ్మకంగా ఉండండి. ఒకవేళ మనస్పర్థలు వస్తే వాటిని చక్కదిద్దడానికి మీరే మొదటి అడుగు వేయండి. మనస్పర్థలు పక్కన పెట్టి మీ స్నేహితులకి కాల్ చేయండి లేదా ఏదైనా పార్టీకి పిలిచి మాట్లాడండి. తద్వారా మీ మధ్య మనస్పర్థలు సమసిపోతాయి.

నింద మోపొద్దు : మీరిద్దరూ సమస్య పరిష్కరించుకోవడానికి కూర్చున్నప్పుడు, మళ్ళీ పాత తప్పులను గుర్తు చేస్తూ మీ స్నేహితులపై నిందలు మోపకండి. ఎందుకంటే మీ స్నేహితులని నిందించడం అనేది మీ బంధం బలపడటానికి సహాయపడదు. కాబట్టి.. మీ సమస్యను పరిష్కరించడంపైనే ఎక్కువ దృష్టి పెట్టండి.

క్షమాపణలు : పాత స్నేహితులతో తిరిగి మాట్లాడటానికి మనస్ఫూర్తిగా ప్రయత్నించండి. ఒకవేళ మీ స్నేహితులు మీ సంజాయిషీకి అంగీకరించకపోయినా, ప్రయత్నం చేసే అవకాశాన్ని వదులుకోవద్దు. క్షమాపణను అంగీకరించడానికి, క్షమాపణలు అడగటానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండండి.

టూర్ ప్లానింగ్ : అన్నీ అనుకున్నట్టే జరిగి మీరిద్దరూ తిరిగి కలిస్తే మీ బెస్ట్ ఫ్రెండ్‌తో ఇదివరకు మీరు వెళ్లాలనుకున్న ట్రిప్పుకు ప్లాన్ చేయండి. ఇది ఇద్దరి మధ్య స్నేహబంధం బలపడటానికి మంచి జ్ఞాపకాలను పునరుద్ధరించడానికి ఎంతగానో సహాయపడుతుంది.



లూమ్స్ ఆఫ్ లడఖ్... ఇది ఒక సహకార సంస్థ. 16 గ్రామాలకు చెందిన 450 మందికి పైగా మహిళలు వ్యాపారంలో చూపిస్తున్న ఉత్సాహం, పట్టుదలకు చక్కని ఉదాహరణ. వీరంతా కలిసి లడఖీ పష్మినాను ప్రపంచానికి పరిచయం చేసేందుకు పూనుకున్నారు. దీని కోసం సమిష్టిగా కృషి చేస్తున్నారు. ఈ సంస్థ సహ వ్యవస్థాపకురాలైన అభిలాషా బహుగుణ దీని గురించి మరిన్ని విశేషాలు మనతో పంచుకుంటున్నారు...

గ్రామీణ మహిళలకు ఆర్థిక భరోసా

సహకార శక్తి

మొదటి నాలుగేండ్లలో నిధులు సేకరించలేక పోయారు. అయితే మహిళలు కలిసి సొంత ముడిసరుకును సంపాదించారు. వారి సొంత స్థలంలో ఉత్పత్తిని ప్రారంభించారు. పూర్తయిన ఉత్పత్తులను స్థానిక పర్యాటకులకు విక్రయించారు. 'ఈ 150 మంది మహిళలు లేహ్‌లో ఏడు రోజుల పాటు ఉండి, బైలాస్ ప్రకారం వారి నుండి ఒక నిర్వాహక బృందాన్ని ఎన్నుకున్నారు. ఎగ్జిబిషన్‌లు, ఫెయిర్‌ల ద్వారా కొత్త మార్కెట్‌లను పట్టుకున్నాము. తద్వారా మహిళలు మరింత బహిర్గతం అవుతారు' అని ఆమె జతచేస్తుంది. మహిళల నైపుణ్యాల కోసం నిర్వహించిన కార్యక్రమాలతో నేత, టైలరింగ్ కూడా నేర్చుకున్నారు. అభిలాషా ఆ మహిళలను ఉషా గ్రూప్ నుండి టైలరింగ్ కోసం CSR ప్రోగ్రామ్ అయిన ఉషా సిలైకి కూడా పంపారు. జనవరి 2018లో అభిలాషను CSR-అహ్మదాబాద్ వారు అతిథిగా ఆహ్వానించారు.

2013లో అభిలాషా బహుగుణ న్యూఢిల్లీలో నివసించేది. అక్కడ కొంతమంది కాశ్మీరీ పష్మినా అమ్మకందారులతో తన ఇంటి యజమాని ఆవేశంగా బేరసారాలు చేయడం విన్నది. ఈ సంఘటనను వెంటనే ఫేస్‌బుక్ పోస్ట్ చేసింది. ఇంతటి నాణ్యమైన ఉత్పత్తులు చేస్తూ వీరంతా ఇలా అసంఘటితంగా ఎందుకున్నారనే ఆలోచన వచ్చింది. చేతివృత్తులవారంతా కలిసి సహకార సంఘాన్ని ఏర్పాటు చేయగలిగితే ఇలాంటి బేరసారాల సమస్య ఉండదని ఆమెకు అనిపించింది. అభిలాష పంజాబ్, నెదర్లాండ్స్‌లోని టిల్‌బర్గ్ విశ్వవిద్యాలయం నుండి తన చదువు పూర్తి చేసింది.



నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలు

కేవలం మూడేండ్లలో లడఖ్‌లోని 16 గ్రామాలకు చెందిన 450 మంది మహిళలతో కలిసి ఫామ్-టు-ఫ్యాషన్ అనే సహకారం సంఘాన్ని నిర్మించగలదని ఆమె అనుకోలేదు. దీని కోసం ఐఎఎస్ అధికారిగా ఉన్న ఆమె భర్త జి. ప్రసన్న ప్రోత్సాహం కూడా చాలా ఉంది. ప్రసన్న 2015లో లేహ్‌లో డిప్యూటీ కమిషనర్‌గా నియమితులయ్యారు. అతను చుమూర్ గ్రామానికి చెందిన మహిళల బృందాన్ని కలుసుకున్నాడు. వారు అతనికి కొన్ని అల్లిన పష్మినా సాక్స్‌లను చూపించారు. "లడఖ్ వంటి ప్రాంతంలో అటువంటి నైపుణ్యం ఉన్న మహిళలను చూసి ఆయన కదిలిపోయాడు. ఇది 150 మంది మహిళలతో ఈ ప్రాంతంలో ప్రాజెక్ట్ లక్సల్ అనే నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడానికి అతన్ని ప్రేరేపించింది. వారు అల్లికలో శిక్షణ పొందారు' అని ఆమె గుర్తుచేసుకుంది.

అందరి ప్రశంసలు అందుకుంది

ఇతర రాష్ట్రాల మాదిరిగా లడఖ్‌లో పష్మినా కోసం వస్త్ర సమూహాలు లేవు. కుటుంబం గడవడం కోసం అల్లడం, నేయడం వంటి నైపుణ్యాలు ఎన్నో తరాల నుండి వారు కొనసాగిస్తున్నారు. ఇది అది వ్యాపారంగా మాత్రం మారలేదు. పష్మినా మేకలను 4,000-5,000 మీటర్ల ఎత్తులో ఉన్న చాంగ్‌పాస్ అనే సంచార జాతులు పెంచుతారు. కానీ లడఖ్ ముడిసరుకు ఆర్థిక వ్యవస్థగా మిగిలిపోయింది. అయితే కాశ్మీరీ పష్మినా అందరి ప్రశంసలు అందుకుంది. సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్, డిజైన్ ఇంటర్వెన్షన్‌లో వివిధ గ్రామాలకు చెందిన మహిళలు ఒకచోట చేరారు. వారు ఇప్పుడు ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. వాటిని వివిధ ఫెయిర్‌లు, ఎగ్జిబిషన్‌లలో విక్రయిస్తున్నారు. ప్రముఖ షోరూమ్‌లకు తమ ఉత్పత్తులను అందిస్తున్నారు. ఈ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే సహకార సంఘమే సరైన మార్గమని అభిలాష భావించింది. అయితే కొన్ని అడ్డంకులు ఎదురయ్యాయి. 'కొన్ని అడ్డంకులను ప్రతిఘటిస్తూ 2017లో సహకారాన్ని నమోదు చేసాము. నిధుల కోసం కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదిస్తూ కొన్ని ఇబ్బందులు వచ్చాయి. దాంతో నాలుగేండ్లు సొంతంగా లడఖ్‌లోని లూమ్స్‌ను నడిపాము' అని ఆమె చెప్పింది. మహిళలు హిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్‌ను ఆశ్రయించగా, వారు వారి దృక్పథాన్ని, వారి కష్టాలను అర్థం చేసుకుని రాయితీపై అద్దెకు స్థలం ఇచ్చారు.

స్వయంప్రతిపత్తిగా ఉండాలనుకున్నాం

ఐదేండ్ల తర్వాత మహిళలు సంస్థను నడపడం, పుస్తకాలు, జాబితా, అమ్మకాలు, ఇతర విధులను నిర్వహించడంలో ప్రవీణులయ్యారు. 'అప్పటికి లడఖ్ మగ్గాలు బాగా ప్రసిద్ధి చెందాయి. కానీ ప్రభుత్వంతో కలిసి పనిచేయడం మాకు ఇష్టం లేదు. బయటి నియంత్రణ లేకుండా స్వయంప్రతిపత్తిగా ఉండాలనుకున్నాం. అయితే ఇది తప్పుడు సంకేతాన్ని పంపింది. అయినప్పటికీ మేము NABARD వారి ఎన్‌ఏబీ ఫౌండేషన్‌ని సంప్రదించాం. వారు మమ్మల్ని చాలా ఆప్యాయంగా కలుసుకున్నారు. 2022లో మాకు కోటి రూపాయలు మంజూరు చేసారు' అని అభిలాష చెప్పారు.

స్వతంత్ర్య భావాన్ని కలిగిస్తుంది

ప్రస్తుతం నేత కార్మికులు నెలకు సగటున రూ.15 వేలు, రంగులు వేసే వారికి దాదాపు రూ.15 వేలు, టైలర్లు నెలకు రూ.18 వేల వరకు సంపాదిస్తున్నారు. 'సంస్థ ఆఫీస్ బేరర్‌గా, ఈవెంట్ మేనేజ్‌మెంట్, ప్రదర్శనలు, ఫెయిర్‌లలో ఉత్పత్తులను ప్రదర్శించడం గురించి నేను చాలా నేర్చుకున్నాను. కస్టమర్‌లతో మాట్లాడి ఉత్పత్తులను విక్రయించగలమనే నమ్మకం నాకుంది. నేను క్యాషియర్ పదవిని చేపట్టాను. ఆర్థిక నిర్వహణ కోసం ERP నేర్చుకున్నాను' అని ఆమె చెప్పింది. ఏడాది కిందట లూమ్స్‌లో చేరిన సోనమ్ రెండు నెలల శిక్షణ తర్వాత నేను లూమ్స్ ఆఫ్ లడఖ్‌లో టైలరింగ్ ప్రారంభించాను. అలాంటి బ్రాండ్‌తో అనుబంధం కలిగి ఉండటం ఆనందంగా ఉంది. ఈ పని నాకు స్వతంత్ర్య భావాన్ని కలిగిస్తుంది' అన్నది.



కొత్తగూడెం సీపీఐ అభ్యర్థిగా కూనంనేని

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కొత్తగూడెం శాసనసభ నియోజకవర్గం సీపీఐ అభ్యర్థిగా కూనంనేని సాంబశివరావు పేరును ఆ పార్టీ రాష్ట్ర సమితి ఖరారు చేసింది. కాంగ్రెస్ పార్టీ మద్దతుతో సీపీఐ ఈ స్థానం నుంచి పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. కొత్తగూడెం అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుకు ఆ పార్టీ జాతీయ కార్యదర్శులు కె నారాయణ, సయ్యద్ అజీజ్ పాషా, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి బి ఫారాన్ని మంగళవారం హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాసనసభలో పేదలు, కార్మికులు, కర్షకులు, సామాన్యుల గొంతును వినిపించేందుకు సీపీఐని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సాంబశివరావు బుధవారం కొత్తగూడెంలో నామినేషన్ దాఖలు చేయనున్నారు. విశాలాంధ్ర దినపత్రిక విలేఖరిగా కొత్తగూడెంలో కూనంనేని సాంబశివరావు ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత కమ్యూనిస్టు పార్టీలో హోల్ టైమర్‌గా పనిచేస్తున్నారు. 1987లో కొత్తగూడెం మండల ప్రజా పరిషత్ అధ్యక్షునిగా విజయం సాధించారు. 2009లో కూనంనేని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో సీపీఐ తరపున కొత్తగూడెం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. సీపీఐ ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర సహాయ కార్యదర్శిగా పనిచేశారు. గతేడాది సెప్టెంబర్‌లో రాష్ట్ర కార్యదర్శిగా కూనంనేని ఎన్నికయ్యారు. ఆయన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులుగా కూడా కొనసాగుతున్నారు.

వీధినపడ్డ 3.9 లక్షల ఉద్యోగులు

(మొదటిపేజీ తరువాయి)

తయారైంది. లక్షలాది మంది ప్రజలు ఉద్యోగాలు, ఉపాధికి దూరమై అవస్థలు పడుతున్నారు. గాజా స్ట్రిప్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల్లో 61% మంది అంటే 1.82 లక్షల మంది జీవనోపాధి కోల్పోయి వీధిన పడ్డారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) తన నివేదికలో ఈ విషయాన్ని బయటపెట్టింది. హమాస్‌తో ఇజ్రాయిల్ యుద్ధం ప్రారంభించినప్పటి నుండి గాజాలో మౌలిక సదుపాయాలు దారుణంగా దెబ్బతిన్నాయని, వ్యాపారాలు మూతపడ్డాయని, ప్రజలు పెద్ద ఎత్తున నిరాశ్రయులయ్యారని, ఆహారం, తాగునీరు, ఇంధనానికి కొరత ఏర్పడిందని ఆ నివేదిక తెలిపింది. మొత్తంగా అక్కడ ఆర్థిక కార్యకలాపాలు స్తంభించిపోయాయని వివరించింది. యుద్ధం ప్రభావం వెస్ట్‌బ్యాంక్‌పై కూడా పడింది. అక్కడ మొత్తం ఉద్యోగుల్లో 24% మంది అంటే 2.08 లక్షల మంది ఉద్యోగాలు కోల్పోయారు. ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణహోమం కారణంగా ఈ రెండు ప్రాంతాల్లో 3,90,000 మందికి ఉపాధి కరువైంది. మరో మాటలో చెప్పాలంటే దినసరి వేతన కార్మికులు రోజుకు 16 మిలియన్ డాలర్ల ఆదాయాన్ని కోల్పోతున్నారు.

ఇజ్రాయిల్ తన దాడులను మరింత ఉధృతం చేస్తే ఉపాధి కోల్పోయే వారి సంఖ్య ఇంకా పెరుగుతుందని, మానవతావాద సంక్షోభం తీవ్రతరమవుతుందని ఐఎల్ఓ హెచ్చరించింది. గాజాలో నెలకొన్న పరిస్థితి కారణంగా కార్మిక మార్కెట్, ఉద్యోగావకాశాలు, ప్రజల జీవన స్థితిగతుల పైన తీవ్రమైన ప్రభావం పడింది. 'మా ప్రాథమిక అంచనాలను పరిశీలిస్తే ఆందోళనకరమైన, బాధాకరమైన ఫలితాలు వస్తున్నాయి. ఘర్షణ కొనసాగితే పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుంది' అని అరబ్ దేశాలకు సంబంధించిన ఐఎల్ఓ ప్రాంతీయ డైరెక్టర్ రూబా జరాదత్ చెప్పారు. ఈ సంక్షోభం ప్రాణనష్టానికి, కనీస మానవ అవసరాలకు మాత్రమే పరిమితం కాలేదని, సామాజిక, ఆర్థిక సంక్షోభానికి కూడా దారి తీస్తోందని ఆమె తెలిపారు. వ్యాపారాలు, ఉద్యోగాలు కోల్పోయిన వారు కోలుకోవడానికి చాలా కాలం పడుతుందని అన్నారు. గాజాకు మానవతావాద సాయాన్ని పూర్తి స్థాయిలో, ఎలాంటి అవరోధాలు లేకుండా తక్షణమే అందించాల్సిన అవసరం ఉన్నదని ఐఎల్ఓ పాలక మండలి పిలుపునిచ్చిందని ఆమె చెప్పారు.

బాధిత ఉద్యోగులు, వ్యాపారులకు వెంటనే సాయం అందించేందుకు ప్రభుత్వంతో, యాజమాన్యాలతో, ఇతర ఐరాస సంస్థలతో కలిసి అవిశ్రాంతంగా కృషి చేస్తున్నామని రూబా జరాదత్ తెలిపారు. బాధితులను ఆదుకునేందుకు ఐఎల్ఓ మూడు దశలుగా కార్యక్రమాలు చేపడుతోంది. మొదటి దశలో భాగంగా తక్షణ సాయంతో సహాయక చర్యలు ప్రారంభించింది. అత్యవసర సహాయం అందజేయడానికి వీలుగా 1.1 మిలియన్ డాలర్లను సేకరించింది. జరిగిన నష్టంపై సమాచారాన్ని సేకరించి, ఉద్యోగాలు కోల్పోయిన వారికి ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తోంది.

బీజేపీని గెలిపిస్తే బీసీనే సీఎం

(మొదటిపేజీ తరువాయి)

నియామకాలు అనే నినాదంతో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ సర్కార్ ఆ మూడింటినీ విస్మరించిందని విమర్శించారు. బీఆర్ఎస్‌కు సీ టీమ్ కాంగ్రెస్ అనీ, ఆ రెండు పార్టీల డీఎన్ఏ ఒక్కటేనని అన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో బీఆర్ఎస్‌కు చెందిన వారున్నారనీ, తప్పులు చేయడమే కాకుండా దర్యాప్తు సంస్థలపై కూడా విమర్శలు గుప్పిస్తున్నారని అన్నారు. అవినీతిని బీజేపీ సహించదనీ, దోషులెవరైనా వదిలిపెట్టే ప్రసక్తేలేదని హెచ్చరించారు. పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగ భృతి, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, రుణమాఫీ, ఇలా అన్ని హామీలనూ విస్మరించిందని విమర్శించారు. టీఎస్‌పీఎస్సీ అన్ని నియామకాల పరీక్షల్లో అవకతవకలు కామన్ అయిపోయాయన్నారు. యువత భవిష్యత్తుతో బీఆర్ఎస్ ఆడుకుంటున్నదని విమర్శించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ బడుగు, బలహీన సామాజిక తరగతుల అభ్యున్నతికి బీజేపీ పాటుపడిందనీ, అందులో భాగంగానే జీఎంసీ బాలయోగి, పీఏ సంగ్మాలను లోక్‌సభ స్పీకర్లుగా, అబ్దుల్ కలాం అజాద్, రామ్‌నాథ్ కోవింద్, ద్రౌపది ముర్ములను రాష్ట్రపతులుగా చేసిందని గుర్తుచేశారు. ఓబీసీ సామాజిక తరగతికి చెందిన వారిలో కేంద్ర మంత్రులుగా 27 మంది, బీజేపీ ఎంపీలుగా 85 మంది, 365 ఎమ్మెల్యేలు, 65 మంది ఎంఎల్‌సీలు ఉన్నారని తెలిపారు. వెనకబడిన సామాజిక తరగతులకు చెందిన వారికి చేయూతనిచ్చేందుకు విశ్వ కర్మ యోజన పథకాన్ని ప్రవేశపెట్టామన్నారు. తెలంగాణలో బీసీలకు న్యాయం జరగాలంటే బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కార్‌ను గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో మార్పు తుఫానులా కనిపిస్తోందన్నారు.

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ..జల్, జంగల్, జమీన్ అంటూ కుమురం భీం పోరాడారనీ, భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం సాయుధ పోరాటం నడిచిందనీ, నీళ్లు, నిధులు, నియామకాల కోసం ప్రత్యేక తెలంగాణ ఉద్యమం జరిగిందని చెప్పారు. తెలంగాణ గడ్డలోనే పోరాటతత్వం ఉందన్నారు. సకల జనులు సమరం చేస్తే తెలంగాణ రాష్ట్రమొచ్చిందన్నారు. ఏ నినాదంతో రాష్ట్రాన్ని సాధించుకున్నామో అది నెరవేరలేదన్నారు. తెలంగాణ, ఏపీలో ఐదేండ్లు ఎన్నికల వాతావరణమే ఉంటున్నదనీ, ఈ ధోరణి వల్ల అవినీతి పెరిగి అభివృద్ధి ఆగిపోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల వరకే రాజకీయాలుండాలనీ, ఆ తర్వాత అభివృద్ధి కోసం కృషి చేయాలని అన్నారు. ఆ దిశగా మోడీ పనిచేస్తున్నారని కొనియాడారు. దేశాభివృద్ధికి అంతర్గత భద్రత చాలా ముఖ్యమనీ, దాన్ని కాపాడటంలో మోడీ లాంటి బలమైన నాయకుడు మనకున్నాడని చెప్పారు. బీసీ ముఖ్యమంత్రిని ప్రకటించిన బీజేపీకి జనసేన నుంచి పూర్తి సహకారం ఉంటుందన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ..బీఆర్ఎస్, కాంగ్రెస్, మజ్లిస్ ఒకే తాను ముక్కలని విమర్శించారు. 2018లో గెలిచిన 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌కు అమ్ముడుపోయారన్నారు. కాంగ్రెస్ అమ్ముడుపోయే పార్టీ.. బీఆర్ఎస్ కొనుగోలు చేసే పార్టీ అని విమర్శించారు. తెలంగాణలో బీజేపీతోనే మార్పు సాధ్యమని చెప్పారు. ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్, ఎంపీ అర్వింద్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్, తదితరులు మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు.

కాంగ్రెస్‌తో ఇక చర్చల్లేవ్

(మొదటిపేజీ తరువాయి)

మిగతా స్థానాల్లో పోటీపై నిర్ణయాలు తీసుకుంటామన్నారు. సీపీఐ(ఎం) అభ్యర్థులతో పాటు తమ పార్టీ బలపరిచే అభ్యర్థులను గెలిపించాల్సిందిగా పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, పాలడుగు భాస్కర్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గాంధీభవన్ వద్ద టికెట్ల లొల్లి

(మొదటిపేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. అందుకు నిరసనగా ఆయన తన పదవికి రాజీనామా చేస్తారనే వార్తలొచ్చాయి. దీంతో అధిష్టానం పెద్దలు ఆయనకు ఫోన్ చేసినట్టు తెలిసింది. గాంధీభవన్ వద్ద ఆందోళనలు నిలిపేయాలని కోరినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో పటాన్‌చెరు అభ్యర్థి నీలం మధును కొనసాగిస్తారా? లేదా? అనేది తెలియాల్సి వుంది.

సింగరేణిని ముంచిందే కాంగ్రెస్

(మొదటిపేజీ తరువాయి)

వ్యక్తులు వారి చరిత్ర, నడవడికలను పరిశీలించి ఓటు వేయాలని, ఏ పార్టీకి వేస్తే లాభం జరుగుతుందో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. చెన్నూరు, మంథని, పెద్దపల్లి నియోజకవర్గాల్లో మంగళవారం నిర్వహించిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం పాల్గొని మాట్లాడారు.

ఉద్యమకారుడు, నిఖార్సైన వ్యక్తిత్వం కలిగిన చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను గెలిపించాలని మందమర్రి సభలో కేసీఆర్ విజ్ఞప్తి చేశారు. సింగరేణి చైతన్యం కలిగిన ప్రాంతమన్నారు. బీఆర్ఎస్‌కు తెలంగాణ ప్రజలే బాస్‌లని.. ఢిల్లీలో ఉండరని వ్యాఖ్యానించారు. ప్రధాని మోడీకి ప్రయివేటీకరణ పిచ్చిపట్టిందని విమర్శించారు. సింగరేణిని ప్రయివేటీకరించాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదన్నారు. కాంగ్రెస్ పార్టీకి రైతులపై ఏమాత్రం ప్రేమలేదని, ధరణి పోర్టల్‌ను తీసేస్తామని చెబుతున్నారని, అది పోతే.. రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలు వస్తాయా అని ప్రశ్నించారు. అంబేద్కర్‌ను పార్లమెంటుకు సైతం వెళ్లకుండా కాంగ్రెస్ ఓడిస్తే, బీఆర్ఎస్ మాత్రం 125 అడుగుల ఎత్తైన విగ్రహం పెట్టి గౌరవించిందని గుర్తుచేశారు. సచివాలయానికి ఆయన పేరు పెట్టామన్నారు. జిల్లాలో కొందరు కాంగ్రెస్ నాయకులు సూట్‌కేసులతో ప్రజలను ఏమార్చేందుకు వస్తున్నారని, అలాంటి నాయకులకు ఓటేస్తారా.. లేక నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు శ్రమించే బాల్క సుమన్‌కు గెలిపిస్తారా అనేది ఆలోచించాలని సూచించారు. అంతకుముందు కాంగ్రెస్‌కు చెందిన మాజీ మంత్రి బోడ జనార్దన్, డా.రాజారమేష్.. సీఎం సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. సభలో మాజీ స్పీకర్ మధుసూదనచారి, ఎంపీ వెంకటేష్ నేత, ఎమ్మెల్సీలు రఘోత్తమ్‌రెడ్డి, దండె విఠల్, ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, మాజీ ఎమ్మెల్యే అరవిందరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ వెంకట్రావ్, టీబీజీకేఎస్ నాయకులు కెంగర్ల మల్లయ్య, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజల గోసకు కాంగ్రెస్సే కారణం

పెద్దపల్లి, మంథని నియోజకవర్గాల సభల్లో సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల 50 ఏండ్ల గోసకు కారణం కాంగ్రెస్ పార్టీయేనని, సమైక్య పాలకులు తెలంగాణను ఊడగొట్టి ఆంధ్రప్రదేశ్‌లో కలిపి మనల్ని ఇబ్బంది పెట్టారన్నారు. కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే మళ్లీ దళారీల రాజ్యం వస్తుందన్నారు. వందలాదిమంది పిల్లలు తెలంగాణ కోసం బలిదానం చేసుకుంటే తప్ప అనాటి కాంగ్రెస్ అధిష్టానం తెలంగాణ ఇచ్చిందుకు ముందుకు రాలేదని తెలిపారు. బీసీలకు అవకాశం రావడం లేదని అంటున్నారని, అవకాశం వచ్చినకాడ చైతన్యం ఏమైందని ప్రశ్నించారు. మీ కోసం బీసీ బిడ్డ పుట్ట మధుకు అవకాశం వచ్చింది.. ఇప్పటికైనా మీ చైతన్యాన్ని ఈ ఎన్నికల్లో చూపించి మధును గెలిపించాలని కోరారు. పదేండ్ల తెలంగాణ ప్రశాంతంగా ఉన్నదని, రాష్ట్రంలో కర్ఫ్యూ లేదు, లొల్లి లేదని పెద్దపల్లి సభలో అన్నారు.

మహారాష్ట్ర పంచాయతీల్లో సీపీఐ(ఎం) విజయాలు



(మొదటిపేజీ తరువాయి)

నుంచి నిర్మల్ ఫర్లే, కుర్జే నుంచి విజయ్ భోయే, అప్లాట్ నుంచి ప్రవీణ్ బమానియా సీపీఐ(ఎం) సర్పంచ్‌లు గెలుపొందారు. దహను తహసీల్‌లోని సోగ్వే నుంచి లహాని దౌదా, మోద్గావ్ నుంచి రంజనా చౌదరి, కిన్వాలి నుంచి శేలు దుమాడ సీపీఐ(ఎం) సర్పంచ్‌లుగా గెలుపొందారు. తలసరి తహసీల్ గ్రామాల్లో ఉధ్వ (14/17), అప్లాట్ (13/17), కుర్జే (11/13), వెవ్జీ (9/17), కవాడ (8/13), కరాజ్‌గావ్ (7/11), ఫిమానియా (3/11) గ్రామ పంచాయతీ సభ్యులు సీపీఎం తరపున గెలిచారు. దహను తహసీల్ గ్రామాల్లో సోగ్వే (8/9), కిన్వాలి (8/11), అంబేసరి (7/13), మోద్గావ్ (6/13), జంబుగావ్ (3/13), గంగంగావ్ (3/9) గ్రామ పంచాయతీ సభ్యులు సీపీఐ(ఎం) తరపున గెలిచారు.

వాయిదాలపై పరిశీలిస్తా

(మొదటిపేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. విచారణ తేదీని నిర్ణయించడంలో జాప్యం జరుగుతోందని ఆయన ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ దృష్టికి తెచ్చారు. 'ఈ కేసు ఆగస్టు 28న విచారణకు రావాల్సి ఉంది. అయితే వాయిదా పడింది. వాయిదా...వాయిదా...వాయిదా' అని అన్నారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి స్పందిస్తూ ఈ విషయాన్ని పరిశీలించాల్సిందిగా రిజిస్ట్రీకి సూచిస్తానని తెలిపారు. అదానీ గ్రూప్ ఆర్థిక తప్పిదాలకు పాల్పడిందని, ఖాతాల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ రిసెర్చ్ సంస్థ జనవరి 24న ఓ నివేదికను ప్రచురించింది. అయితే ఈ ఆరోపణల్ని అదానీ గ్రూపు తోసిపుచ్చింది. ఈ వ్యవహారంలో సెబీ వైఫల్యాన్ని పరిశీలించాల్సిందిగా సుప్రీంకోర్టు నిపుణుల కమిటీని నియమించింది. మరోవైపు సెబీ కూడా సొంతగా దర్యాప్తు చేపట్టింది. నిపుణుల కమిటీకి సెబీ తన నివేదికను ఆగస్ట్ 14న సమర్పించాల్సి ఉన్నప్పటికీ విచారణ పూర్తి చేసేందుకు మరికొంత సమయం తీసుకుంది. చివరికి ఆగస్ట్ 25న సెబీ తన స్టేటస్ నివేదికను అందజేసింది. కానీ సెబీ నివేదికపై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. మొత్తం 24 దర్యాప్తులు చేపట్టానని, వాటిలో 22 పూర్తయ్యాయని సెబీ తెలిపింది. ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు నియమించిన నిపుణుల కమిటీ తన నివేదికను న్యాయస్థానానికి సమర్పించింది. సెబీ వైఫల్యాన్ని ఎత్తిచూపడం కష్టమని నిపుణుల కమిటీ తెలిపింది.

ముగిసిన పోలింగ్..

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగినట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి లియాంజలా వెల్లడించారు. మొత్తం 40 స్థానాలకు ఒకే విడతలో పోలింగ్ నిర్వహించగా.. 174 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. మరోవైపు, ఛత్తీస్‌గఢ్‌లో తొలి విడతలో 20 స్థానాలకు ఎన్నికలు జరగ్గా.. సాయంత్రం 5గంల వరకు 70.87శాతం పోలింగ్ నమోదైంది. భారీ స్థాయిలో భద్రతా బలగాలను మోహరించినప్పటికీ పలు చోట్ల ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. సుక్మా జిల్లాలో నక్సలైట్లు జరిపిన కాల్పుల్లో నలుగురు భద్రతా సిబ్బంది గాయపడినట్టు పోలీసులు వెల్లడించారు. ఇక పోలింగ్ విషయానికి వస్తే.. ఖైరాగఢ్-చుయుఖదాన్- గండయి జిల్లాలో అత్యధికంగా 76.31శాతం పోలింగ్ నమోదైంది. అలాగే, అంబాగఢ్ చౌకి జిల్లాలో76శాతంబీ బస్తర్ (జగ్దల్‌పూర్)లో 72.41శాతం, కబీర్‌ధామ్ జిల్లాలో 72శాతం, కొండగాన్‌లో 75.35శాతం చొప్పున పోలింగ్ నమోదైంది. ఛత్తీస్‌గఢ్లో తొలి విడతలో పోలింగ్ జరిగే 20 స్థానాల్లో 223 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. రాష్ట్రంలో మొత్తం 90 శాసనసభ స్థానాలు ఉండగా.. మిగతా 70 స్థానాలకు ఈ నెల 17 పోలింగ్ జరగనుంది.

మారో తీన్‌మార్



ప్రపంచకప్‌లో నేడు
ఇంగ్లాండ్ x నెదర్లాండ్స్
వేదిక : బెంగళూర్
సమయం : మ. 2.00
స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం..

డచ్‌తో ఇంగ్లాండ్ ఢీ

బెంగళూర్ : డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లాండ్ నేడు నెదర్లాండ్స్‌తో తలపడనుంది. ఏడు మ్యాచుల్లో ఆరింట ఓటమి చవిచూసిన ఇంగ్లాండ్ సెమీస్ రేసు నుంచి నిష్క్రమించింది. కానీ 2025 ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ బెర్త్ కోసం గ్రూప్ దశలో చివరి రెండు మ్యాచుల్లోనైనా విజయం సాధించాలనే పట్టుదల ఆ జట్టులో కనిపిస్తుంది. మరోవైపు నెదర్లాండ్స్ రెండు విజయాలతో ఇంగ్లాండ్ కంటే మెరుగైన స్థితిలో నిలిచింది.. చిన్నస్వామి స్టేడియంలో ఇంగ్లాండ్, నెదర్లాండ్స్ ఢీ నేడు.

మాక్స్‌వెల్ ఓ అద్భుతం

- అఫ్గాన్‌పై ఒంటిచేత్తో విజయం
- సెమీస్‌లో ఆసీస్ అడుగు
- ఐసీసీ 2023 ప్రపంచకప్



ముంబయి : గ్లెన్ మాక్స్‌వెల్ (201 నాటౌట్, 128 బంతుల్లో 21 ఫోర్లు, 10 సిక్స్‌లు) అద్భుతం చేశాడు. వన్డే క్రికెట్ చరిత్రలోనే ఆస్ట్రేలియాకు అద్వితీయ విజయాన్ని కట్టబెట్టాడు. అఫ్గనిస్థాన్‌పై 292 పరుగుల ఛేదనలో ఆస్ట్రేలియా 91/7తో ఓటమి కోరల్లో కూరుకుంది. ఈ దశలో కెప్టెన్ పాట్ కమిన్స్ (12 నాటౌట్, 68 బంతుల్లో 1 ఫోర్)తో కలిసి అజేయంగా 202 పరుగులు జోడించిన మాక్స్‌వెల్.. ఆస్ట్రేలియాకు 3 వికెట్ల తేడాతో అద్భుత విజయాన్ని అందించాడు. అగ్రజట్టు ఆస్ట్రేలియాపై చారిత్రక విజయానికి అడుగు దూరంలోనే నిలిచిన అఫ్గనిస్థాన్.. మాక్స్‌వెల్ అసమాన ఊచకోతకు బలైంది. 128 బంతుల్లోనే డబుల్ సెంచరీ సాధించిన గ్లెన్ మాక్స్‌వెల్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్గనిస్థాన్ 50 ఓవర్లలో 5 వికెట్లకు 291 పరుగులు చేసింది. ఓపెనర్ ఇబ్రహీం జద్రాన్ (129, 143 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీతో రాణించాడు. ఈ విజయంతో ఆస్ట్రేలియా సెమీఫైనల్లోకి ప్రవేశించింది.

బొరా.. మాక్స్‌వెల్

ఆస్ట్రేలియా లక్ష్యం 292 పరుగులు. కానీ వాంఖడె పిచ్‌పై అఫ్గాన్ బౌలర్లు అదరగొట్టారు. పేసర్లు, స్పిన్నర్లు మెరవటంతో ఆసీస్ బ్యాటింగ్ లైనప్ పేకమేడలా కూలింది. ఓపెనర్ డెవిడ్ వార్నర్ (18), మిచెల్ మార్ష్ (24) మినహా అందరూ విఫలమయ్యారు. ట్రావిశ్ హెడ్ (0), మార్నస్ లబుషేన్ (14), జోశ్ ఇంగ్లిశ్ (0), మార్కస్ స్టోయినిస్ (6), మిచెల్ స్టార్క్ (3) చేతులెత్తేశారు. 18.3 ఓవర్లలో 91 పరుగులకే 7 వికెట్లు చేజార్చుకున్న ఆస్ట్రేలియా.. ఓటమి కోరల్లో కూరుకుంది. ఈ దశలో జతకట్టిన మాక్స్‌వెల్ (201 నాటౌట్), పాట్ కమిన్స్ (12 నాటౌట్) అద్భుతం చేశారు. ఆరంభంలో మాక్స్‌వెల్ క్యాచ్‌ను నేలపాలు చేసిన అఫ్గాన్.. అందుకు భారీ మూల్యం చెల్లించుకుంది. ఏడు ఫోర్లతో 51 బంతుల్లో అర్థ సెంచరీ చేసిన మాక్స్‌వెల్.. పది ఫోర్లు, మూడు సిక్సర్లతో 76 బంతుల్లోనే వంద కొట్టాడు. కండరాల నొప్పితో పరుగు తీసేందుకు ఇబ్బంది పడుతూనే.. 21 ఫోర్లు, 10 సిక్సర్లతో 128 బంతుల్లో తొలి వన్డే డబుల్ సెంచరీ నమోదు చేశాడు. ఆస్ట్రేలియాకు మరుపురాని విజయాన్ని అందించాడు.

సంక్షిప్త స్కోరు వివరాలు

అఫ్గనిస్థాన్ ఇన్నింగ్స్ : 291/5 (ఇబ్రహీం జద్రాన్ 129, రెహమత్ షా 30, హష్మతుల్లా 26, హాజిల్‌వుడ్ 2/39)

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ : 293/7 (గ్లెన్ మాక్స్‌వెల్ 201, మిచెల్ మార్ష్ 24, రషీద్ ఖాన్ 2/44, అజ్మతుల్లా 2/52)

భయానకం అంతే!

- అద్భుతంగా భారత బౌలింగ్
- పేసర్లు, స్పిన్నర్ల కలల ప్రదర్శన
- అభిమానులకు కన్నుల పండుగ

స్వింగ్, సీమ్, టర్న్.. గాల్లో ఎగిరే వికెట్లు. ప్రపంచకప్‌లో భారత బౌలర్ల ప్రదర్శన కన్నుల పండుగ. పేసర్లు బుమ్రా, షమి, సిరాజ్.. స్పిన్నర్లు కుల్దీప్, జడేజాలు కలిసికట్టుగా వికెట్ల వేటలో చెలరేగుతున్నారు. ప్రపంచకప్ గ్రూప్ దశలో టీమ్ ఇండియా బౌలర్లకు ఇప్పటి వరకు ఎదురులేదు. ప్రత్యర్థి జట్ల బౌలింగ్ బృందాలకు అందనంత ఎత్తులో నిలిచిన టీమ్ ఇండియా బౌలర్లు.. వన్డే పండుగకు సరికొత్త కళ తీసుకొచ్చారు. బ్యాటర్లు రాజ్యమేలే ఫార్మాట్‌లో.. బౌలర్ల నైపుణ్యం చాటుతూ అబ్బురపరుస్తున్నారు.

నవతెలంగాణ క్రీడావిభాగం



క్రికెట్‌ను ఆస్వాదించటం అంటే.. బ్యాటర్ల విన్యాసాలకు చిందులు వేయటమే!. బ్యాటర్లు సిక్సర్లు సంధించినప్పుడు బ్యాట్ నుంచి వచ్చే ఆ స్ట్రోక్ సౌండ్ సైతం అభిమానులకు వినసొంపుగా ఉంటుంది. స్టాండ్స్‌లో బంతి పడితే చూసేందుకు రెండు కండ్లు చాలవు. ప్రత్యేకించి స్టాండ్స్ నుంచి మ్యాచ్‌ను చూసినప్పుడు బ్యాటర్లు మెరిసి, భారీ స్కోర్లు నమోదైతే అభిమానులకు అది విందు భోజనమే. బ్యాటింగ్‌లో శిఖర స్థాయి.. శతకం. బ్యాటర్ 90 పరుగులకు చేరువ కాగానే హంగామా మొదలవుతుంది. అతడు 100 పరుగులు పూర్తి చేస్తే అదో సంతృప్తి, ఆనందం, అనుభూతి. మ్యాచుల్లో, టోర్నీల్లో బౌలర్లే విజయాలు అందిస్తారు, కానీ క్రికెట్‌ను నడిపించే ఇంధనం మాత్రం పరుగులే. అటువంటిది ఐసీసీ 2023 ప్రపంచకప్ భారత్‌లో జరుగుతుండగా, బ్యాటర్లను ఆరాధించే దేశంలో ఒక్కసారిగా బౌలర్లు సెంటర్ స్టేజ్‌కు రావటం అద్భుతమే. షమి, సిరాజ్, బుమ్రా, కుల్దీప్, జడేజాలు ఆ అద్భుతమే ఆవిష్కరించారు.

సంక్షిప్త కళ

క్రికెట్‌కు ఎక్కువగా ఇష్టపడేది బ్యాటింగ్ కోసమే!. మన బౌలర్లు వికెట్లు కూల్చినప్పుడు సంబురపడతామే కానీ.. ఆ కళను పెద్దగా అర్థం చేసుకునే ప్రయత్నం చేయం. బౌలర్ కళ రెప్పపాటులో ముగుస్తుంది. వికెట్ పడినప్పుడు మినహా పెద్దగా బౌలర్‌కు ఘనత ఆపాదించరు. బ్యాటర్ మరీ ఆడలేని బంతులను కొన్నిసార్లు హైలైట్ చేస్తారు. కానీ ఓ బ్యాటర్‌ను బుట్టలో వేసుకునేందుకు బౌలర్ వేసే ప్రణాళికలు, బ్యాటర్‌ను తన వ్యూహంలోకి తీసుకొచ్చి ఆడించే విధానం అభిమానులు పెద్దగా పట్టించుకోరు. మనం క్రికెట్‌ను అర్థం చేసుకునే పరిణితిలోనూ ఇది పెద్దగా కనిపించదు. కొందరు మాత్రం ఈ కళను అమితంగా ఇష్టపడుతూ ఆరాధిస్తారు. అటువంటి వారికి మధురానుభూతి మిగుల్చుతున్నారు టీమ్ ఇండియా బౌలర్లు. ప్రపంచ శ్రేణి బ్యాటర్లను వలలో వేసుకుని, పక్కా ప్రణాళికతో పడగొడుతున్న తీరు అమోఘం. నిజానికి ఈ ప్రపంచకప్‌లో భారత బౌలర్ల ప్రదర్శన ప్రత్యక్షంగా వీక్షించటం సైతం ఓ అరుదైన గౌరవమే!. చెపాక్‌లో స్టీవ్ స్మిత్‌కు జడేజా సంధించిన మ్యాజిక్ బాల్‌తో మొదలైన ఈ మాయ.. ఈడెన్‌గార్డెన్స్‌లో సఫారీతో మ్యాచ్‌లోనూ కొనసాగింది. అదే తరహా బంతిని కోల్‌కతలో తెంబ బవుమాకు విసిరిన జడేజా సఫారీ సారథినీ షాక్‌లోకి నెట్టాడు. మహ్మద్ రిజ్వాన్‌కు ఆఫ్ కట్టర్, షాదాబ్ ఖాన్‌కు రివర్స్ స్వింగర్ వేసిన బుమ్రా పాక్ బ్యాటర్లను విస్మయానికి గురిచేశాడు. శ్రీలంక ఓపెనర్ నిశాంకను బుమ్రా బురిడీ కొట్టించిన తీరు సైతం సూపర్. దిముత్ కరుణరత్నెను సిరాజ్ సైతం అదే రీతిలో బోల్తా కొట్టించాడు. ఊహించిన బంతే పడినట్టు తొలుత బ్యాటర్ భావించినా.. రెప్పపాటులో అంతా రివర్స్‌లో జరిగిపోతుంది. నమ్మశక్యంగా లేదంటూ తల అడ్డంగా ఊపుతూ పెవిలియన్‌కు చేరటం తప్ప ఇక చేయడానికి ఏమీ ఉండదు. ఇక ఎంజెలో మాథ్యూస్‌కు షమి సంధించిన క్లాసిక్ స్వింగ్ బాల్స్ అసమానం. జోశ్ బట్లర్‌కు కుల్దీప్ యాదవ్.. బెన్ స్టోక్స్ కోసం షమి వేసిన సీక్వెన్స్ ఆఫ్ బాల్స్.. వర్ణించడానికి పదాలు సరిపోవేమో!

గాయమే.. వరం!

ప్రపంచకప్ గ్రూప్ దశ తొలి నాలుగు మ్యాచుల్లో టీమ్ ఇండియా బౌలింగ్ విలక్షణంగా కనిపించింది. మ్యాచ్‌లో ఏ దశలోనైనా వికెట్లు పడగొట్టగల బౌలింగ్ విభాగంగా పేరు తెచ్చుకుంది. ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య గాయంతో తుది జట్టు సమీకరణం మారింది. పాండ్య లోటు భర్తీ చేసేందుకు ఓ స్పెషలిస్ట్ బ్యాటర్, ఓ స్పెషలిస్ట్ బౌలర్‌ను ఎంచుకున్నారు. ఫలితంగా బంతి అందుకున్న మహ్మద్ షమి.. నాలుగు మ్యాచుల్లో ఏకంగా 16 వికెట్లు పడగొట్టాడు. ఇందులో రెండు ఐదు వికెట్ల ప్రదర్శన, ఓ నాలుగు వికెట్ల ప్రదర్శన ఉన్నాయి. షమి రాకతో భారత బౌలింగ్ భయానకంగా మారింది. ప్రత్యర్థి బ్యాటర్లు వికెట్లు కాపాడుకునేందుకు పాట్లు పడుతుండగా.. ఆ ప్రయత్నమూ ఎంతోసేపు విజయవంతం కావటం లేదు. స్వింగ్, సీమ్, టర్న్‌తో ముప్పేట దాడి చేస్తున్నారు. ఏ జట్టుకైనా పరుగుల వేటలో ప్రత్యేకించి ఓ బౌలర్‌ను ఎంచుకుని ఎదురుదాడి చేస్తాయి. ప్రమాదకర బౌలర్లను గౌరవించి, టార్గెట్ చేసిన బౌలర్ కోసం వేచిచూస్తాయి. కానీ ప్రస్తుత భారత బౌలింగ్ లైనప్‌లో అందరూ ప్రమాదకరమే. బుమ్రా, సిరాజ్, షమి, కుల్దీప్, జడేజాలు దడ పుట్టిస్తారు. పరుగుల వేటకు అవకాశం చిక్కక ప్రత్యర్థులు చిత్తవుతున్నారు.

గణాంకాలు అదరహో..

గణాంకాల పరంగా మనోళ్లు ఎవరికీ అందనంత ఎత్తులో నిలిచారు. భీకర పేస్ త్రయం బుమ్రా, సిరాజ్, షమి 48 వికెట్లు పడగొట్టారు. ప్రతి 23 బంతులకు పేసర్లు ఓ వికెట్ పడగొట్టారు. సగటు 18.3. ఎకానమీ 4.8 మాత్రమే. స్పిన్ ద్వయం, మాయగాళ్లు కుల్దీప్ యాదవ్, రవీంద్ర జడేజా 27 వికెట్లు కూల్చారు. ప్రతి 31 బంతులకు స్పిన్నర్లు ఓ వికెట్ పడగొట్టారు. సగటు 20.3 కాగా, ఎకానమీ 3.9. పవర్‌ప్లే (1-10 ఓవర్లు), 11-40 ఓవర్లు, డెత్ ఓవర్లు (41-50) ఇలా ప్రతి దశలోనూ మన బౌలర్ల గణాంకాలు సూపర్. వికెట్ల వేట, సగటు, స్ట్రయిక్‌రేట్, ఎకానమీ ఏ కొలమానం తీసుకున్నా అగ్రస్థానంలోనే కొనసాగుతున్నారు. ఈ ప్రపంచకప్‌లో భారత బౌలర్ల సగటు 19.03 (ప్రతి 19.03 పరుగులకు ఓ వికెట్). 26.01తో సఫారీ బౌలర్లది టోర్నీలో రెండో అత్యుత్తమ సగటు. రెండో స్థానంలో నిలిచిన దక్షిణాఫ్రికాతో మన బౌలర్ల వ్యత్యాసం ఏకంగా -6.99. మరే ప్రపంచకప్‌లోనూ ఇంతటి వ్యత్యాసం లేదు. 2003లో అత్యధికంగా ఆస్ట్రేలియా (18.33), భారత్ (23.56) -5.23 సాధించింది. ఇక ఎకానమీ పరంగా భారత బౌలర్లు 4.40తో ఉత్తమంగా నిలిచారు. అఫ్గనిస్థాన్ 5.27తో రెండో స్థానంలో ఉన్నారు. రెండు జట్ల మధ్య వ్యత్యాసం -0.86. 2011 ప్రపంచకప్‌లో పాకిస్థాన్ (4.13), శ్రీలంక (4.44) మధ్య వ్యత్యాసం -0.32 తర్వాతి ఉత్తమం. ప్రపంచకప్ గ్రూప్ దశ మ్యాచుల్లో బ్యాటర్లు చెమటోడ్చే పరిస్థితి రాలేదు. ఆ స్థాయిలో బౌలర్లు దుమ్మురేపారు. తొలుత బౌలింగ్ చేసినప్పుడు ఏ మ్యాచ్‌లోనూ 300 పైచిలుకు స్కోరు ఛేదించాల్సిన అవసరం రాలేదు. ఇక స్కోరు కాపాడుకునేందుకు 350 పైచిలుకు స్కోర్ల కోసం బ్యాటర్లు ఒత్తిడికి గురి కావాల్సిన అవసరం సైతం ఏర్పడలేదు. బంతి తొలి ఇన్నింగ్స్‌లో అందుకున్నా, మంచు ప్రభావంలో రెండో ఇన్నింగ్స్‌లో పట్టుకున్నా వికెట్ల వేటలో, ఫలితంలో ఎటువంటి మార్పు లేదు. అందుకే ఈ ప్రపంచకప్‌ను భారత బౌలర్లు మరింత ప్రత్యేకం చేశారు.




అప్పుడు గంగూలీ..

- తప్పిన టైమ్డ్ ఔట్ ప్రమాదం
- సఫారీ కెప్టెన్ స్మిత్ క్రీడాస్ఫూర్తి

న్యూఢిల్లీ : శ్రీలంక, బంగ్లాదేశ్ ప్రపంచకప్ మ్యాచ్‌లో ఎంజెలో మాథ్యూస్ టైమ్డ్ ఔట్‌గా నిష్క్రమించటం చర్చనీయాంశంగా మారింది. క్రీడా స్ఫూర్తిని షకిబ్ అల్ హసన్ మంటగలిపాడని విమర్శలు వస్తున్నాయి. 146 ఏండ్ల క్రికెట్ చరిత్రలో టైమ్డ్ ఔట్‌గా పెవిలియన్‌కు చేరిన తొలి ఆటగాడు మాథ్యూస్. ఐసీసీ నిబంధనల ప్రకారం కొత్త బ్యాటర్ 120 సెకండ్ల లోపు క్రీజులోకి వచ్చి బంతిని ఎదుర్కొవాలి. లేదంటే, టైమ్డ్ ఔట్ నిబంధన ప్రకారం నిష్క్రమించాల్సి ఉంటుంది. అయితే, క్రికెట్‌లో ఫీల్డింగ్ జట్టు అప్పీల్ చేస్తేనే అంపైర్ నిర్ణయం తీసుకుంటారనే సంగతి తెలిసిందే. మాథ్యూస్ అంశంలో బంగ్లాదేశ్ కెప్టెన్ షకిబ్ అప్పీల్‌కు వెళ్లాడు. మాథ్యూస్ అడిగినా అప్పీల్ వెనక్కి తీసుకోలేదు. మాథ్యూస్ తరహాలో నిర్దేశించిన సమయంలో తొలి బంతిని ఎదుర్కోలేని కొన్ని సంఘటనలు ఉన్నాయి. అందులో భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ ఉదంతం సైతం ఉంది. నిజానికి గంగూలీ టైమ్డ్ ఔట్ కావాల్సి ఉన్నప్పటికీ.. దక్షిణాఫ్రికా కెప్టెన్ స్టీవ్ స్మిత్ క్రీడా స్ఫూర్తితో బయటపడ్డాడు.

భారత్, దక్షిణాఫ్రికా 2007 కేప్‌టౌన్ టెస్టు. భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 1.2 ఓవర్లలోనే ఓపెనర్లు ఇద్దరినీ కోల్పోయింది. నం.3 బ్యాటర్ ద్రవిడ్ క్రీజులో ఉండగా నం.4 బ్యాటర్ సచిన్ బ్యాటింగ్‌కు రావాలి. కానీ అంతకుముందు సఫారీ ఇన్నింగ్స్‌లో సచిన్ మైదానం వీడాడు. దీంతో మరో ఐదు నిమిషాల తర్వాతనే అతడు క్రీజులోకి రాగలడు. నం.5 బ్యాటర్ వీవీఎస్ లక్ష్మణ్ బాత్‌రూమ్‌లో స్నానం చేస్తున్నాడు. ఈ సమయంలో సౌరవ్ గంగూలీ ప్యాడ్స్ కట్టుకుని బ్యాటింగ్‌కు వచ్చాడు. ఈ ప్రక్రియకు 6 నిమిషాలు పట్టింది. అంపైర్ డార్లీ హార్పర్ విషయాన్ని సఫారీ కెప్టెన్ గ్రేమ్ స్మిత్‌కు వివరించాడు. పరిస్థితులను అర్థం చేసుకున్న స్మిత్.. గంగూలీపై టైమ్డ్ ఔట్ అప్పీల్‌కు వెళ్లలేదు. ఆ ఇన్నింగ్స్‌లో గంగూలీ 89 బంతుల్లో 46 పరుగులు చేశాడు. మాథ్యూస్ టైమ్డ్ ఔట్‌తో గంగూలీ అంశంలో గ్రేమ్ స్మిత్ క్రీడా స్ఫూర్తి తాజాగా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

నవచిత్రం




మహేష్‌బాబు

నాతో నాకే యుద్ధం

మహేష్ బాబు, త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్ 13 ఏళ్ళ తర్వాత 'గుంటూరు కారం'తో కలిసి వస్తున్నారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై నిర్మాత ఎస్.రాధాకృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సూపర్ స్టార్ కృష్ణ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన స్పెషల్ టీజర్ తర్వాత, ఈ సినిమా నుండి మొదటి గీతం విడుదల కోసం ఫ్యాన్స ఎదురు చూస్తున్నారు. అటు మహేష్ బాబుకి, ఇటు త్రివిక్రమ్‌కి అద్భుతమైన ఆడియోలను అందించిన తమన్ ఈ భారీ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఇప్పుడు, 'దమ్ మసాలా' వంటి స్పైసీ ట్రాక్‌తో దీపావళిని జరుపుకోవాలని మేకర్స్ నిర్ణయించారు. దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం 'దమ్ మసాలా' పాటను విడుదల చేశారు. సరస్వతీ పుత్ర రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించిన ఈ గీతాన్ని సంజిత్ హెగ్డే, జ్యోతి నూరన్ ఆలపించారు. పాటలోని సాహిత్యం కథానాయకుడి పాత్ర తీరుని తెలుపుతోంది. తమన్ అందించిన ట్యూన్, బీట్ సరికొత్తగా ఉన్నాయి. 'నా తలరాతే రంగుల రంగోలి. దిగులైనా చేస్తా దీవాలి. నా నవ్వుల కోటని నేనే ఎందుకు పడగొట్టాలి", "నేనో నిశబ్దం, అనునిత్యం నాతో నాకే యుద్ధం" వంటి పంక్తులతో గీత రచయిత పాత్రలోని లోతును ఆవిష్కరించారు. శ్రీలీల ఈ చిత్రంలో మహేష్‌తో స్క్రీన్ షేర్ చేసుకునే అవకాశం దక్కించుకుంది. మీనాక్షి చౌదరి, జగపతి బాబు, జయరామ్, ప్రకాష్ రాజ్, రమ్యకృష్ణ తదితరులు నటిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా విడుదల కానుంది.

దీపావళి రిలీజ్‌కి
బలగం విజయం నమ్మకాన్నిచ్చింది

నిర్మాత, శ్రీ స్రవంతి మూవీస్ అధినేత 'స్రవంతి' రవికిశోర్ నిర్మించిన సినిమా 'దీపావళి'. కృష్ణ చైతన్య చిత్ర సమర్పకులు. ఆర్ఏ వెంకట్ దర్శకత్వం వహించారు. పూ రాము, కాళీ వెంకట్ ప్రధాన పాత్ర ధారులు. 'స్రవంతి' రవికిశోర్ నిర్మించిన తొలి తమిళ సినిమా 'కిడ'కు తెలుగు అనువాదం ఈ 'దీపావళి'. ఈ నెల 11న తెలుగు, తమిళ భాషల్లో సినిమా విడుదల అవుతోంది. ఈ సందర్భంగా మీడియాతో 'స్రవంతి' రవికిశోర్ సంభాషించారు.. ఆ విశేషాలు..



స్రవంతి రవికిషోర్

నేను చెన్నైలో ఉన్నప్పుడు కథలు వింటున్నా. నా స్నేహితుడు ఒకరు 'ఓ కథ విన్నా. మీరూ వినండి' అని పది నిమిషాలు చెప్పాడు. నాకు నచ్చింది. వెంటనే దర్శకుడు ఆర్ఏ వెంకట్ నంబర్ తీసుకుని ఫోన్ చేశా. వేరే నిర్మాతతో చేద్దామని అనుకుంటున్నట్లు చెప్పాడు. ఒకవేళ మార్పులు ఏమైనా ఉంటే చెప్పమని అడిగా. పదిహేను రోజుల తర్వాత నాకు ఫోన్ చేశారు. వేరే నిర్మాతకు ఏవో సమస్యలు ఉన్నాయని చెప్పాడు. అప్పుడు స్క్రిప్ట్ అంతా రికార్డ్ చేసి పంపించమని అడిగా. బౌండ్ స్క్రిప్ట్ రికార్డ్ చేసి పంపించాడు. అది విని ఓకే చేశా.

సినిమా చూసిన కొందరు మిత్రులు 'ఫిల్మ్ ఫెస్టివల్స్ లేదా అవార్డులకు ఎందుకు పంపించకూడదు?' అని అడిగారు. అప్పటికి థియేటర్లలో విడుదల చేద్దామా? ఓటీటీకి ఇద్దామా? అని ఆలోచిస్తున్నా. స్నేహితుల మాటలతో ఇండియా పనోరమాకు పంపించా. ఒక రోజు సినిమా సెలెక్ట్ అయ్యిందని ఫోన్ వచ్చింది. అదొక గొప్ప అనుభూతి. తర్వాత చెన్నై ఫిల్మ్ ఫెస్టివల్‌లో కూడా ప్రదర్శించారు. సినిమా చూసిన ప్రేక్షకులకు కూడా మంచి అనుభూతి ఇస్తుంది. మనసుకు హత్తుకునే చిత్రమిది. తెలుగులో 'దిల్' రాజుతో పాటు మీడియా కూడా సినిమా చూసింది. బావుందని ప్రశంసించారంతా. చెన్నైలో సుమారు 200 మంది మీడియా మిత్రులకు షో వేశాం. స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు. అంతకు ముందు గోవాలో కూడా అటువంటి స్పందన లభించింది.

దీపావళి పండక్కి బాణాసంచా వెలుగులు ఎంత ముఖ్యమో... పిండి వంటలు, కొత్త దుస్తులు కూడా అంతే ముఖ్యం. ఈ సినిమా కూడా అంతే! ఇప్పుడు ప్రేక్షకులు పెద్ద సినిమాలతో పాటు చిన్న సినిమాలను కూడా చూస్తున్నారు. మా 'దీపావళి'ని కూడా చూసి ఆదరిస్తారని నమ్ముతున్నా. డబ్బింగ్ సినిమాలను కూడా తెలుగుతో సమానంగా ఆదరిస్తున్నారు. తమిళంలో తీసినా సరే తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకునే భావోద్వేగాలు ఉన్నాయి. 'బలగం' చూసిన తర్వాత తెలుగులో ఈ సినిమాను విడుదల చేయాలని నిర్ణయించుకున్నా.

రామ్ హీరోగా ఓ సినిమా చేయాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది. రామ్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో సినిమా చేయాలని నాకు ఉంది. ముందు తన కమిట్మెంట్స్ ఏం ఉన్నాయో త్రివిక్రమ్ చూసుకోవాలి. రామ్ హీరోగా చేస్తే ఈ స్క్రిప్ట్ బావుంటుందని అతను అనుకోవాలి.

గోవాలో సంతోషం ఫిలిం అవార్డ్స్



సురేష్ కొండేటి

ఈ సంవత్సరం గోవాలో సంతోషం ఫిలిం అవార్డ్స్ నిర్వహిస్తున్న సందర్భంగా సంతోషం అధినేత సురేష్ కొండేటి మీడియాతో మాట్లాడుతూ, 'డిసెంబర్ 2న గోవాలో సంతోషం ఫిలిం అవార్డ్స్‌ని చాలా గ్రాండ్‌గా నిర్వహించ బోతున్నాం మాకు సహకరిస్తున్న మీడియా, ఇండస్ట్రీ, అలాగే అందరు హీరోల అభిమానులకి కృతజ్ఞతలు. సంతోషం ఓటీటీ అవార్డ్స్ కూడా మొట్టమొదటిగా మొదలుపెట్టింది సంతోషం సంస్థే. ఈ సంవత్సరం కూడా ఈ నెల 18వ తారీఖున ఓటీటీ అవార్డ్స్‌ని అలాగే డిసెంబర్ 2న గోవాలో సంతోషం ఫిల్మ్ అవార్డ్స్‌ని ఘనంగా నిర్వహించబోతున్నాం. సంతోషం సంస్థ నుంచి 20 సంవత్సరాలు పాటు అవార్డులు కొనసాగించాలని అనుకున్నాను. ఇప్పటికి 20 సంవత్సరాలు దగ్గర అయింది. ఇంకో మూడు సంవత్సరాలు కచ్చితంగా అవార్డ్స్ ఫంక్షన్ నిర్వహిస్తాం. సంతోషం మ్యాగజైన్ మొదలెట్టినప్పుడు నాకు ఇంకా చిన్న వయసు నాగార్జున, చిరంజీవి, బాలకృష్ణ లాంటి అగ్ర తారలు ఇచ్చిన ప్రోత్సాహంతో అవార్డ్స్ మొదలుపెట్టాను నాగార్జున 'సంతోషం' సురేష్ కొండేటి కూడా ఫిలింఫేర్ స్థాయిలో అవార్డ్స్ నిర్వహించగలడు అని ఆయన నా పై ఉంచిన నమ్మకాన్ని నేను నిలబెట్టుకోవాలనుకున్నాను అలాగే చిరంజీవి, బాలకృష్ణ లాంటి అగ్ర హీరోలు సురేష్ కొండేటి చేయగలడు అని నా పై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఇన్నాళ్లూ సంతోషం ఫిలిం అవార్డ్స్ ఎక్కడ ఆగకుండా నిర్వహించాను, నిర్వహిస్తున్నాను. అలాగే గోవా గవర్నమెంట్ నుంచి మంచి సహకారం అందింది ముందుగా ఈ నెల 18న అనుకున్నాం కానీ గోవాలో టోర్నమెంట్ ఉండటం వల్ల డిసెంబర్ 2కి పెట్టుకోమని మాకు లెటర్ పంపారు. ఈ సందర్భంగా గోవా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను' అని అన్నారు.

నయా క్రైమ్ థ్రిల్లర్



హృతిక్ శౌర్య

హృతిక్ శౌర్య, వరలక్ష్మీ శరతకుమార్ కీలక పాత్రల్లో తెరకెక్కుతున్న చిత్రం 'అశ్వద్ధామ'. 'హతః అశ్వర' అనేది ఉపశీర్షిక. చంద్ర శేఖర్ ఆజాద్ పాటిబండ్ల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఫ్లిక్‌నైన్ స్టూడియో సంస్థ నిర్మిస్తోంది. హీరో హృతిక్ శౌర్య బర్త్‌డే సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు చెబుతూ చిత్రం బృందం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. హృతిక్ శౌర్య 'ఓటు' చిత్రంతో హీరోగా కెరీర్ ప్రారంభించారు. అందులో సాఫ్ట్ కుర్రాడిగా కనిపించిన ఆయన ఈ చిత్రంలో ప్రాపర్ కమర్షియల్ హీరోగా కనిపించనున్నారు.

ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ, 'రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే లవ్, క్రైమ్ థ్రిల్లర్ ఇది. పక్కా కమర్షియల్ అంశాలతో తెరకెక్కుతోంది. వరలక్ష్మీ శరతకుమార్ పాత్ర గత చిత్రాలకు భిన్నంగా కొత్తగా ఉంటుంది. నెగటివ్ షేడ్ ఉన్న పాత్రలో ఒక సర్‌ప్రైజ్ ఆర్టిస్ట్ కనిపిస్తారు. హీరోకి మంచి చిత్రం అవుతుంది. కమర్షియల్ హీరోగా ఎలివేట్ అవుతాడు. ఆయన చేసిన యాక్షన్ ఎపిసోడ్స్‌కి టీమ్ అంతా ఫిదా అయింది. ఇప్పటి వరకూ జరిగిన రెండు షెడ్యూళ్లలో కీలక సన్నివేశాలతోపాటు యాక్షన్ సీన్స్ చిత్రీకరించాం' అని అన్నారు.

చిత్రం శ్రీను, టెంపర్ వంశీ, మానిక్ రెడ్డి, సత్యకృష్ణ, షేకింగ్ శేషు, యోగి కత్రి, పటాస్ ప్రవీణ్ తదితరులు నటిస్తున్నారు.

జపాన్‌లో సర్‌ప్రైజ్ చేసే రోల్ చేశా



అను ఇమ్మాన్యుయేల్

హీరో కార్తి నటించిన తన 25వ చిత్రం 'జపాన్'. 'జోకర్' ఫేమ్ రాజు మురుగన్ దర్శకత్వం వహించిన ఈ పాన్ ఇండియా హీస్ట్ థ్రిల్లర్‌ని డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ఎస్ ఆర్ ప్రకాష్ బాబు, ఎస్ ఆర్ ప్రభు నిర్మించారు. అను ఇమ్మాన్యుయేల్ హీరోయిన్‌గా నటిస్తోంది. అన్నపూర్ణ స్టూడియోస్ ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తోంది. దీపావళి కానుకగా ఈనెల 10న గ్రాండ్‌గా థియేటర్స్‌లో రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా హీరోయిన్ అను ఇమ్మాన్యుయేల్ మీడియాతో ముచ్చటించింది.

- రాజు మురుగన్ చాలా వైవిధ్యమైన దర్శకుడు. తన ప్రతి సినిమా డిఫరెంట్‌గా ఉంటుంది. జపాన్ కథ, పాత్ర చాలా యూనిక్. ఇలాంటి కథని గతంలో వినలేదు. ఇలాంటి సినిమాని చూడడానికి ప్రేక్షకురాలిగా కూడా చాలా ఆసక్తిగా ఉన్నాను.
- ట్రైలర్, టీజర్ చూస్తూనే జపాన్ ఒక యూనిక్ సినిమా అని అర్థం అవుతుంది. కార్తి కాదు ఇలాంటి పాత్రని గతంలో ఎవరూ చేయలేదు. ఈ దీపావళికి పర్ఫెక్ట్ ఫిల్మ్. ఇది గొప్ప థియేటర్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే చిత్రం. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుంది. తప్పకుండా ఎంజాయ్ చేస్తారు.
- ఇందులో నా పాత్ర ఒక సర్‌ప్రైజ్ ఎలిమెంట్‌గా ఉంటుంది. నటిగా కనిపిస్తాను. నా పాత్ర జపాన్ జీవితంలో కీలకంగా ఉంటుంది. కార్తి, నా పాత్రకు మధ్య చాలా ఆసక్తికరమైన ట్రాక్ ఉంటుంది. జీవి ప్రకాష్ నేపథ్య సంగీతం అద్భుతంగా ఉంటుంది. థియేటర్‌లో గ్రేట్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది. పాటలు కూడా చాలా యూనిక్‌గా ఉంటాయి. ఎస్ఆర్ ప్రభు సినిమాపట్ల చాలా ప్యాషన్ ఉన్న ప్రొడ్యూసర్. నేను పని చేసిన బెస్ట్ ప్రొడ్యూసర్స్‌లో ప్రభు ఒకరు.

బీహార్‌లో 65%కు రిజర్వేషన్లు

(మొదటిపేజీ తరువాయి)

కులాలకు 20 శాతం, ఒబిసి, ఇబిసిలకు 43 శాతం రిజర్వేషన్ లభిస్తుంది. ప్రస్తుతం ఒబిసి, ఇబిసిలకు కలిపి 30 శాతం రిజర్వేషన్ ఉండగా.. తాజాగా మరో 13 శాతం పెరగనుంది. షెడ్యూల్డ్ తెగలు (ఎస్‌టి) వారికి 2 శాతం రిజర్వేషన్లను ప్రతిపాదించారు. దీంతో రాష్ట్రంలో రిజర్వేషన్లు 65 శాతానికి చేరుకుంటాయి. ప్రస్తుత ఇబిసిలకు 18 శాతం, ఒబిసిలకు 12 శాతం, ఎస్‌సిలకు 16 శాతం, ఎస్‌టిలకు ఒక శాతం రిజర్వేషన్లు ఉన్నాయి.

కులగణనకు సంబంధించిన నివేదికను బీహార్ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన కొన్ని గంటల్లోనే నితీష్ కుమార్ ప్రభుత్వం ఈ రిజర్వేషన్ల పెంపు నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఇక ఒబిసిల్లో యాదవులు అత్యధిక సంఖ్యలో ఉన్నారు. రాష్ట్ర జనాభాలో వారు 14.27 శాతం ఉన్నారు. కులగణన ప్రకారం.. బీహార్ 13 కోట్ల జనాభాలో 36 శాతం మంది ఇబిసిలు, 27.1 శాతం మంది వెనకబడిన తరగతులు, 19.7 శాతం మంది ఎస్‌సిలు, 1.7 శాతం ఎస్‌టీ జనాభా, జనరల్ కేటగిరిలో 15.5 శాతం ఉన్నారు. దీని ప్రకారం రాష్ట్రంలో 60 శాతానికి పైగా ప్రజలు వెనకబడిన, అత్యంత వెనకబడిన తరగతులకు చెందినవారే ఉన్నారు.



సామాజిక, ఆర్థిక గణాంకాల విడుదల

రాష్ట్రంలో ఇటీవల జరిగిన కులగణన ఆధారంగా ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితిపై గణాంకాలను బీహార్ ప్రభుత్వం మంగళవారం విడుదల చేసింది. రాష్ట్ర అసెంబ్లీకి కూడా ఈ గణాంకాలను సమర్పించింది. ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం, అక్కడ 33.16 శాతం ఓబీసీలు, ఈబీసీలు 33శాతం మంది, 42.92 శాతం ఎస్సీలు, 42.7 శాతం ఎస్టీలు, 25.9 శాతం ఓసిలు పేదరికంలో ఉన్నట్టు స్పష్టమైంది. 34 శాతంమంది పేదలనీ, వారికి రూ.6,000ల కంటే తక్కువ నెల వారీ ఆదాయం వస్తున్నదని నివేదిక తెలిపింది. అలాగే 29శాతం మందికి పది వేల నుంచి రూ.50 వేల మధ్య ఆదాయం, 4శాతానికి మందే 50 వేల కంటే ఎక్కువ వస్తున్నదని పేర్కొంది.

ఓబీసీల్లో యాదవులు 35.8 శాతం, కుష్వాహ్ (34.3శాతం), కుర్మీ (29.9శాతం), బనియా (24.6 శాతం), మోమిన్ ముస్లిం (26.7శాతం), ధునియా ముస్లిం (31.4శాతం) బింద్ (44.1శాతం) పేదరికంలో ఉన్నారు. జనరల్ కేటగిరిలో ఉన్న అగ్రవర్ణాలకు చెందిన భూమిహార్‌లు 27.58శాతం పేదరికంలో ఉన్నారు. 25.52 శాతం బ్రాహ్మణ కుటుంబాలు పేదరికంలో ఉన్నాయి. 24.89శాతం రాజ్‌పుట్‌లు పేదరికంలో ఉన్నారు. కాయస్థులు అత్యంత సంపన్న సామాజికవర్గానికి చెందిన వారుగా నిలిచారు. రాష్ట్రంలో కేవలం 13.38శాతం కాయస్థులు మాత్రమే పేదరికంలో ఉన్నారు. ముస్లింలలోని షేక్, పఠాన్, సైయద్‌ల ఆర్థిక స్థితిగతులను కూడా ప్రభుత్వం విడుదల చేసింది. షేక్ సామాజిక వర్గానికి చెందిన వారిలో 25.84శాతం మంది పేదవారి కేటగిరిలో ఉన్నారు. పఠాన్ సామాజిక వర్గంలో 22.20శాతం కుటుంబాలు పేదరికంతో బాధపడుతున్నారు. 17.61శాతం సైయద్ కుటుంబాలు కూడా పేదరికంలో ఉన్నాయి. బీహార్ ప్రభుత్వం అక్టోబర్ 2న సామాజిక వర్గాల వారీ జనగణన వివరాలను వెల్లడించింది. మంగళవారం సామాజిక, ఆర్థిక పరిస్థితికి సంబంధించిన గణాంకాలను విడుదల చేసింది.

కొలీజియం సిఫారసులన్నింటిని ఆమోదించాలి

న్యూఢిల్లీ : న్యాయమూర్తుల నియామకానికి సంబంధించిన కొలీజియం ప్రతిపాదనల పేర్లను ఆమోదించే సమయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న పిక్ అండ్ సెలెక్ట్' విధానంపై సుప్రీంకోర్టు మంగళవారం ఆందోళన వ్యక్తం చేసింది. న్యాయమూర్తుల కోసం సిఫారసు చేసిన వారి సీనియారిటీకి ఈ విధానం భంగం కలిగించిందని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. 'ఈ పిక్ అండ్ సెలెక్ట్ ఆపివేయాలి. ఇది ఆఫ్ హ్యాండ్ రిమార్క్ కాదు' అని కోర్టు పేర్కొంది. సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయ మూర్తుల నియామకంలో కొలీజియం సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించడంలో జరుగుతున్న జాప్యాన్ని ప్రశ్నిస్తూ బెంగళూరు న్యాయవాదుల సంఘం దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం సుప్రీం కోర్టు న్యాయమూర్తులు సంజయ్ కిషన్ కౌల్, సుధాన్షు ధులియాలతో కూడిన ధర్మాసనం విచారించింది. ప్రభుత్వం సమస్యను పరిష్కరించ 'కుంటే ఈ అంశంపై ఉత్తర్వులు జారీ చేసేందుకు వెనుకాడబోమని న్యాయమూర్తులు తెలిపారు.

పంజాబ్, హర్యానా హైకోర్టులను ఉదాహరణ ను ఉదహరించిన ధర్మాసనం 'సుప్రీం కోర్ట్ కొలీజియం పంజాబ్, హర్యానా హైకోర్టులకు ఐదుగురు న్యాయవాదులను పదోన్నతి కల్పించాలని సిఫార్సు చేసింది. సీరియల్ నంబర్ 1, 2లో ఉంచబడిన పేర్లను విస్మరించి, కేంద్రం కేవలం ముగ్గురి పేర్లను మాత్రమే క్లియర్ చేసింది' అని ధర్మాసనం పేర్కొంది. సెలెక్టివ్‌గా నియామకాలు జరిగితే సీనియారిటీ క్రమానికి విఘాతం కలుగుతుందని, తద్వారా యువ న్యాయవాదులు న్యాయమూర్తులుగా బాధ్యతలు చేపట్టేందుకు అనువుగా ఉండదని ధర్మాసనం పేర్కొంది. పెండింగ్‌లో ఉన్న పేర్లపై సుప్రీం కోర్టు స్పందిస్తూ కొలీజియం ప్రతిపాదించిన 14 పేర్లు ఇప్పటికీ ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయని, కొలీజియం పునరుద్ఘాటించినప్పటికీ వాటిలో ఐదు పెండింగ్‌లో ఉన్నాయని ధర్మాసనం పేర్కొంది.

'ఈ బదిలీలు తప్పక జరగాలి. లేకుంటే అది వ్యవస్థలో విపరీతమైన క్రమరాహి త్యాన్ని సృష్టిస్తుంది' అని జస్టిస్ ఎస్‌కె కౌల్ అన్నారు. సెంటర్ ఫర్ పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్ తరపు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపిస్తూ.. అటార్నీ జనరల్ ఇచ్చిన హామీలపై చర్యలు తీసుకోకుండా కోర్టు కొరడా ఝుళిపించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ కేసు తదుపరి విచారణను నవంబర్ 20కి వాయిదా వేసింది.

ఇజ్రాయిల్ మారణకాండకు ముగింపు పలకాలి

(మొదటిపేజీ తరువాయి)

మద్దతుకు కృతజ్ఞతలు తెలుపుతూ, పాలస్తీనా రాష్ట్రానికి చెందిన 73శాతం భూమిని ఇజ్రాయిల్ స్వాధీనం చేసుకున్నదని రాయబారి అద్నాన్ అబు అల్హైజా తెలిపారు. బెంజమిన్ నెతన్యాహు, ఒక వలసదారు, రెండు దేశాల సిద్ధాంతాన్ని కూడా ధ్వంసం చేశారని విమర్శించారు. తమ సొంత ఇంటిలోని ఒక్క గదిలోకెళ్లడానికి కూడా ఆక్రమిత బలగాలు అనుమతించవని అన్నారు. వారికి ఆత్మరక్షణ అంటే నరమేధమని అన్నారు. అల్-అక్సా మసీదును విభజించేందుకు జియోనిస్టులు ప్రయత్నిస్తున్నారని ఆయన అన్నారు.

అక్రమ వలసలే ప్రాథమిక సమస్య అని పేర్కొంటూ, 1967 సరిహద్దుల్లో తూర్పు జెరూసలేం కేంద్రంగా పాలస్తీనా రాష్ట్రాన్ని ఏర్పాటుచేయాలని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి రాజా పిలుపునిచ్చారు.

సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యుడు ప్రకాశ్ కరత్, సీపీఐ ఎంఎల్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, ఫార్వర్డ్ బ్లాక్ ప్రధాన కార్యదర్శి జి.దేవరాజన్, ఆర్‌ఎస్‌పీ నేత ప్రకాశరావు మాట్లాడారు. సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందా కరత్ తదితరులు పాల్గొన్నారు. జననాట్య మంచ్ కళాకారులు కళారూపాలు ప్రదర్శించారు.

రైళ్లలో టపాసులు తెస్తే జైలుకే...

- రైల్వే స్టేషన్లలో సీసీ టీవీల నిఘా



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దీపావళి పండుగ సందర్భంగా ప్రయాణీకులు రైళ్ళలో టపాసులు/మండే స్వభావం గల వస్తువులను వెంట తీసుకెళ్లడం నేరమనీ, అలా చేస్తే నేరుగా జైలుకు పంపుతామని దక్షిణ మధ్య రైల్వే మంగళవారంనాడొక పత్రికా ప్రకటనలో తెలిపింది. రైల్వేస్టేషన్ల ప్రాంగణాల్లో కూడా ఇలాంటి పదార్థాలను ఉంచడం భద్రతకు తీవ్ర ముప్పు అని హెచ్చరించింది. రైళ్లలో ప్రయాణించే తోటి ప్రయాణీకులతో పాటు, రైల్వే ఆస్తులకు కూడా నష్టం కలుగుతుందనీ, అందువల్ల ప్రయాణీకులు ఇలాంటి చర్యలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేసింది. ఈ తరహా వస్తువులతో పట్టుబడితే రైల్వే చట్టం 1989 సెక్షన్ 164, 165 ప్రకారం రూ. వెయ్యి జరిమానాతో పాటు మూడేండ్లు జైలు శిక్ష కూడా అనుభవించాల్సి వస్తుందని తెలిపారు. ఎవరైనా రైళ్లు, రైల్వే ప్రాంగణాల్లో ఇలాంటి వస్తువులను గమనిస్తే హెల్ప్‌లైన్ నెంబర్ 139కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని చెప్పారు. వీటి నివారణ కోసం రైళ్లు, రైల్వే స్టేషన్లలో స్నిఫర్ డాగ్స్‌తో తనిఖీలు, సీసీటీవీ నిఘా కెమేరాలు ఏర్పాటు చేశామన్నారు.

బీహార్‌లో అంగన్‌వాడీల నిరసన

- గౌరవ వేతనం పెంచాలని డిమాండ్


పాట్నా : బీహార్‌లో ఓ వైపు శాసనసభ సమావేశాలు జరుగుతుండగా మరోవైపు వందలాది మంది అంగన్‌వాడీలు, సహాయకులు మంగళవారం రాజధాని పాట్నా వీధుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ వారు అసెంబ్లీని ముట్టడించేందుకు ప్రయత్నించారు. నితీష్ కుమార్ నేతృత్వంలోని మహా ఘట్‌బంధన్ ప్రభుత్వం తమ డిమాండ్లను తీర్చకపోతే రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

తమ నెలవారీ గౌరవ వేతనాన్ని పెంచాలని, ప్రభుత్వోద్యోగులతో సమానమైన హోదా కల్పించాలని అంగన్‌వాడీలు కోరుతున్నారు. పదవీ విరమణ వయసును పెంచాలని, అంగన్‌వాడీలకు ఐదు లక్షలు, సహాయకులకు మూడు లక్షల రూపాయల చొప్పున ఏకమొత్తంలో అందజేయాలని కూడా వారు డిమాండ్ చేస్తున్నారు. పెద్ద ఎత్తున మోహరించిన భద్రతా సిబ్బంది అంగన్‌వాడీలను అసెంబ్లీ ప్రధాన గేటు సమీపంలో అడ్డుకున్నారు.

నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు నీటి ఫిరంగులను ప్రయోగించి, లాఠీఛార్జి చేశారు. ఈ దశలో కొందరు అంగన్‌వాడీలు కిందపడిపోయారు. నీటి ఫిరంగులను ఉపయోగించడంతో పలువురికి గాయాలయ్యాయి. తమ గౌరవ వేతనం చాలా తక్కువగా ఉన్నదని, దానిని రెట్టింపు చేయాలని కోరుతున్నామని అంగన్‌వాడీలు తెలిపారు. ఎన్నికల ప్రచార సమయంలో నేతలు దీనిపై హామీ ఇచ్చారని, అయితే సంవత్సరం దాటినా మాట నిలుపుకోలేదని వారు మండిపడ్డారు. ఆ తర్వాత సీపీఐ, సీపీఐ (ఎం), సీపీఐ (ఎంఎల్) సహా పలు ప్రతిపక్ష పార్టీలకు చెందిన సభ్యులు పోలీసు చర్యను శాసనసభలో లేవనెత్తారు.

క్రిమినల్ చట్టాలపై నివేదికలకు పార్లమెంటరీ స్టాండింగ్ ప్యానెల్ ఆమోదం

- బిల్లుల్లో పలు మార్పులు చేయాలని సూచన
- భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసిన ప్రతిపక్ష సభ్యులు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ), సీఆర్‌పీసీ, ఎవిడెన్స్ యాక్ట్‌లను మార్చడానికి ఉద్దేశించిన మూడు బిల్లులను పరిశీలించిన హోం వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ నివేదికలను ఆమోదించింది. ప్యానెల్‌లోని ప్రతిపక్ష సభ్యులు భిన్నాభిప్రాయాలను సమర్పించి నప్పటికీ ఈ నిర్ణయం తీసుకుంది. అయితే బిల్లుల్లో పలు మార్పులు చేయాలని నివేదిక సూచించినట్లు తెలిసింది.కేంద్ర మాజీ హోం మంత్రి పి. చిదంబరం సహా కొందరు సభ్యులు అసమ్మతి నోట్లు సమర్పించేందుకు మరికొంత సమయం కోరారు. వారికి బుధవారం వరకు గడువు ఇచ్చారు. చిదంబరం, టిఎంసి సభ్యులు డెరెక్ ఓ బ్రియాన్, కకోలి ఘోష్ దస్తిదార్‌లు సవివరమైన అసమ్మతి నోట్‌లను సమర్పిస్తారని ప్రతిపక్ష వర్గాలు తెలిపాయి.

కాంగ్రెస్‌కు చెందిన అధిర్ రంజన్ చౌదరి, దిగ్విజయ సింగ్, డీఎంకేకు చెందిన ఎన్‌ఆర్ ఎలాంగో సహా పలువురు సభ్యులు ఇప్పటికే అసమ్మతి నోట్లు సమర్పించారు. ప్యానెల్‌లోని మొత్తం 10 మంది ప్రతిపక్ష సభ్యులు వేర్వేరుగా అసమ్మతి నోట్లు సమర్పించనున్నట్లు వర్గాలు తెలిపాయి. సోమవారం జరిగిన సమావేశంలో చిదంబరం పలు సూచనలు చేస్తూ సుదీర్ఘంగా మాట్లాడినట్లు తెలిసింది. బిల్లుల్లో హిందీని ఉపయోగించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ప్రతిపక్ష సభ్యుల్లో కొందరు అభిప్రాయపడ్డారు. అయితే బిల్లులకు ఇచ్చిన హిందీ పేర్లను కమిటీ పేర్కొంది. భారతీయ శిక్షాస్మృతిని మార్చుతూ తీసుకొచ్చిన భారతీయ న్యాయ సంహిత, చిన్న దొంగతనం, పరువు నష్టం, ఆత్మహత్యాయత్నం వంటి కొన్ని నేరాలకు శిక్షకు ప్రత్యామ్నాయ రూపంగా సమాజ సేవను సూచించింది. కొంతమంది సభ్యులు కమిటీ సమాజ సేవను నిర్వచించాలని, అది ఊహించినదంతా చేయాలని కోరారు. అంతేకాకుండా, కొంతమంది సభ్యులు ఇప్పుడు కొత్త శిక్షా చట్టం కింద ఉగ్రవాదం, అవినీతి, వ్యవస్థీకృత నేరాలను తీసుకురావడానికి అనుకూలంగా లేరు.

తెలంగాణలో బీజేపీకి ఒక్క సీటు రానివ్వం

జాతీయ స్థాయిలో 28 పార్టీలతో ఇండియా కూటమి

ఇబ్రహీంపట్నంలో సీపీఐ(ఎం)ను గెలిపించాలి : సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు



మాట్లాడుతున్న బీవీ రాఘవులు

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి

వచ్చే ఎన్నికల్లో బీజేపీకి తెలంగాణలో ఒక్క సీటు కూడా రానివ్వబోమని, అన్ని చోట్లా అడ్డుకుంటామని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు అన్నారు. కమ్యూనిస్టులకు పట్టం కట్టాలని రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్ అధ్యక్షతన నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీతో కలిసి రాఘవులు మాట్లాడారు. ఐదు రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్నికల్లో ఇండియా కూటమిలోని పార్టీలకు సీట్ల సర్దుబాటు విషయంలో కాంగ్రెస్ మోసం చేసిందన్నారు.


ఆ పార్టీకి అధికారంలోకి రావాలన్న ధ్యాసే లేదని, ఈ తరుణంలో వామపక్షాలను గెలిపించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని కోరారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రాకుండా అడ్డుకునితీరుతామని స్పష్టం చేశారు. బీజేపీ 2024 ఎన్నికల కోసం ఆయా రాష్ట్రాల్లో అనుకూలమైన శక్తులను ఇప్పటినుంచే పోగేసుకుంటుందన్నారు. ఎస్సీ వర్గీకరణ పేరుతో మాదిగల ఓట్లు దండుకునేందుకు ప్రయత్నాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే దేశంలో ప్రజాస్వామ్యాన్ని సమాధి చేస్తుందని, నియంతృత్వాన్ని కొనసాగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. మునుగోడు ఎన్నికల అనంతరం బీజేపీ ఆశలు సన్నగిల్లాయని, తెలంగాణలో దాని ప్రభావం తగ్గిందన్నారు. బీజేపీ బెదిరింపులకు భయపడే బీఆర్ఎస్ కమ్యూనిస్టులతో తెగదెంపులు చేసుకుందన్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఒక్క సీటు లేకపోయినా ప్రాంతీయ పార్టీల ఎంపీలు బీజేపీకి మద్దతు ఇచ్చే పరిస్థితి ఉందని విమర్శించారు. కాంగ్రెస్ కూడా ఇదే కోవలోకి చేరిందన్నారు.

తాము అధికారంలోకి వస్తే వామపక్షాలకు మంత్రులు, ఎమ్మెల్సీలు వంటి పదవులు ఇస్తామని చెప్తున్నారని, మాకు ఆ పదవులు ముఖ్యం కాదని ప్రజాక్షేత్రంలో నిలబడి తేల్చుకుంటామన్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లకు గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ప్రజా పోరాటాలు నిర్వహించిన చరిత్ర ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఉందని, ఎంతో మంది ప్రాణ త్యాగాలు చేసి నిర్మించిన ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోయేందుకు ప్రతి కార్యకర్త.. కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు.

సభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ, ఇబ్రహీంపట్నం అభ్యర్థి పగడాల యాదయ్య, పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మధుసూదన్‌రెడ్డి, జగదీశ్, జిల్లా నాయకులు సామెల్, జగన్, అంజయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఏ నియోజకవర్గంలో చూసినా రాజకీయ 'మార్పు' కనిపిస్తోంది. మార్పు రావాలని చర్చ జరుగుతోంది. కాళోజీ నారాయణరావు చెప్పినట్టు 'కాలంబు రాగానే కాటేసి తీరాలే..' అన్న కవిత ప్రస్తుత రాజకీయాలకు దర్పణంగా కనపడుతోంది. క్షేత్రస్థాయిలో 'మార్పు' ఏ స్థాయి వరకు వెళ్లిందనే విషయంలో భిన్నాభిప్రాయాలున్నా, అనూహ్యమైన రాజకీయ మార్పులు జరుగుతుండటంతో రాజకీయ పండితులు సైతం విస్మయానికి గురవుతున్నారు. బీఆర్ఎస్ ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో అన్నారం, మేడిగడ్డ బ్యారేజీలలో లోపాలు బహిర్గతం కావడం ఆ పార్టీకి తలనొప్పిగా మారింది. నిధులు, విధులు లేక స్థానిక ప్రజాప్రతినిధులు ఇబ్బందులు పడ్డా, అప్పుసప్పులు చేసి పనులు చేసినా బిల్లులు చెల్లించకపోవడం పట్ల స్థానిక ప్రజాప్రతినిధుల్లో తీవ్ర అసంతృప్తి ఉంది. దీంతో మార్పు కోరుతూ పార్టీ మారుతున్నారు. ఒక్కో నియోజకవర్గంలో ఒక్కోస్థాయిలో 'మార్పు' రాజకీయాలున్నాయి.

మార్పు దిశగా రాజకీయం



స్థానిక ప్రజాప్రతినిధుల్లో అసంతృప్తి

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పలువురు సిట్టింగ్ ఎమ్మెల్యేలపై వ్యతిరేకత బహిర్గతమవుతోంది. 'పాతాయనకే ఎన్నిసార్లు ఎయ్యాలే.. ఒక్కసారి కొత్తోళ్లకేత్తేంది..?' అన్న చర్చ జరుగుతుండటం గమనార్హం. ప్రధాన రాజకీయ పార్టీల ప్రచారాలకు మస్తుగా జనం వస్తున్నరు.. పోతున్నరు.. అదే సమయంలో 'మార్పు' మీద కూడా మస్తు చర్చ జరుగుతోంది.. గ్రామగ్రామాన ఇదే పరిస్థితి కనిపిస్తుండడంతో బీఆర్ఎస్‌లో గుబులు ప్రారంభమైంది. వలసలపైనా ఆసక్తికరంగా చర్చ జరుగుతోంది.

> పాతాయనకే ఎన్నిసార్లు ఎయ్యాలే..
> కొత్తోళ్లకేత్తే ఏమవుతుంది.?
> ప్రజల్లో చర్చోపచర్చలు

స్థానిక ప్రజాప్రతినిధుల కట్టడి

స్థానిక ప్రజాప్రతినిధుల పదవీకాలం సైతం పూర్తి కావచ్చింది. ఈ క్రమంలో ఐదేండ్లుగా స్థానిక సంస్థల అభివృద్ధికి ఇచ్చిన నిధులు అరకొరనే. రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని, ఈలోపు పనులు చేస్తే తరువాత బిల్లులు ఎత్తుకోవచ్చని అధికారులు తొందరపెట్టడంతో స్థానిక ప్రజాప్రతినిధులందరూ పనులు చేయడానికి అప్పులు చేశారు. కానీ నిధులు రాక.. అప్పుల్లో కూరుకుపోయిన ప్రజాప్రతినిధులు మండల సర్వసభ్య సమావేశాల్లో తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. పలు మండలాల్లో బీఆర్ఎస్‌కు రాజీనామా ప్రకటించగానే ఎమ్మెల్యేలు వారిని కట్టడి చేయడం తెలిసిందే. ఆ పరిణామాలన్నింటినీ ఇప్పుడు స్థానిక ప్రజాప్రతినిధులు నెమరు వేసుకుంటున్నారు.

సభలకు స్పందన కరువు..

వర్ధన్నపేట నియోజకవర్గంలోని భట్టుపల్లిలో జరిగిన బహిరంగసభలో సీఎం కేసీఆర్ ప్రసంగానికి ఎలాంటి స్పందన లేకపోగా, ఆయన మాట్లాడటం ప్రారంభం కాగానే జనం లేచి వెళ్లడంతో 20 నిమిషాల్లో సభను ముగించారు. సీఎం కేసీఆర్ ప్రసంగంలోనూ చెణుకులు బెణుకులు లేవు.


ప్యాకేజీ స్టార్లతో గందరగోళం

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా రాజకీయ పార్టీల్లో చేరికలు, వలసలు సర్వసాధారణమయ్యాయి. బీఆర్ఎస్‌లోకి వచ్చేవాళ్లకు భారీ ప్యాకేజీలు ఆఫర్ చేస్తున్నట్టు ప్రచారంలో వుంది. ఎమ్మెల్యేల వ్యవహారశైలితో ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చిందని పలువురు నేతలు కాంగ్రెస్‌లో చేరుతున్నారు. మరో 22 రోజులపాటు ప్రచారానికి సమయమున్న క్రమంలోనే భారీ మార్పులు చోటు చేసుకుంటుండటంతో రానురాను రాజకీయాలు మరింత ఆసక్తికరంగా, ఉత్కంఠభరితంగా మారే అవకాశాలు లేకపోలేదు.



నేటితో ముగియనున్న పోస్టల్, హోం బ్యాలెట్

హోం ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ల కోసం దరఖాస్తు గడువు బుధవారంతో ముగియనుంది. 80 ఏండ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు కేంద్ర ఎన్నికల సంఘం శాసనసభ ఎన్నికల్లో హోం ఓటింగ్‌కు అవకాశం కల్పించింది. ఎన్నికల విధుల్లో ఉండే ఉద్యోగులు, సిబ్బందితో పాటు మరో 13 విభాగాలకు చెందిన వారికి పోస్టల్ బ్యాలెట్ అవకాశాన్ని కల్పించారు. ఎయిర్ పోర్ట్ అథారిటీ, ఫుడ్ కార్పొరేషన్, రైల్వే, దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియో, విద్యుత్, ఫ్యామిలీ వెల్ఫేర్, ఆర్టీసీ, మీడియా ప్రతినిధులకు కూడా పోస్టల్ బ్యాలెట్ అవకాశం ఉంది.




నామినేషన్ వేసేందుకు వచ్చిన నిర్వాసితులు

నిర్వాసితుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం

అందుకే సీఎంపై పోటీ చేస్తున్నా..

మల్లన్నసాగర్ బాధితుడు ఆడియాల కర్ణాకర్‌రెడ్డి గజ్వేల్‌లో ఇండిపెండెంట్‌గా నామినేషన్

నవతెలంగాణ-తొగుట

ప్రభుత్వం మల్లన్నసాగర్ నిర్వాసితుల సమస్యలను నిర్లక్ష్యం చేసినందుకు నిరసనగా గజ్వేల్ నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేశానని ఆడియాల కర్ణాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. 2016లో మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం ఎకరాకు రూ.6 లక్షలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఈ క్రమంలో గ్రామాల్లో నిర్వాసితులను కులాలుగా విడగొట్టి డబ్బులు ఆశా చూపి మోసం చేశారని తెలిపారు. వేములఘాట్ గ్రామంలో నిర్వాసితులందరమూ ఏకమై 900 రోజులకుపైగా ధర్నా నిర్వహించామని, తమ సమస్యలను పరిష్కరించాలని నాయకులు, అధికారులకు విన్నపాలు చేసినా ఫలించలేదన్నారు. 2019 జనవరిలో ఎకరానికి రూ.11.50 లక్షలు ఇస్తామని ఒప్పందం కుదిరితే.. రూ.11 లక్షలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారని, అదీ అందరికీ అందలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2021 మార్చిలో వేములఘాట్ ప్రజలను గ్రూపులుగా విభజించి గ్రామాన్ని ఖాళీ చేయించి, ఆర్అండ్ఆర్ కాలనీకి తీసుకొచ్చారని తెలిపారు. గ్రామప్రజలంతా ఒక్కచోటే ఉంటామనుకుంటే.. ఆర్ అండ్ ఆర్ కాలనీ పూర్తిగా నిర్మాణం కాకముందే మధ్యలో నుంచి ట్రిబుల్ ఆర్ రోడ్ ఏర్పాటు చేశారన్నారు. దానివల్ల గ్రామాన్ని 7 ముక్కలుగా చేసి కుక్కలు చింపిన విస్తారకులను చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2022 ఫిబ్రవరి నెలలో మల్లన్నసాగర్ ప్రాజెక్టు ప్రారంభం రోజు సీఎం కేసీఆర్.. నిర్వాసితులకు ఇవ్వాల్సిన రూ.100 కోట్లు ఇస్తామని చెప్పినా అమలుకు నోచుకోలేదన్నారు. ప్రభుత్వం తమకు చేసిన ద్రోహానికి నిరసనగా సీఎంపై మరికొంతమంది నిర్వాసితులు నామినేషన్ వేస్తారని తెలిపారు.

కమ్యూనిస్టు యోధుడు సాయుధ పోరాట సేనాని

భూములన్నింటినీ పేదలకు పంచిన త్యాగధనుడు


- ఉరిశిక్ష రద్దుకు పోరాడిన నంద్యాల శ్రీనివాస్‌రెడ్డి
- ఎమ్మెల్యేగా ప్రజాక్షేత్రంలో ఎన్ఎస్ఆర్

నైజాం సర్కారును గడగడలాడించి రజాకార్ల తోకలు కత్తిరించిన వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొన్న త్యాగధనులు.. ఆ తర్వాతా ప్రజాక్షేత్రంలో ప్రజల వెంటే నడిచారు. అందులో నంద్యాల శ్రీనివాస్‌రెడ్డి ఒకరు. అజ్ఞాతంలోనూ తన కర్తవ్యాన్ని మరువకుండా.. మరెందరినో నాయకులుగా తీర్చిదిద్దారు. చివరి శ్వాస వరకు కమ్యూనిస్టు యోధునిగా.. ఎన్ఎస్ఆర్‌గా పేదల గుండెల్లో నిలిచారు.

నవతెలంగాణ- మఠంపల్లి

నల్లగొండ జిల్లా కేతెపల్లి మండలం కొప్పోలు గ్రామంలో 1918లో భూస్వామ్య కుటుంబంలో జన్మించారు నంద్యాల శ్రీనివాస్‌రెడ్డి. ఆయన సూర్యాపేట, వరంగల్‌లో పాఠశాల విద్యనభ్యసించారు. పేదలపై భూస్వాములు, జమీందారులు, జాగీర్దారుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఆంధ్రమహాసభలో చేరారు. తమకు చెందిన వందలాది ఎకరాల భూములను పేదలకు పంచారు. కమ్యూనిస్టు ఉద్యమాల్లో పాల్గొన్నారు. నిజాం సర్కార్, రజాకార్ల దౌర్జన్యాలను ఎదిరించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో దళ కమాండర్‌గా పనిచేస్తూ నిజామాబాద్, ఖమ్మం, భువనగిరి, వరంగల్ ప్రాంతాల్లో పనిచేశారు. ఈ క్రమంలో జైలు జీవితం గడిపారు. 1948 సెప్టెంబర్ 17 నిజాం ప్రభుత్వాన్ని భారత ప్రభుత్వంలో విలీనం చేసి నిజాం లొంగిపోయాడు. అనంతరం మిలటరీ సైన్యాలు సాయుధ పోరాట దళాలపై, నాయకులపై దాడులను ఉధృతం చేశాయి. ఆ పోరాటంలో పాల్గొన్న యోధులకు మిలటరీ ట్రిబ్యునల్ ఉరిశిక్ష విధించింది. అందులో ఎన్ఎస్ఆర్‌తోపాటు నల్లగొండ జిల్లా అప్పాజిపేటకు చెందిన ఎర్రబోతు రామిరెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లా రామానుజాపురానికి చెందిన గార్లపాటి రఘుపతి రెడ్డి, కడవెండికి చెందిన నల్ల నర్సింహులు ఉన్నారు. ట్రిబ్యునల్ ఉరిశిక్ష అమలు చేసేందుకు నిర్ణయించడంతో ఎన్ఎస్ఆర్ జైలు నుంచి తప్పించుకొని అజ్ఞాతంలోకి వెళ్లి పోరాటం కొనసాగించారు.

వందలాది మందికి సాయుధ శిక్షణ ఇచ్చారు. ఈ కాలంలో జైలుశిక్ష అనుభవిస్తున్న వారిని, ఉరిశిక్ష పడిన వారిని విడుదల చేయాలని తెలంగాణ డిఫెన్స్ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ విషయం అంతర్జాతీయంగా చర్చనీయాంశం కావడం, మేధావులు స్పందించి, ఇతర దేశాల న్యాయవాదులు ఉరి శిక్ష రద్దు కోసం వాదించడంతో చివరకు సుప్రీం కోర్టు దాన్ని రద్దు చేసింది. అనంతరం 1962 ఎన్నికల్లో నకిరేకల్ ఎమ్మెల్యేగా గెలిచి ప్రజాసంక్షేమానికి పాటుపడ్డారు. పార్టీ చీలిక అనంతరం సీపీఐ(ఎం)లో చివరి వరకు పనిచేశారు. పార్టీ నిర్మాణంలో బీఎన్, వీఎన్, స్వరాజ్యంతో కలిసి పని చేశారు. 1969లో మిర్యాలగూడలో స్థిరపడ్డారు. సాయుధ పోరాటంలో పాల్గొన్న స్వాతంత్ర్య సమర యోధుల పింఛన్ దరఖాస్తుల స్క్రీనింగ్ కమిటీలో ఎన్ఎస్ఆర్ మెంబర్‌గా ఉన్నారు. ఎంతో మందికి పింఛన్ ఇప్పించి వారి కుటుంబాలను ఆదుకున్నారు. కడవరకు ఎర్రజెండాను విడువని ఎన్ఎస్ఆర్ 101 ఏండ్ల వయసులో 20 ఫిబ్రవరి 2019లో కన్నుమూశారు.



కుటుంబ నేపథ్యం

ఎన్ఎస్ఆర్‌కు నలుగురు కుమారులు హరీందర్‌రెడ్డి, వేణుధర్ రెడ్డి, కృపాకర్ రెడ్డి, అశోక్ రెడ్డి, కూతురు విద్య ఉన్నారు. వేణుధర్ రెడ్డి, కృపాకర్ రెడ్డి తండ్రి బాటలో నడుస్తూ సీపీఐ(ఎం)లోనే పనిచేస్తున్నారు.

తండ్రి బాటలోనే తనయులు

సీపీఐ(ఎం) మూడో జాబితా

కోదాడ నియోజకవర్గం



అభ్యర్థి పేరు : మట్టిపెల్లి సైదులు
స్వగ్రామం : రాఘవాపురం, మోతే మండలం, సూర్యాపేట జిల్లా
తల్లిదండ్రులు : మట్టిపెల్లి రామచంద్ర, ఎల్లమ్మ
రాజకీయ ప్రస్థానం : ప్రస్తుతం సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యునిగా, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఎస్ఎఫ్ఐ మోతె మండల కన్వీనర్‌గా, డీవైఎఫ్ఐ సూర్యాపేట డివిజన్ కార్యదర్శిగా, వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ కార్యదర్శిగా పని చేశారు.

మునుగోడు నియోజకవర్గం



అభ్యర్థి పేరు : దోనూరి నర్సిరెడ్డి
తల్లిదండ్రులు : దోనూరి అచ్చమ్మ-లింగారెడ్డి
స్వగ్రామం : ఉమ్మడి సర్వేల్ గ్రామపంచాయతీ పరిధిలోని నాగంవారిగూడెం
రాజకీయ ప్రస్థానం : 1985లో సీపీఐ(ఎం) సభ్యులుగా చేరారు. 2009లో మునుగోడు డివిజన్ కార్యదర్శిగా, నల్లగొండ జిల్లా సహాయ కార్యదర్శి, 1983లో పీఏసీఎస్ డైరెక్టర్‌గా, సర్వేల్ గ్రామపంచాయతీ వార్డు మెంబర్‌గా, 2004లో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆలిండియా కమిటీ సభ్యునిగా పనిచేశారు. ప్రస్తుతం సీపీఐ(ఎం) యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యునిగా, సీఐటీయూ జిల్లా కోశాధికారిగా ఉన్నారు.

ఇల్లందు నియోజకవర్గం



అభ్యర్థి పేరు : దుగ్గి కృష్ణ (50)
తల్లిదండ్రులు : అనంతమ్మ, నరసయ్య
సామాజిక తరగతి : ఎస్టీ (కోయ)
ప్రస్తుత నివాసం : కామేపల్లి
సొంతూరు : మద్దులపల్లి గ్రామం, కామేపల్లి మండలం.
రాజకీయ ప్రస్థానం : మద్దులపల్లి గ్రామ సర్పంచ్‌గా పనిచేసిన తండ్రిని స్ఫూర్తిగా తీసుకొని దుగ్గి కృష్ణ సీపీఐ(ఎం)లో పనిచేశారు. తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) రాష్ట్ర కార్యదర్శిగా చేశారు. సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడిగా, గిరిజన సంఘం రాష్ట్ర నాయకునిగా కొనసాగుతున్నారు. 2003లో పోడు భూముల కోసం రీబ్యాక్ పాలసీకి వ్యతిరేకంగా పోరాడి 59 రోజులు వరంగల్ సెంట్రల్ జైల్లో ఉన్నారు.

గ్రేటర్ హైదరాబాద్‌లో రూ.3,50,65,450 సీజ్

పలు నియోజకవర్గాల్లో కేసులు నమోదు

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో భాగంగా గ్రేటర్ హైదరాబాద్‌లో ఫ్లయింగ్ స్క్వాడ్ ద్వారా భారీగా నగదు పట్టుకుంటున్నారు. తాజాగా మంగళవారం రూ.90,000ను పట్టుకోగా.. ఇప్పటివరకు 3,50,65,450 నగదును సీజ్ చేశారు. పోలీస్ అథారిటీ ద్వారా మంగళవారం రూ.4,90,470 స్వాధీనం చేసుకోగా, ఇప్పటివరకు 48,88,56,881 నగదును సీజ్ చేశారు. ఎఫ్.ఐ.ఆర్‌లు 12 నమోదు కాగా, ఇప్పటి వరకు 612 నమోదు చేశారు. లా అండ్ ఆర్డర్ కింద ఇప్పటి వరకు 4,558 లైసెన్స్ ఆయుధాలను సేకరించారు. అలాగే సీఆర్‌పీసీలో ఇప్పటి వరకు 887 కేసులు నమోదయ్యాయి. మంగళవారం 16 బైండోవర్ చేయగా, ఇప్పటి వరకు 2,332 బైండోవర్ చేశారు. ఇప్పటి వరకు 2,321 నక్బాస్ ఆపరేషన్స్ చేశారు. అలాగే ఇప్పటి వరకు 2076 నాన్ బెయిలబుల్ వారంట్‌లను నమోదు చేశారు. ఎంసీసీ కింద పబ్లిక్ ప్రాపర్టీస్‌లో మొత్తం 5,594 వాల్ రైటింగ్, 83,578 పోస్టర్లు, 29,188 బ్యానర్లు తొలగించారు. 90,101 విగ్రహాలను మూసేశారు. ప్రయివేటు ప్రాపర్టీల్లో 21,100 పోస్టర్లు, 5,230 బ్యానర్లు తొలగించారు. 22,446 విగ్రహాలను మూసేశారు. మొత్తం 30 అనుమతి లేకుండా సమావేశాలు నిర్వహించినట్టు గుర్తించారు. ఎక్సైజ్ శాఖ ద్వారా మంగళవారం 33 లీటర్ల లిక్కర్‌ను సీజ్ చేశారు. కార్వాన్ నియోజకవర్గంలోని పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ హైవే లంగర్ హౌస్‌చెక్ పోస్ట్ వద్ద ఎస్ఎస్‌టీ టీమ్స్ రూ.లక్ష, చార్మినార్ నియోజకవర్గంలోని పురానాపూల్ గుడ్ విల్ హోటల్ వద్ద రూ.1,52,000 సీజ్ చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కింద 9 కేసులు నమోదు కాగా.. యాకత్‌పుర 1, మలక్ పేట్ 5, నాంపల్లి 1, జూబ్లీహిల్స్ 1, ముషీరాబాద్ 1 నియోజకవర్గాల్లో సంబంధిత పార్టీ ప్రతినిధులపై కేసుల నమోదుకు చర్యలు తీసుకున్నారు.



పంచ్ తంత్రం!




ఇంతనున్నటి రోడ్డు ఇంతసన్నటి కాల్వ
ఇంతవెల్గుల బల్బు నిచ్చినాము
గంటగంటకు బస్సు వెంటవెంటనే రైలు
నోటిపిలుపు తోడ ఆటో రిక్షా
వాడవాడకు పార్కు తేడలేని జలము
తెచ్చినామో లేదో తేల్చుమనుచు
బదులెన్ని పెట్టాము గుడులెన్ని కట్టాము
కావల్సినవియన్ని కాంచుమనుచు
అరిచిగీపెట్టి మరిమరీ అడిగి ఓటు
ఔను కాదందువా చెప్పుమనిరి రోజు
పవరులోనున్న పార్టీకి పవరులావు
ఓటరన్నకు తేల్చుకొనుటయే చావు

\- ఏనుగు నరసింహారెడ్డి

నమ్ముకొని
అధికారము ఇస్తే
నమ్మకము
పోగొట్టుకుంటివి
పదవి అధికారము
బూని పదిలముగా
తల బోడిజేస్తివి
దాపునకు రానునుచు
చనువుగా టోపి
పెడితివి లాభపడితివి

\- కాళోజీ



Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

హైదరాబాద్‌లో.. బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	61,360	▼ 110
22 క్యారెట్లు	56,250	▼ 100
కిలో వెండి	77,500	▼ 700

చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్



ఫారం రేటు	రూ. 97
రిటైల్ (లైవ్)	రూ. 119
స్కిన్‌తో	రూ. 173
స్కిన్‌లెస్	రూ. 196

బిజినెస్

ఐఆర్‌సిటిసి లాభాల్లో 30 శాతం వృద్ధి

- మధ్యంతర డివిడెండ్ 125 శాతం



న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జులై నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో ఇండియన్ రైల్వే కాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్ సిటిసి) ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు సాధించింది. గడిచిన క్యూ2లో 30.36 శాతం వృద్ధితో రూ.294.67 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే సెప్టెంబర్ త్రైమాసికంలో రూ.226 కోట్ల లాభాలు నమోదు చేసింది. అధిక కాటరింగ్ అమ్మకాలు, టికెట్ల విక్రయాలు సంస్థ రెవెన్యూ, లాభాలను పెంచాయి. గడిచిన క్యూ2లో ఐఆర్‌సిటిసి రెవెన్యూ 23.91 శాతం వృద్ధితో 995.31 కోట్లకు చేరింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.805.80 కోట్ల రెవెన్యూ ఆర్జించింది. 2023-24కు గాను ప్రతీ రూ.2 ముఖ విలువ కలిగిన ఈక్విటీ షేర్‌పై మధ్యంతర డివిడెండ్ కింద రూ.2.50 శాతం లేదా 125 శాతం చెల్లించడానికి ఆ కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. ఇందుకోసం రూ.160 కోట్లు వ్యయం కానుంది. ఈ మొత్తాన్ని నవంబర్ 17న వాటాదారులకు పంపించనుంది. మంగళవారం ఎన్‌ఎస్‌ఇలో ఐఆర్‌సిటిసి షేర్లు 1.68 శాతం పెరిగి రూ.682.75 వద్ద ముగిసింది. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 6.29 శాతం లాభపడింది.

చైనా జిడిపి అంచనాలు పెంపు

- 5 శాతం నుంచి 5.4 శాతానికి చేరొచ్చు: ఐఎంఎఫ్



జెనివా : చైనా ఆర్థిక వ్యవస్థ మరింత మెరుగు పడొచ్చని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) అంచనా వేసింది. ప్రస్తుత ఏడాదిలో ఆ దేశ వృద్ధి రేటు 5.4 శాతంగా, 2024లో 4.6 శాతంగా ఉండొచ్చని విశ్లేషించింది. ఇంతక్రితం ఈ అంచనాలు వరుసగా 5 శాతం, 4.2 శాతంగా ఉన్నాయి. కాగా వచ్చే ఏడాది జిడిపిలో తగ్గుదల చోటు చేసుకోవచ్చని పేర్కొంది. ఇందుకు అక్కడి రియల్ ఎస్టేట్ రంగం స్తబ్దతలో ఉండటమే కారణమని పేర్కొంది. ఇంతక్రితం అంచనాలతో పోల్చితే చైనా ఆర్థిక వ్యవస్థ 0.4 శాతం పాయింట్లు మెరుగుపడొచ్చని ఐఎంఎఫ్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ గీతా గోపినాథ్ పేర్కొన్నారు. ప్రాపర్టీ మార్కెట్‌కు మద్దతును ఇవ్వడానికి చైనా ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందన్నారు.

ఈ సమగ్ర పాలసీ ప్యాకేజీలో ఆచరణ సాధ్యం కాని ప్రాపర్టీ డెవలపర్‌ల నిష్క్రమణను వేగవంతం చేయడం, నివాసాల ధరల స్థిరీకరణకు అడ్డంకులను తొలగించడం, గృహ నిర్మాణాలను పూర్తి చేయడానికి అదనపు కేంద్ర ప్రభుత్వ నిధులను కేటాయించడం, బ్యాలెన్స్ షీట్‌లను సరిచేయడం తదితర చర్యలు చేపడుతుందని గీతా పేర్కొన్నారు. 2023లో ప్రపంచ వృద్ధి 3 శాతంగా, 2024లో 2.9 శాతంగా ఉండొచ్చని ఐఎంఎఫ్ అంచనా వేసింది. ఇది దశాబ్దాల్లోనే అత్యల్ప వృద్ధి రేటుగా నమోదు కానుందని పేర్కొంది. ప్రపంచ స్థాయిలో వ్యవస్థలు ఆర్థిక పునరుద్ధరణకు తీవ్ర సవాళ్లను ఎదుర్కొంటున్నాయని పేర్కొంది. 2000 నుంచి 2019 మధ్య ప్రపంచ సగటు వృద్ధి రేటు 3.8 శాతంగా ఉంది. దీంతో పోల్చితే ఆర్థిక వ్యవస్థలు ఒత్తిడిలోకి జారుతున్నాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సిటీ బ్యాంక్‌లో 24వేల మందిపై వేటు..!

న్యూయార్క్ : అమెరికా కేంద్రంగా పని చేస్తోన్న గ్లోబల్ బ్యాంకింగ్ సంస్థ సిటీ గ్రూప్ వేలాది మంది ఉద్యోగులపై వేటు వేయనుందని రిపోర్టులు వస్తున్నాయి. సంస్థ పునర్‌వ్యవస్థీకరణ ప్రక్రియలో భాగంగా సంస్థలోని 10 శాతం మంది (దాదాపు 24వేల ఉద్యోగులు)ను ఇంటికి పంపించనుందని సమాచారం. 2021లో సిటీ గ్రూప్ సిఇఒగా బాధ్యతలు స్వీకరించిన జేన్ ఫ్రాజర్ పొదుపు చర్యల్లో భాగంగా ఉద్యోగుల తొలగింపునకు వివిధ కన్సల్టెన్సీలో చర్చలు జరుపుతున్నారని రిపోర్టులు వస్తున్నాయి సిటీ గ్రూపులో ప్రపంచ వ్యాప్తంగా 2.40 లక్షల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. ఆ సంస్థలో ప్రస్తుతం ఉన్న 13 అంచెల వ్యవస్థను ఎనిమిది అంచెలకు కుదించే యోచనలో ఉన్నారు.

మూడు రోజులు ఆఫీసుకు రావాల్సిందే : విప్రో

బెంగళూరు : దిగ్గజ ఐటి కంపెనీ విప్రో తమ ఉద్యోగులు వారంలో కనీసం మూడు రోజులు కార్యాలయాలకు రావాల్సిందేనని స్పష్టం చేసింది. క్రమంగా ఇంటి నుంచి పని పద్ధతికి స్వస్తి పలుకుతున్నట్లు వెల్లడించింది. ఇకపై ఉద్యోగులంతా వారంలో మూడు రోజులు తప్పనిసరిగా ఆఫీస్‌కు వచ్చి పనిచేయాలని ఆదేశాలు జారీ చేసింది. నవంబర్ 15 నుంచి కొత్త ఆదేశాలు అమల్లోకి వస్తాయని పేర్కొంది. ఇప్పటికే 55 శాతం మంది ఉద్యోగులు వారానికి మూడుసార్లు ఆఫీసులకు వస్తున్నారని వెల్లడించింది. టిసిఎస్ ఇన్ఫోసిస్ దిగ్గజాలు ఇప్పటికే ఉద్యోగుల్ని ఆఫీసుకు వచ్చి పని చేయాలని సూచించిన విషయం తెలిసిందే.

ఇంటి వద్దకే మరింత మెరుగైన బ్యాంకింగ్ సేవలు

- ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ వెల్లడి

హైదరాబాద్ : సీనియర్ సిటిజన్లు, వికలాంగ వినియోగదారులకు ఉచితంగా ఇట్టి వద్దకే అందిస్తున్న బ్యాంకింగ్ సేవలను మరింత మెరుగుపర్చుతున్నట్లు ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ తెలిపింది. ప్రస్తుత డోర్‌స్టెప్ నగదు పికప్, డెలివరీని రూ.5,000 నుండి రూ.25,000కి పెంచినట్లు పేర్కొంది. ఎంపిక చేసిన ప్రాంతాల్లో పని దినాల్లో ఎటువంటి ఖర్చు లేకుండా నెలకు నాలుగు సార్లు ఈ సేవలను పొందవచ్చని ఆ బ్యాంక్ ఎండి, సిఇఒ ఇట్టిరా డేవిస్ తెలిపారు.

ఉదయ్ ఆటోకేర్‌తో టర్టిల్ వాక్స్ భాగస్వామ్యం

హైదరాబాద్ : చికాగో కేంద్రంగా పని చేస్తున్న కార్ కేర్ కంపెనీ టర్టిల్ వాక్స్ ఇంక్ తాజాగా తమ మరో కో-బ్రాండెడ్ కార్ కేర్ స్టూడియోని హైదరాబాద్‌లో ఉదయ్ ఆటో కేర్ భాగస్వామ్యంతో ప్రారంభించినట్లు ప్రకటించింది. ఎల్‌బి నగర్‌లో అత్యాధునిక టర్టిల్ వాక్స్ డిటైలింగ్ టెక్నాలజీలు, అధిక అర్హత కలిగిన, శిక్షణ పొందిన సేవా సిబ్బందితో కూడిన టర్టిల్ వాక్స్ కార్ కేర్ స్టూడియో వినియోగదారులకు కావాల్సిన విధంగా కార్ డిటైలింగ్ సేవలు, ఉత్పత్తుల యొక్క విస్తృత శ్రేణీని అందించనున్నట్లు టర్టిల్ వాక్స్ కార్ కేర్ ఇండియా ఎండి, సాజన్ మురళి పురవంగర, ఉదయ్ ఆటో కేర్ యజమాని ఉదయ్ భాస్కర్ తెలిపారు.

'న్యూస్‌క్లిక్' కేసులో
ఢిల్లీ పోలీసులకు 'సుప్రీం' నోటీసులు



న్యూఢిల్లీ : న్యూస్‌క్లిక్ కేసులో ఢిల్లీ పోలీసులకు అత్యున్నత న్యాయస్థానం నోటీసులు ఇచ్చింది. న్యూస్‌క్లిక్ వ్యవస్థాపక చీఫ్ ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్త, హెచ్‌ఆర్ విభాగం చీఫ్ అమిత్ చక్రవర్తి ఇటీవల తమ అరెస్టును సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల (నివారణ) కింద ఢిల్లీ పోలీసులు తమను అరెస్టు చేయడాన్ని సమర్థిస్తూ ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన నిర్ణయాన్ని కొట్టివేయాలని కోరుతూ దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్లను సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఈ కేసును అత్యవసర విచారణ కోసం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ ముందు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ ప్రస్తావించారు. ఈ కేసు సోమవారం విచారణకు వచ్చినప్పుడు, ధర్మాసనం ఢిల్లీ పోలీసుల ప్రతిస్పందనను కోరుతూ రెండు పిటిషన్లకు సంబంధించి నోటీసు జారీ చేసింది. పిటిషనర్ల తరపున కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ.. 'అరెస్టుకు సంబంధించిన ఆధారాలను రాతపూర్వకంగా అందించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన పంకజ్ బన్సల్ తీర్పును విస్మరించారు. అరెస్టు మెమో చూడండి. ఏమీ అందించబడలేదు' అని పేర్కొన్నారు. జస్టిస్ గవాయ్ జోక్యం చేసుకుని 'సెలవు ముగిసిన వెంటనే మేము ఈ పిటిషన్‌ను తీసుకుంటాం' అని చెప్పారు. వైద్య కారణాలపై మధ్యంతర ఉత్తర్వుల కోసం ఒక దరఖాస్తు కూడా ఉంది. పిటిషనర్ పుర్కాయస్థ వయసు 71 ఏండ్లు' అని కపిల్ సిబల్ తెలిపారు. ప్రధాన పిటిషన్లతో పాటు మధ్యంతర ఉపశమనం కోసం దాఖలు చేసిన దరఖాస్తును కూడా అదేరోజు విచారిస్తామని జస్టిస్ గవాయ్ తెలిపారు.

నిరసనల విజయవంతంపై ఏఐకేఎస్ అభినందన

సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) పిలుపు మేరకు న్యూస్‌క్లిక్ మీడియా సంస్థపై జరిగిన అన్యాయమైన దాడులకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా నిరసనలను విజయవంతం చేసి నందుకు రైతులను అఖిలభారత కిసాన్ సభ (ఎఐకెఎస్) అభినందించింది. 'న్యూస్‌క్లిక్‌పై ఎఫ్‌ఐఆర్‌లో రైతుల ఉద్యమం దేశ వ్యతిరేకమని, విదేశీ, తీవ్రవాద శక్తులు నిధులు సమకూరు స్తున్నాయని నిరాధారంగా ఆరోపించింది. నిబద్ధత, దేశభక్తి కలిగిన రైతుల పోరాటాన్ని అప్రతిష్టపాలు చేసే ప్రయత్నం ఇది. వ్యవసాయం, మండీలు, ఆహార పంపిణీపై నియంత్రణను కార్పొరేట్ దిగ్గజాలకు అప్పగించ డానికి రూపొందించిన మూడు వ్యవసాయ చట్టాల వెనుక మోసపూరిత అజెండాను రైతులు చారిత్రాత్మక ఉద్యమం ద్వారా తిప్పికొట్టారు. ఆ ఉద్యమంపై కేంద్రం చేస్తున్న తప్పుడు ఆరోపణలను తిప్పికొడుతూ రైతులు మరోసారి ఐక్యంగా ఉద్యమించారు' అని ఎఐకెఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్ ధావలే, విజూ కృష్ణన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. న్యూస్‌క్లిక్‌పై నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్ కాపీలను దగ్ధం చేశారు. హర్యానా, పంజాబ్, జమ్మూ కాశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, కేరళ, త్రిపుర, పశ్చిమ బెంగాల్, ఇతర రాష్ట్రాలతో సహ అనేక రాష్ట్రాల్లో ఆందోళనలు జరిగాయి.

ఉదాసీనత వద్దు

- ఎన్నికలయ్యేదాకా నిరంతర శిక్షణ ఇవ్వాల్సిందే

పోలీసులు, ఎన్నికల సిబ్బందికి కేంద్ర బృందం దిశానిర్దేశం



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఎన్నికల నిర్వహణ విధుల్లో క్షేత్రస్థాయి సిబ్బంది, ఉద్యోగులు ఎవరూ ఉదాసీనంగా వ్యవహరించొద్దని కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక పరిశీలకులు అజయ్ వి నాయక్ మంగళవారం ఢిల్లీ నుంచి జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు పోలీసులు, సిబ్బంది, అధికారులకు నిరంతర శిక్షణ ఇస్తూనే ఉండాలనీ, దీనివల్ల అప్రమత్తత పెరుగుతుందని సూచించారు. పోలింగ్ ముగిసిన తర్వాత ఓట్ల వివరాలున్న ఈవీఎమ్‌లను భద్రపరిచే స్ట్రాంగ్ రూముల్లో, మరే ఇతర ఈవీఎమ్‌లు భద్రపరచకూడదని హెచ్చరించారు. ఓటరు కార్డుల ముద్రణను ఈనెల 20వ తేదీకల్లా పూర్తిచేయాలని ఆదేశించారు. మరో కేంద్ర ప్రత్యేక పరిశీలకులు (పోలీస్) దీపక్ మిశ్రా మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల విధులతో సంబంధంలేని వ్యక్తులు వృథా కాలక్షేపం చేస్తూ తచ్చాడటాన్ని అనుమతించకూడదని చెప్పారు. నోటిపై చేసిన పోస్టల్ ఓటర్ల తుదిజాబితా ముద్రిత ప్రతిని తప్పనిసరిగా అభ్యర్థులకు, రాజకీయపార్టీలకు ఇచ్చి, వారి నుండి పొందిన రశీదును భద్రపరచుకోవాలనీ, దీనివల్ల కొన్ని వివాదాలను, దురభిప్రాయాలను దూరం చేయవచ్చని సూచించారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు తేలికగా స్పందించడం లేదా అతిగా స్పందించడం క్షంతవ్యంకాదన్నారు. మరో కేంద్ర ప్రత్యేక పరిశీలకులు (వ్యయం) ఆర్. బాలకృష్ణన్ మాట్లాడుతూ అభ్యర్థుల ఖర్చులపై తప్పనిసరిగా షాడో రిజిస్టర్లను నిర్వహించాలని ఆదేశించారు. పోటీ చేసే అభ్యర్థులు, రాజకీయ పార్టీలకు కేవలం సాంకేతిక కారణాలతో అనుమతులను తిరస్కరించవద్దని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ అన్నారు. ఎన్నికల నియమ నిబంధనలకు లోబడి అభ్యర్థులు ప్రజాభిప్రాయం కోరేందుకు అవసరమైన ప్రచారం చేసుకొనేందుకు అవకాశాలు కల్పించాలని చెప్పారు. నామినేషన్ల సందర్భంగా దాఖలైన అఫిడవిట్లను పరిశీలించి వెంటనే అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు సీఈఓ లోకేష్ కుమార్, జాయింట్ సీఈఓ సర్ఫరాజ్ అహ్మద్, డిప్యూటీ సీఇఓ సత్యవాణి, డీజీపీ అంజనీ కుమార్, రాష్ట్ర నోడల్ అధికారి(వ్యయం) మహేష్ భగవత్, రాష్ట్ర పోలీసు నోడల్ అధికారి సంజయ్ కుమార్ జైన్ తదితరులతో పాటు అన్ని జిల్లాల కలెక్టర్లు, డీఈఓలు, ఎస్పీలు, కమిషనర్లు పాల్గొన్నారు.

పట్టుబడిన సొత్తు రూ.518 కోట్లు

ఎన్నికల తనిఖీల సందర్భంగా స్వాధీనం చేసుకున్న సొత్తు రూ.518.90 కోట్లకు చేరింది. ఈ మొత్తం షెడ్యూల్ అమల్లోకి వచ్చిన అక్టోబర్ 9 నుంచి నవంబర్ 7వతేదీ ఉదయం 9 గంటల వరకు జరిగిన తనిఖీల సందర్భంగా స్వాధీనం చేసుకున్నదని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ తెలిపారు. గడచిన 24 గంటల్లో రూ. 3.21 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నామనీ, దీనితో మొత్తం నగదు విలువ రూ.177.32 కోట్లకు చేరిందని వివరించారు. బంగారం, వెండి, వజ్రాలు, ప్లాటినంతో పాటు ఇతర ఆభరణాలు, అక్రమ మద్యం, ఉచిత పంపిణీ కోసం తరలిస్తున్న బియ్యం, చీరలు, కుక్కర్లు, క్రీడాసామాగ్రి వంటి వాటిని కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు.ఈ మొత్తం విలువ రూ. 518 కోట్ల 90 లక్షల 13 వేల 033 ఉంటుందని అంచనా వేశామన్నారు.

ఏదో ఒకరోజు నేను సీఎం అవుతా..!

నల్లగొండ అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్

ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి కోమటిరెడ్డి ముఖ్యమంత్రి అయ్యే రోజు వస్తుందని, ఏదో ఒకరోజు తాను సీఎంను అవుతానని భువనగిరి ఎంపీ, నల్లగొండ అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఆయన మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన రోడ్డు షోలో మాట్లాడుతూ... బీఆర్ఎస్ పార్టీ మాయమాటలు చెప్పి గత ఎన్నికల్లో విజయం సాధించిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో తమకు నష్టం జరుగు తుందని తెలిసినా సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చా రన్నారు. కానీ తెలంగాణ ఇచ్చిన లక్ష్యం నెరవేరలేదన్నారు. రైతులు, చేనేత కార్మికులు, విద్యార్థుల ఆత్మహత్యల కోసం తెలంగాణను తెచ్చుకోలేదన్నారు. ఉద్యోగాల భర్తీలో కేసీఆర్ ప్రభుత్వం విఫలమైందన్నారు. పోలింగ్ చివరి రోజున రైతుబంధు డబ్బులు వేస్తారని, ఎవరూ మోసపోవద్దని హితవు పలికారు. నల్లగొండలో ప్రస్తు తం కనిపిస్తోన్న అభివృద్ధి తాను చేసిందే అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తాము ఇచ్చిన ఆరు గ్యారంటీ లను అమలు చేస్తామన్నారు. కాంగ్రెస్ కట్టిన నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులు డెబ్బై ఏళ్లయినా చెక్కు చెదరలేదని, కానీ కేసీఆర్ కట్టిన కాళేశ్వరం బ్యారేజీ అప్పుడే బీటలు వారిందన్నారు. డిసెంబర్ 9 మన లక్కీ నెంబర్ అని, ఆ రోజు సోనియా పుట్టిన రోజు అని, ఆ రోజే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు.

మూతపడుతున్న ఆస్పత్రులు, సేవల కేంద్రాలు



బలయ్యేది పిల్లలే !

ప్రతి రోజూ గాజాలో సగటున 134మంది పిల్లలు యుద్ధానికి బలవుతు న్నారు. ఇప్పటివరకు నెల రోజుల్లో 4,237 మంది చిన్నారులు మృతి చెందారని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ నెల రోజుల్లో గాజాలో 10,328మంది పాలస్తీని యన్లు మరణించగా, ఇజ్రాయిల్‌లో 1400 మందికిపైగా చని పోయారు.

గాజా, జెరూసలేం : ఎంతగానో అవసరమైన ఇంధన నిల్వలు తరిగిపోతుండడంతో యుద్ధంతో అతలాకుతలమవుతున్న గాజాలోని ఆరోగ్యం, పారిశుధ్యం, నీరు, ఆహార సర్వీసులు దాదాపు 'బ్రేకింగ్ పాయింట్' కు చేరుకుంటున్నాయని ఐక్యరాజ్య సమితి పేర్కొంది. ఇప్పటివరకు గాజా స్ట్రిప్‌కు 569 ట్రక్కుల సాయం వచ్చింది కానీ వాటిల్లో ఏ ఒక్క దాంట్లోనూ ఇంధనం లేదని ఐక్యరాజ్య సమితి మానవతా వ్యవహారాల సమన్వయ కార్యాలయ ప్రతినిధి (ఒసిహెచ్‌ఎ) జేన్స్ లారెకె వ్యాఖ్యానించారు. "మరిన్ని కార్యాలయాలు, సేవల కేంద్రాలు మూతపడుతున్నాయి. ప్రాణాలను కాపాడే మార్గాలు కూడా మూసు కుపోతున్నాయి." అని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి క్రిస్టినా లిండ్‌మేరర్ వ్యాఖ్యానించారు.

గాజాలోకి ఇంధనాన్ని అనుమతించే విషయమై జరుగుతున్న చర్చల్లో కొంత పురోగతి వుందంటూ గత వారం ఐక్యరాజ్య సమితి ఎయిడ్ చీఫ్ మార్టిన్ గ్రిఫిత్స్ పేర్కొన్నారు. కానీ ఆ చర్చలు విఫలమైనట్లు కనిపిస్తోంది. గాజాను పూర్తిగా దిగ్బంధించాలన్న వ్యూహంలో భాగంగా ఇజ్రాయిల్ ఆ ప్రాంతంలోకి విద్యుత్ సరఫరాను నిలిపివేసి, ఇంధనాన్ని ప్రవేశించకుండా దిగ్బంధించింది. దాదాపు రెండు దశాబ్దాలుగా గాజాపై ఇజ్రాయిల్ భూ, వైమానిక, సముద్ర ఆంక్షలను అమలు చేస్తోంది.

దాడులతో బందీలను విడుదల చేయలేకపోతున్నాం

గాజాలో బందీలుగా వున్న 12మందిని విడుదల చేయడానికి తాము సిద్ధంగా వున్నప్పటికీ ఇజ్రాయిల్ వైమానిక, పదాతి దాడుల కారణంగా విడుదల చేయలేకపోతున్నామంటూ హమస్ సాయుధ విభాగం ఖ్వాసమ్ బ్రిగేడ్స్ తెలిపింది. ఈ మేరకు టెలిగ్రామ్ చానెల్‌లో పోస్టు పెట్టింది. 241మందిని బందీలుగా చేపట్టారని ఇజ్రాయిల్ పేర్కొం టోంది. వారిలో ఇప్పటివరకు నలుగురిని విడుదల చేవారు. వారిలో ఇద్దరు ఇజ్రాయిలీలు కాగా మరో ఇద్దరు అమెరికన్లు.

ఇజ్రాయిల్‌కు ఆయుధాలు తెస్తున్న నౌక దిగ్బంధం

ఆయుధాలు, ఇతర మిలటరీ పరికరాలను తీసుకుని ఇజ్రాయిల్‌కు వెళ్లడానికి వాషింగ్టన్ లోని ఒక ఓడరేవులో సిద్ధంగా వున్న నౌకను వందలా దిమంది అమెరికన్ ఆందోళన కారులు అడ్డగించారు. గాజాలో తక్షణమే కాల్పుల విరమణ జరగాలని వారు డిమాండ్ చేశారు.

ఐఆర్ఆర్ కేసులో చంద్రబాబుకు ఊరట

నవతెలంగాణ-హైదరాబాద్

రాజధాని అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు ఏపీ హైకోర్టు ఊరటను కల్పించింది. చంద్రబాబు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను మంగళవారం హైకోర్టు విచారించింది. ఇరువైపు వాదనలు విన్న హైకోర్టు తదుపరి విచారణను ఈ నెల 22కి వాయిదా వేసింది. అప్పటి వరకు చంద్రబాబును అరెస్ట్ చేయకూడదని సీఐడీని ఆదేశించింది. మరోవైపు వాదనల సందర్భంగా ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ వాదనలు వినిపిస్తూ స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు మధ్యంతర బెయిల్‌పై ఉన్నారని ఆ గడువు ముగిసే వరకు ఆయనను అరెస్ట్ చేయబోమని కోర్టుకు తెలిపారు. ఆయన స్టేట్మెంట్‌ను రికార్డ్ చేసిన హైకోర్టు అరెస్ట్ చేయవద్దని ఆదేశిస్తూ తదుపరి విచారణను 22కి వాయిదా వేసింది.

ఎమ్మెల్సీ కవిత కారును తనిఖీ చేసిన అధికారులు

నవతెలంగాణ-హైదరాబాద్

ఎన్నికల ప్రచారంలో భాగంగా నిజామాబాద్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రయాణిస్తున్న కారును ఎన్నికల కమిషన్ అధికారులు తనిఖీ చేశారు. వీరికి ఆమె పూర్తిగా సహకరించారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇక ఇవాళ సోషల్ మీడియాలో కల్వకుంట్ల కవిత ఓ ట్వీట్ చేశారు. పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లు.. సీఎం కేసీఆర్‌ని చూసి రేవంత్ రెడ్డి, ఈటల రాజేందర్ రెండు చోట్ల పోటీ చేస్తున్నారని.... ఈ ఎన్నికల్లో వారికి వాతలే తప్ప ఫలితం శూన్యం అంటూ ఎద్దేవా చేశారు. వాళ్లు ఎన్ని చోట్ల పోటీ చేసినా విజయం మాత్రం బీఆర్ఎస్ పార్టీదేనన్నారు.

గుజరాత్‌లో ఇద్దరు మాజీ సీఎంలకు తప్పిన పెను ప్రమాదాలు

నవతెలంగాణ-గుజరాత్

ఒకే రోజు ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులు తృటిలో పెను ప్రమాదాల నుంచి బయటపడ్డారు. వారిలో ఒకరు విజయ్ రూపానీ కాగా, మరొకరు సురేశ్ మెహతా. వీరిద్దరూ గుజరాత్‌కు సీఎంలుగా పనిచేసిన వారే. విజయ్ రూపానీ కాన్వాయ్ అహ్మదాబాద్-రాజ్‌కోట్ జాతీయ రహదారిపై ప్రయణిస్తుండగా సురేంద్రనగర్ జిల్లాలో ప్రమాదం చోటుచేసుకుంది. ప్రభు అనే వ్యక్తి తన బైక్‌పై రోడ్డు దాటేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో రూపానీ కాన్వాయ్‌లోని ఓ కారు ఢీకొట్టింది. గాయపడిన బాధితుడు ప్రభును ఆస్పత్రికి తరలించారు.

ప్రమాద సమయంలో రూపానీ మరో కారులో ఉన్నారు. కాగా బాధితుడికి స్వల్ప గాయాలైనట్టు పోలీసులు తెలిపారు. గుజరాత్‌లోనే జరిగిన మరో ప్రమాదం నుంచి మాజీ సీఎం సురేశ్ మెహతా కొద్దిలో తప్పించుకున్నారు. మోర్బీ జిల్లా హల్వద్ పట్టణ సమీపంలో ఆయన ప్రయాణిస్తున్న కారును ఓ ట్రక్కు ఢీకొట్టింది. ఓ మలుపు వద్ద ఈ ఘటన జరిగింది. కారును చూసి ట్రక్కు డ్రైవర్ అప్రమత్తమై బ్రేక్ వేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. అయితే, వేగం తగ్గడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని పోలీసులు తెలిపారు. ప్రమాద అనంతరం మెహతా మరో కారులో వెళ్లినట్టు పేర్కొన్నారు.

మొరాయించిన ఈవీఎం.. ఓటేయకుండానే వెనుతిరిగిన మిజోరం సీఎం

నవతెలంగాణ- ఐజ్వాల్

ఈశాన్య రాష్ట్రం మిజోరంలో ఎన్నికల పోలింగ్ కొనసాగుతున్నది. ఓటేయడానికి వచ్చిన మిజో నేషనల్ ఫ్రంట్ చీఫ్, ముఖ్యమంత్రి జొరాంతంగకు చేదు అనుభవం ఎదురైంది. ఉదయం పోలింగ్ ప్రారంభమైన కొద్దిసేపటికే సీఎం జొరాంతంగ తన ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఐజ్వాల్‌లోని వైఎంఏ పోలింగ్ కేంద్రానికి వచ్చారు.

అదే సమయంలో ఈవీఎం మెషిన్ మొరాయించింది. దీంతో కొద్దిసేపు పోలింగ్ కేంద్రంలోనే వేచిచూసిన ఆయన.. మిషిన్ పనిచేయడం లేదని అధికారులు చెప్పడంతో అక్కడి నుంచి వెనుతిరిగారు. టిఫిన్ చేసిన తర్వాత ఓటేసేందుకు మళ్లీ వస్తానని చెప్పారు. ఈవీఎం పనిచేయడం లేదని, దీంతో ఓటేయకుండానే తాను వెళ్లిపోతున్నాని మీడియాతో అన్నారు. ఈ ఎన్నికల్లో తాము పూర్తిస్థాయి మెజార్టీ సాధిస్తామని, మరోసారి ప్రభుత్వం ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే 21 స్థానాలు అవసరమని, తమకు 25 సీట్లు వస్తాయన్నారు. రాష్ట్రంలో బీజేపీతో ఎలాంటి పొత్తూ లేదని స్పష్టం చేశారు. తాము కేంద్రంలోని ఎన్డీయేలో భాగంగా ఉన్నామని, రాష్ట్రంలో బీజేపీతో ఎలాంటి భాగస్వామ్యం లేదన్నారు. రాష్ట్రంలో కూడా ఎన్డీయేకు అంశాలవారీగా మద్దతు ఇస్తున్నామని చెప్పారు.

బంగాళాఖాతంలో భూకంపం..

నవతెలంగాణ-న్యూఢిల్లీ

బంగాళాఖాతంలో స్వల్ప భూకంపం వచ్చింది. దీంతో అలలు తీర ప్రాంతాలకు పోటెత్తాయి. మంగళవారం తెల్లవారుజామున 5.32 గంటలకు బంగాళాఖాతంలో భూమి కంపించింది. దీని తీవ్రత 4.2గా నమోదైందని నేషనల్ సెంటర్ ఫర్ సీస్మోలజీ (ఎన్‌సీఎస్) తెలిపింది. అండమాన్ నికోబార్ దీవులకు వాయవ్య దిశగా సుమారు 200 నాటికల్ మైళ్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు గుర్తించింది. సముద్ర గర్భంలో 10 కిలోమీటర్ల లోతులో కదలికలు సంభ వించాయని తెలిపింది. భూకంపం వల్ల అండమాన్ నికోబార్ దీవులు ప్రభావి తమయ్యాయి. తీరంలో అలలు పోటెత్తడంతో సముద్రంలో అల్లకల్లోలంగా మారింది. కాగా, తీర ప్రాంతాల్లో హైఅలర్ట్ ప్రకటించిన అధికారులు.. సునామీ ముప్పు లేదని తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

- ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్‌కు స్థలాన్ని కేటాయించడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్

నవతెలంగాణ-హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్‌కు స్థలాన్ని కేటాయించడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. రూ.3.70 కోట్ల రూపాయల స్థలాన్ని ప్రభుత్వం జీవో విడుదల చేసి ఆర్బిట్రేషన్‌కు ఉచితంగా ఇవ్వడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ న్యాయవాది కోటి రఘునాథ్ రావు పిటిషన్ దాఖలు చేశారు. రాయదుర్గ, శేర్లింగంపల్లి మండల పరిధిలో ఆర్బిట్రేషన్‌కు మూడెకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయిస్తూ జీవో జారీ చేసింది.

నకిలీ ఓట్లపై 'నాట్ బిఫోర్ మి'

- విచారణ నుంచి తప్పుకున్న జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా

న్యూఢిల్లీ : రాష్ట్రంలో నకిలీ ఓట్లపై సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్ మంగళవారం విచారణకు వచ్చింది. జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా విచారణ నుంచి తప్పుకున్నట్లు తెలిపారు. గతంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసినందున ఈ కేసు విచారణ నుంచి తప్పుకుంటున్నట్లు ఆయన ప్రకటించారు. రాష్ట్రంలో దొంగ ఓట్లపై మాజీ రాష్ట్ర ఎన్నికల కమిషనరు నిమ్మగడ్డ రమేష్ కుమార్ ఆధ్వర్యంలోని సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బిఆర్ గవాయి, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ కేసు విచారణ నుంచి తప్పుకుంటున్నట్లు జస్టిస్ మిశ్రా ప్రకటించారు. దీంతో సిజెఐ ఆదేశాలతో మరో ధర్మాసనం ముందు జాబితా చేయాలని రిజిస్ట్రీకి జస్టిస్ బిఆర్ గవాయి సూచించారు.

పన్నుల్లో పంపిణీ కింద తెలంగాణకు రూ. 1,533.64 కోట్లు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పన్నుల్లో పంపిణీ వాటా కింద నవంబర్ నెలకు గాను తెలంగాణ రాష్ట్రానికి రూ.1,533. 64 కోట్లను కేంద్రం విడుదల చేసింది. సాధారంగా ప్రతి నెల 10న ఈ నిధులు విడుదల చేస్తున్నట్లు తెలిపింది. అయితే ఈసారి మూడు రోజుల ముందుగానే పన్నుల్లో పంపిణీ వాటాలను రాష్ట్రాలకు విడుదల చేసినట్లు వెల్లడించింది. పండుగ సమయంలో ముందస్తు నిధుల విడుదల రాష్ట్ర ప్రభుత్వాలకు మేలు చేస్తోందని అభిప్రాయపడింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది.